అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 17-2-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 47 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50

ఎన్నికల బాండ్లను స్వీకరించలేదు

ఖాతా కూడా ప్రారంభించలేదు : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలుగా కొంత మొత్తాలను సీపీఐ(ఎం) అందుకున్నట్టు ఒక వర్గం మీడియాలో వార్తలు వస్తున్నాయని, అయితే ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, తప్పుడు వార్తలని పార్టీ పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల బాండ్లను ఆమోదించడాన్ని సీపీఐ(ఎం) సైద్ధాంతికంగా వ్యతిరేకించిందన్నది వాస్తవమని పేర్కొంది. అందుకనే చట్ట ప్రకారం ఎన్నికల బాండ్లను స్వీకరించడానికి అవసరమైన ఎస్బీఐ ఖాతాను కూడా తెరవలేదని వివరించింది. సైద్ధాంతికంగా వ్యతిరేకత వున్న కారణంగానే ఎన్నికల బాండ్ల విధానాన్ని వ్యతిరేకిస్తూ తమ పార్టీ సుప్రీంకోర్టుకు వెళ్లిందని సీపీఐ(ఎం) పేర్కొంది.

కులగణనకు ఓకే

తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం

- ఈ అంశంపై శాసనసభలో సుదీర్ఘ చర్చ
- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం

బలహీన వర్గాల బలోపేతం కోసమేనన్న సీఎం రేవంత్



- వారిని ఆర్థికంగా నిలబెట్టటమే తమ లక్ష్యమని వెల్లడి
- సర్కారు చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదంటూ వ్యాఖ్య
- సందేహాలను నివృత్తి చేసిన డిప్యూటీ సీఎం, పొన్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కులగణన తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలంగాణలో సమగ్ర కులగణన, సామాజిక, ఆర్థిక, ఇంటింటి సర్వేకు సంబంధించి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు అధికార, ప్రధాన ప్రతిపక్షం, ఇతర పక్షాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చ అనంతరం తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.



చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ... బలహీన వర్గాలను ఆర్థికంగా నిలబెట్టడంతోపాటు జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించటమే తమ ప్రభుత్వ ఉద్దేశమని నొక్కి చెప్పారు. ఈ అంశంపై బీఆర్ఎస్ సభ్యుల తీరు సరికాదన్నారు. మంచి కార్యక్రమం చేపట్టాలనే ఉద్దేశంతో తీర్మానాన్ని సభలో చర్చకు పెట్టామన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బహిర్గతం చేయకుండా ఒక కుటుంబం తన దగ్గర దాచుకుని రాజకీయ అవసరమున్నప్పుడు ఆ వివరాలను వాడుకున్నదని ఆరోపించారు. ఆ సర్వే వివరాలను బయటపెట్టారా? అని ప్రశ్నించారు. బీసీ కులగణన విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదన్నారు. కులగణన తీర్మానంపై ప్రతిపక్షాలకు అనుమానముంటే సూచనలు సలహాలివ్వాలనీ, దానిపై ఏదైనా న్యాయపరమైన చిక్కులు వస్తాయనే అనుమానాలుంటే ప్రతిపక్షాలు సూచనలు, సలహాలు ఇవ్వాలే తప్ప ఈ తీర్మానానికే చట్టబద్ధత లేదనేలా చర్చ చేయటం మంచిది కాదన్నారు. కుల గణన వల్ల అరశాతం ఉన్న వాళ్లకు బాధ ఉంటుందన్నారు. బీఆర్ఎస్ సభ్యుడు కడియం శ్రీహరిని ఆయన పార్టీ నేతలే తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ తీర్మానం బలహీన వర్గాలను బలంగా తయారు చేయడమే తమ ఉద్దేశమనీ, బాధితులుగా ఉన్న వాళ్లను పాలకులుగా చేయాలన్నదే తమ ఆలోచన అన్నారు. ఆయా వర్గాలకు అండగా నిలబడాలంటే వారి లెక్కలు ఏంటో తెలియాలంటూ సుప్రీంకోర్టు వరకు చర్చలు జరిగాయని గుర్తు చేశారు. బలహీన వర్గాల లెక్కలు తేల్చి, వారి నిధులు, నియామకాల విషయంలో సహేతుకమైన వాటా ఇచ్చేందుకు యూపీఏ ప్రభుత్వం 2011లో ప్రయత్నం చేసిందన్నారు. కానీ ఆ తర్వాత వచ్చిన మోడీ ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని తొక్కిపెట్టిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు వచ్చి ఈ అంశంపై సూచనలు ఇవ్వాలని సీఎం కోరారు.

కులగణనను తాము ఆహ్వానిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గంగుల కమలాకర్ చెప్పారు. అయితే ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంలో స్పష్టత లేదని చెబుతూ.. ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలన్నారు. చర్చ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ .. తీర్మానంలో జన, కులం, అంటూ ద్వంద వైఖరి కనిపిస్తోందనీ, జనగణన చేసే హక్కు రాష్ట్రాలకు లేదని గుర్తు చేశారు. కేవలం కులగణన మాత్రమే చేసే హక్కు రాష్ట్రాలకు ఉంటుందన్నారు. తీర్మానానికి చట్టబద్ధత కల్పించాలనీ, అది లేకుండా తీర్మానం పెడితే లాభం ఉండబోదన్నారు. ఎన్నికల ముందు తీర్మానం చేసి దాని తర్వాత ఏం చేస్తారని ప్రశ్నించారు. కులగణన చేపట్టిన ప్రకారం తమకు రాజ్యాధికారం కావాలనీ, ...5లో

స్వాగతిస్తున్నాం



అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్

వివరాలు 13లో





కన్నెర్ర...

కదం తొక్కిన సంపద సృష్టికర్తలు

- డిమాండ్ల సాధనకు బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తాం
- లోక్‌సభ ఎన్నికలకు ముందు జాతీయ ఎజెండాలో ప్రజల జీవనోపాధి సమస్యలు
- రైతుల ఆత్మహత్యలకు ముగింపు పలికేందుకు ఎంఎస్పీ, రుణమాఫీ చేయాలి

గ్రామీణ భారత్ బంద్, సమ్మె సక్సెస్

- దేశం అంతటా రైతులు, కార్మికులు, గ్రామీణ ప్రజల ఆందోళన
- దేశంలో 600 పైగా జిల్లాల్లో బంద్, సమ్మె : సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సంపదసృష్టికర్తలు కదం తొక్కారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సమాఖ్యలు, సంఘాల ఉమ్మడి వేదిక పిలుపు మేరకు గ్రామీణ భారత్ బంద్‌తో పాటు పారిశ్రామిక, సెక్టోరల్ సమ్మె విజయవంతమైంది. నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ బంద్, సమ్మెకు మహిళలు, యువత, విద్యార్థులు, వ్యవసాయ కార్మికులు, ఇతర ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపాయి. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం సంఘీభావం తెలిపింది. ఉపాధ్యాయులు, ప్రొఫెషనల్స్, ...5లో



మోడీ సర్కార్‌పై రైతు, కార్మిక గర్జన

- ప్రజా వ్యతిరేక మోడీ సర్కార్ ను గద్దెదించాలి : జంతర్ మంతర్ ఆందోళనలో రైతు, కార్మిక నేతలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక మోడీ సర్కార్ పై రైతు, కార్మికులు గర్జించారు. రైతుల గ్రామీణ భారత్ బంద్, కార్మికుల పారిశ్రామిక సమ్మెకు సంఘీభావంగా శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు ...13లో

విధానాలు మార్చుకుంటారా... దిగిపోతారా?

మోడీకి వివిధ పార్టీలు, కార్మిక, రైతు, ప్రజాసంఘాల నేతల హెచ్చరిక

- పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తేనే దేశానికి రక్షణ
- అంబానీ, అదానీలకు సంపదను దోచిపెడుతున్న కేంద్రం
- కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి
- హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలే మార్గం
- కార్మికులు, కర్షకులు వేలాదిగా హాజరు
- సమ్మె-గ్రామీణ బంద్ విజయవంతం


వివరాలు 3లో



బీజేపీయేతర రాష్ట్రాల మెడపై కత్తి

- ద్రవ్యనియంత్రణ చట్టం పేరుతో కేంద్రం ఆంక్షలు
- పన్నుల వాటాలపై అడ్డదారిలో కోత
- కేంద్రం అనుసరిస్తున్న వివక్షపై సుప్రీం తలుపు తట్టాం : కేరళ ఆర్థిక శాఖ మాజీ మంత్రి ప్రొఫెసర్ థామస్ ఐజాక్

వివరాలు 13లో



మణిపూర్‌లో ఆగని హింసాకాండ

- చురచాంద్‌పూర్ జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల నివాసాలపై మూక దాడి
- భద్రతా సిబ్బంది కాల్పుల్లో ఇద్దరి మృతి, 12 మందికి గాయాలు

వివరాలు 13లో

కాంగ్రెస్ అకౌంట్లు సీజ్

ఆదాయ పన్ను శాఖ వెల్లడి

- అనుమతించిన ఐటీ అప్పిలియేట్ ట్రిబ్యునల్
- అధికార మత్తులో ప్రతిపక్ష పార్టీ అకౌంట్లు సీజ్
- ప్రజాస్వామ్యంపై దాడి : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- కాంగ్రెస్‌కు ప్రజా బలం ఉంది : రాహుల్ గాంధీ
- పార్టీ అకౌంట్ల సీజ్ పై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ముఖ్యమైన అనుబంధ సంఘాల అకౌంట్లను ఆదాయ పన్ను శాఖ సీజ్ చేసింది. పార్టీ అనుబంధ సంఘాలకు చెందిన మొత్తం 9 అకౌంట్లను ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం సీజ్ చేసింది. ఆదాయ పన్ను శాఖ పంపిన నోటీసులకు సదరు అనుబంధ సంఘాలు సరైన స్పందన ఇవ్వకపోగా.. జరిమానా కూడా చెల్లించలేదని.. దీంతో అకౌంట్లు సీజ్ చేసినట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. 2018-19 లో ...5లో

25 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో బదిలీల పర్వం కొనసాగుతోంది. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఇప్పటికే రెవెన్యూశాఖలో పెద్ద ఎత్తున అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం మరోసారి 25 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లకు స్థానచలనం కలిగించింది. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. సొంత జిల్లాకు చెందిన వారు, ఒకే చోట మూడేండ్లకు పైగా పని చేస్తున్న వారిని బదిలీ చేశారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని బదిలీలు జరిగే అవకాశముంది.

కాంగ్రెస్‌లో మాజీ మంత్రి పట్నం దంపతుల చేరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పట్నం మహేందర్ రెడ్డి, ఆయన సతీమణి, వికారాబాద్ జెడ్పీ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్ చార్జి దీపాదాస్ మున్షీ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సినీ నటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణీ, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవి తదితరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కొత్తగా చేరిన నేతలందరు అక్కడి నుంచి నేరుగా అసెంబ్లీకి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు.



లింగ వేతన వ్యత్యాసం తగ్గింది



గ్రామీణ భారతంలో ఎంజీఎన్ఆర్ఈజీపి ప్రభావం : అంతర్జాతీయ కార్మిక సంస్థ



కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీపి) పథకం పట్ల మోడీ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నది. బడ్జెట్‌లో కోతలు, అమలులో ఆంక్షల పేరుతో పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలకు పూనుకుంటున్నది. ప్రతీ బడ్జెట్‌లోనూ, అనేక సందర్భాల్లోనూ ఈ విషయం స్పష్టమవుతున్నది. అయితే, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) మాత్రం ఈ పథకం తీరును అభినందించింది. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో లింగ వేతన వ్యత్యాసం తగ్గటానికి దారి తీసిందని పేర్కొన్నది. కనీస వేతన నియంత్రణలకు అనుగుణంగా పెరిగిందని వివరించింది. ఈ విషయాన్ని తన తాజా వర్కింగ్ పేపర్‌లో పేర్కొన్నది. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఉద్యోగ, ఉపాధి, వేతన వ్యత్యాసాల మధ్య దృష్టిని సారిస్తుంది.

న్యూఢిల్లీ : ఐఎల్ఓ వర్కింగ్ పేపర్ ప్రకారం.. ఈ పథకం కారణంగా అధికారిక వేతన కార్మికులు, సాధారణ కార్మికుల మధ్య గ్రామీణ వేతనాల్లో వ్యత్యాసం తగ్గింది. ఈ సానుకూల ధోరణుల్లో ఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమం ముఖ్యమైన పాత్రను పోషించింది. అయితే, క్షేత్రస్థాయిలో పథకం అమలు ఆధారంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఫలితాలు మారుతాయి. ఇటీవలి సంవత్సరాల్లో గ్రామీణ భారత వేతనాల కొనుగోలు శక్తి ప్రతికూల పోకడలను సూచిస్తున్నది. "భారతీయ లేబర్ బ్యూరో ప్రచురించిన గ్రామీణ నెలవారీ వేతన సూచికతో పాటు ద్రవ్యోల్బణం సమాచారాం ద్వారా.. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవలి సంవత్సరాలలో గ్రామీణ భారతీయుల వేతనాల కొనుగోలు శక్తిలో ప్రతికూల ధోరణులను గమనించింది. ఈ విధంగా, 2022 ఏప్రిల్-నవంబర్ మధ్య పెరిగిన ద్రవ్యోల్బణం కారణంగా గ్రామీణ వేతనాల్లో (అంటే, గ్రామీణ వేతనాలు ద్రవ్యోల్బణం కోసం సర్దుబాటు చేయబడ్డాయి) ప్రతికూల వృద్ధిని తన ఆర్థిక సర్వే 2022-23లో మంత్రిత్వ శాఖ హైలెట్ చేసింది" అని ఐఎల్ఓ పేర్కొన్నది.

ఐఎల్ఓ వర్కింగ్ పేపర్ 58 దేశాల నుంచి వచ్చిన గణాంక ఆధారాలను పరిశీలించింది. దీని ప్రకారం.. పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారి కంటే ...13లో

ఏవో ఫలితాలు విడుదల

- టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ, సహకార శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో) పోస్టుల ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 148 ఏవో పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 28న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టులకు 8,961 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే,వారిలో పేపర్-1కు6,546 (73.04 శాతం) మంది,పేపర్-2కు 6,519 (72.74 శాతం) మంది హాజరయ్యారు. జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేశామని తెలిపారు. వివరాలు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, త్వరలోనే ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామని తెలిపారు.

పలు పోస్టులకు ఫలితాలు విడుదల

మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ శాఖలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్‌కు సంబంధించి 175 పోస్టులకు జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. 18 డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు, 22 హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులకు, ఇంటర్ విద్యాశాఖలో, సాంకేతిక విద్యాశాఖలో లైబ్రరియన్ పోస్టులకు, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టులకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేశామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని తొలగించాలి

- సీపీఎస్‌ను రద్దు చేయాలి :టీఎన్జీవో కేంద్ర సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) చట్టాన్ని తొలగించాలని ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్), టీఎన్జీవో కేంద్ర సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శుక్రవారం హైదరాబాద్‌లో బీమాభవన్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలని కోరారు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను విరమించుకోవాలని సూచించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే మరోసారి ఉద్యమానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. టీఎన్జీవో నగర శాఖ అధ్యక్షుడు కట్కూరి శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ప్రచార కార్యదర్శి శైలజ, నాయకులు కట్టుకూరి శ్రీకాంత్, పంతులు హరికృష్ణ, మెట్టు నాగిరెడ్డి, వరలక్ష్మి, ప్రశాంతి, అవినాష్, దాస్, రమేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



విధానాలు మార్చుకుంటారా... దిగిపోతారా?

మోడీకి వివిధ పార్టీలు, కార్మిక, రైతు, ప్రజాసంఘాల నేతల హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకుంటారా... అధికారం నుంచి దిగిపోతారా?అని ప్రధాని మోడీని వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక, రైతు, ప్రజాసంఘాల నేతలు హెచ్చరించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తేనే దేశానికి రక్షణ ఉంటుందన్నారు. మోడీ ప్రభుత్వం మళ్లీ గెలిస్తే ప్రజలు, కార్మికులు, రైతులు, కూలీల హక్కులు మరింత కాలరాయబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రజలంతా ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. హక్కులను సాధించుకోవడానికి ఐక్య ఉద్యమాలే మార్గమని అన్నారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం, దేశ సార్వభౌమత్వాన్ని-రాజ్యాంగాన్ని కాపాడుకుందాం'అంటూ జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బహిరంగసభను నిర్వహించారు. కార్మికులు, కర్షకులు వేలాదిగా హాజరుకావడంతో ఈ సభకు అనూహ్య స్పందన వచ్చింది. రాష్ట్రంలో కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతమైంది. రాష్ట్రంలోని 34 జిల్లాలు, 610 మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, బహిరంగసభలను నిర్వహించారు. కార్మికులు, రైతులు, అసంఘటిత కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, స్కీమ్ వర్కర్లు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు, హమాలీలు, రవాణారంగ, ఆటో కార్మికులు సమ్మెలో పెద్దఎత్తున పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాల్సిందే : కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం నేతలు

రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తేవాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం నేతలు నాగన్నగౌడ్, ఎస్ బాలరాజు, పాలడుగు భాస్కర్, సుదర్శన్, కె సూర్యం, సాదినేని వెంకటేశ్వరరావు, ఎం శ్రీనివాస్, ఆర్ జనార్దన్, జి రాంబాబు యాదవ్, ఎంకె బోస్, భరత్, పశ్య పద్మ, టి సాగర్, ప్రభాకర్, మండ వెంకన్న, భిక్షపతి, రమేష్, టి రామకృష్ణ, ప్రమీల, జక్కుల వెంకటయ్య, ప్రసాద్, విస్సా కిరణ్, ఎస్ బాలమల్లేష్, ఆర్ వెంకట్రాములు, గోనె రామస్వామి, భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని కోరారు. లేదంటే విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడతాయన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చారనీ, ఆయన సిఫారసులను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నారని చెప్పారు. నిరుద్యోగం, ఆకలి, పేదరికం తీవ్రంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌డి చంద్ర శేఖర్, ఎం నర్సింహ, ఎం వెంకటేశ్, నర్సయ్య, ఎస్-ఎల్ పద్మ, జి అనురాధ, అరుణక్క, దానకర్ణాచారి, డి మోహన్‌రావు, బాబురావు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన

సమస్యలు పరిష్కరించని మోడీ ప్రధానిగా ఎందుకు? : ఎస్ వీరయ్య



సమస్యలు పరిష్కరించాలంటూ ప్రధాని మోడీని అడుగుతున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. ఆయన మాత్రం అయోధ్యలో రాముడిని అడగమంటున్నారని చెప్పారు. సమస్యలు పరిష్కరించని మోడీ ప్రధానిగా గద్దెమీద ఎందుకుండాలని ప్రశ్నించారు. మోడీ, అంబానీ, అదానీలకు స్వర్గంపై విశ్వాసం లేదనీ, అందుకే బతికున్నప్పుడే విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. సామాన్యులు బతికున్నపుడు దుర్భరంగా జీవించి మరణించాక స్వర్గానికి వెళ్లాలంటున్నారని చెప్పారు. వారూ బతికున్నపుడే విలాసవంతంగా బతకాలన్నారు. ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోని బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలనీ, ఒక్కచోట కూడా గెలవకుండా మట్టికరిపించాలని ఆయన పిలుపునిచ్చారు. మోడీ పదేండ్లపాటు మాటల గారడీ తప్ప అభివృద్ధి ఏం చేయలేదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రమ విమర్శించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్ మాట్లాడుతూ హిందూమతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెవి చలపతిరావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు గంటా సత్యనారాయణ, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురహరి, టీడీపీ నాయకులు కాట్రగడ్డ ప్రసూన, రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలివ్వాలనీ, ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

అంబానీ, అదానీలకు మరిన్ని ఆర్థిక ప్రయోజనాలా? : కూనంనేని

అంబానీ, ఆదానీలకు మరిన్ని ఆర్థిక ప్రయోజనాలు కల్పించేందుకు మోడీ ప్రభుత్వం కృషిచేయటం హేయమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడిందన్నారు. 44 కార్మిక చట్టాల్లో 29ని సమూలంగా మార్చి నాలుగు కోడ్‌లుగా తెచ్చిందని చెప్పారు. అవి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు మేలుచేసే విధంగా రూపొందించారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు మేలు కోరడం తప్ప రైతుల సంక్షేమం కోసం పనిచేసేది శూన్యమని విమరించారు.

ఈ కార్యక్రమంలో జె వెంకటేశ్, ఆర్ ప్రకాష్‌గౌడ్, కన్నెగంటి రవి, బి వెంకటేశం, బొడ్డుపల్లి కిషన్, వెంకన్నగౌడ్, టి స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నవలను నిర్మించే బాధ్యత రచయితకు ఉండాలి

ప్రముఖ నవలా రచయిత బండి నారాయణస్వామి

రెండో రోజు తెలుగు సాహిత్య మహాసభ



నవతెలంగాణ-ఓయూ

నవలకు కావాల్సిన వస్తు ఎంపిక, దాన్ని నిర్మించే బాధ్యత రచయితకు సంపూర్ణంగా ఉండాలని ప్రముఖ నవలా రచయిత బండి నారాయణస్వామి అన్నారు. హైదరాబాద్ ఓయూలో రెండో రోజు తెలుగు సాహిత్య మహాసభ ఆచార్య సి.కాశీం సంచాలకులుగా ఘనంగా జరిగింది. మొదట జరిగిన నవలా సమావేశంలో అంపశయ్య నవీన్, అల్లం రాజయ్య, బండి నారాయణస్వామి, కాసుల ప్రతాపరెడ్డి, పెద్దింటి అశోక్‌కుమార్, కోట్ల హనుమంతరావు వక్తలుగా పాల్గొన్నారు. బండి నారాయణస్వామి తాను రాసిన నవలా వస్తువుకు రాయలసీమ నేపథ్యం ఎట్లా దోహదపడిందో వివరించారు. నవలా రచనలో పాత్రలు నిర్మించుకునే విధానం గురించి ప్రముఖ నవలా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ మాట్లాడారు. పాత్రలు ఎంపిక చేసుకున్న తర్వాత ఆ పాత్రకు ఉండాల్సిన లక్షణాలని, స్వభావాల్ని ముందుగా రచయిత నిర్దేశించుకోవాలన్నారు. తర్వాత ఆయా స్వభావాలను, లక్షణాలను పాత్రలు తీసుకొచ్చేటప్పుడు దానికి తగ్గట్టు సన్నివేశాలని, ఆ సన్నివేశాలను పండించడానికి తగినంత భాషను రచయిత సమకూర్చుకోవాల్సి ఉంటుందని.. అప్పుడే ఆ పాత్ర పది కాలాలపాటు నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. వర్తమానం నాటకరంగంపై ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు మాట్లాడారు. నాటక పరిషత్తుల వల్ల 'నాటక పట్లు' అనే సంప్రదాయాన్ని అనుసరించడం వల్ల పరిషత్తు వేసే నాటకాలు ప్రజలకి చేరువ కాలేకపోయాయి అని అన్నారు.

స్థల, కాలాల నేపథ్యం నుంచి సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుందని అల్లం రాజయ్య అన్నారు. తెలంగాణలో ఈ పదేండ్ల కాలంలో వచ్చిన తెలంగాణ నవల నిరాశపరిచేటట్టుగా ఉందని 'దశాబ్ది తెలంగాణ నవల' అనే అంశంపై మాట్లాడిన కాసుల ప్రతాపరెడ్డి అభిప్రాయపడ్డారు. దళిత జీవిత కోణంలోంచి వెలువడినంతగా మధ్యతరగతి జీవితాన్ని చిత్రించే నవలలు ఈ పదేండ్ల కాలంలో రాలేదన్నారు. ఉస్మానియా జీవితమే తన అంపశయ్య నవలకు నేపథ్యాన్ని, ప్రేరణను అందించిందని ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్ చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నవలల్ని అధ్యయనం చేయాల్సిన బాధ్యతను ఆయన గుర్తు చేశారు.

అనంతరం జరిగిన 'విమర్శా దర్శనం' అనే సెషన్‌లో 'విమర్శతో నా ప్రయాణం' అనే అంశంపై ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే ప్రసంగించారు. సాహిత్య విమర్శ పరికరాలు అనే అంశంపై కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అలంకార శాస్త్ర ఔన్నత్యాన్ని, ప్రాధాన్యాన్ని గుర్తిస్తూనే దాని పరిమితుల్ని కూడా గమనించాలని చెప్పిన వల్లంపాటి అభిప్రాయాన్ని ఒక విమర్శ పరికరంగా చూడాలని అన్నారు. సాహిత్య శిల్పంపై జరిగిన పానెల్ డిస్కషన్‌లో విస్తృతమైన చర్చ నిర్వహించారు. కె.ఎన్ మల్లీశ్వరి సభా అధ్యక్షత వహించన ఈ సమావేశంలో ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఎస్వీ సత్యనారాయణ, గోగు శ్యామల పాల్గొన్నారు. కన్వీనర్ ప్రొ.కాశీం మాట్లాడుతూ.. ఈ కవిగాయక సభ వేలాది మంది విద్యార్థుల సమక్షంలో జరగడం కొత్త సంప్రదాయానికి తెలుగు శాఖ వేదికగా మారిందని అన్నారు. సాయంత్రం ఆర్ట్స్ కళాశాల వేదికగా కవితాపొద్దులో 20 మంది కవులు, గాయకులు పాల్గొన్నారు.



'మేడారం'కు భారీగా సందర్శకులు

ముందస్తుగా మొక్కులు

నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా మేడారం మహా జాతరకు సందర్శకులు ముందస్తుగానే మొక్కులు చెల్లించుకోవడం కోసం పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా చుట్టు పక్క రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. నెలరోజుల ముందు నుంచి తండోపతండాలుగా కదలి వచ్చి వన దేవతలను దర్శించుకుని వెళుతున్నారు. గురువారం మేడారం జాతరకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. జంపన్న వాగులో స్నానాలు ఆచరించి నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పిస్తున్నారు. జాతర సమీపిస్తుండటంతో ప్రజల తాకిడి అధికమవుతోంది. మేడారంలో ఎక్కడ చూసినా సందర్శకుల సమూహాలు, వాహనాలే కనిపిస్తున్నాయి. వన దేవతల గద్దెల వద్ద కోలాహలం నెలకొంది. పరిస్థితిని గమనించిన అధికారులు గద్దెలకు తాళాలు వేశారు. క్యూ లైన్ల ద్వారానే సందర్శకులను అనుమతించారు. కానుకలు సమర్పించే బోర్డు పుజారులు పెట్టారు. పోలీసులు ప్రజలను క్రమబద్ధీకరించి బంగారాన్ని అందిస్తున్నారు. వనదేవతల దర్శనం ముగించుకొని పస్రా రోడ్డు మీదుగా నార్లపూర్, చింతల్, తాడ్వాయి రోడ్డు మీదుగా అడవుల్లో చెట్ల కింద విడిదిచేసి వన భోజనాలు చేస్తున్నారు.

సింగరేణికి పూర్తి సహకారం

కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బొగ్గు ఉత్పత్తి, రవాణా, వ్యాపార విస్తరణ కోసం సింగరేణి కాలరీస్‌కు పూర్తి సహకారాన్ని అందిస్తామని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా అన్నారు. శుక్రవారంనాడిక్కడ సింగరేణి కాలరీస్ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థ చేపట్టే కొత్త గనుల పురోగతిని ప్రోత్సహిస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందున్నదని చెప్పారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలోని మూడు బొగ్గు బ్లాకుల్ని సంస్థకే కేటాయించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ శాఖ కార్యదర్శి స్పందిస్తూ నిబంధనలకు లోబడి సింగరేణికి మేలు కలిగే విధంగా సహకరిస్తామన్నారు. సింగరేణి భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని హామీ ఇచ్చారు. సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సోలార్, థర్మల్ ప్రాజెక్టుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సింగరేణి చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలైన థర్మల్, సోలార్, జియో థర్మల్, ఓబీ నుంచి ఇసుక ఉత్పత్తి, కమర్షియల్ ఇసుక తయారీ తదితర ప్రాజెక్టులపై అభినందనలు తెలిపారు. సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి రూపేందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీమతి సంతోషి, సింగరేణి డైరెక్టర్లు డీ సత్యనారాయణ రావు, ఎన్‌వీకే శ్రీనివాస్, జీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) జే ఆల్విన్, జీఎం(కో ఆర్డినేషన్) ఎమ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు.





అనూహ్య స్పందన

- సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం
- కార్మిక వాడల్లో ఎక్కడికక్కడ నిరసన
- స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపార సంస్థలు
- స్తంభించిన ప్రభుత్వ, ప్రయివేట్ కార్యకలాపాలు
- రాష్ట్ర వ్యాప్తంగా ట్రాక్టర్, బైక్ ర్యాలీలు, మహాప్రదర్శనలు
- కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరిసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ బంద్, సమ్మెకు అనూహ్య స్పందన లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతమైంది. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, కార్మిక సంఘాలు, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. పారిశ్రామిక వాడల్లో కంపెనీలు, కార్ఖానాల్లో పనిచేస్తున్న కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. రైతులు, కూలీలు పని ప్రదేశాల్లోనే నిరసన వ్యక్తం చేశారు. పలుచోట్ల ట్రాక్టర్లు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. రైతు బజార్లు, రైస్ మిల్లులు, మార్కెట్లలో రైతులు, కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీలు సైతం ఎర్రజెండాలు చేతబూని సమ్మెలో పాల్గొన్నారు. అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లోనూ కార్మికులు సమ్మె చేశారు. కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు.

నవతెలంగాణ- విలేకరులు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సమ్మె గ్రామీణ బంద్ సక్సెస్ అయ్యింది. పట్టణ కేంద్రాల్లో ఊరేగింపులు, సభలు, ధర్నాలు నిర్వహించాయి. సిద్దిపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు పట్టణాల్లో వేలాది మంది కార్మికులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. పీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పాల్గొని మాట్లాడారు. పటాన్‌చెరులో జరిగిన సమ్మెలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ పాల్గొన్నారు.

హన్మకొండ జిల్లా కలెక్టరేట్ వద్ద మహాధర్నాకు ముందు కార్మికులు మహా ప్రదర్శన నిర్వహించారు. ధర్నాతో రెండు గంటలపాటు కలెక్టరేట్ దద్దరిల్లింది. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛ ఆటో కార్మికులు, ఫిల్టర్ బెడ్ కార్మికులు, మలేరియా కార్మికులు, హార్టికల్చర్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. వరంగల్ రీజియన్ జేఏసీ ఆధ్వర్యంలో వరంగల్ -1డిపో ముందు గేటు ఎదుట ధర్నా చేశారు. వరంగల్ జిల్లాలోని రైల్వే స్టేషన్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు భారీ ర్యాలీ, మాహాప్రదర్శన నిర్వహించారు. సీకేఎం ఆస్పత్రి కార్మిక సంఘాల నాయకులు, వరంగల్ మహానగర పాలక సంస్థ కార్మిక సంఘాల నాయకులు సమ్మెలో పాల్గొన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎంజీఎం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బంద్, భారీ ర్యాలీ నిర్వహించారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంతోపాటు 12 మండలాల్లో ర్యాలీలు, నిరసన వ్యక్తం చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి నెహ్రూ పార్క్, అంబేద్కర్ చౌరస్తా మీదిగా జిల్లా కలెక్టరేట్ వరకు కార్మికులు మహా ప్రదర్శన అనంతరం, ధర్నా చేశారు. ములుగులోనూ ధర్నా జరిగింది.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్అండ్‌బీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసనలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.సోమన్న పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో గాంధీపార్కు నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు మహా ప్రదర్శన నిర్వహించగా సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పాల్గొన్నారు. మంచిర్యాలలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయగా.. బైక్ ర్యాలీ నిర్వహించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అంబేద్కర్ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గ్రామీణ భారత్ బంద్, సమ్మె విజయంవంతమైంది. కాటేదాన్, రాజేంద్రనగర్, కొత్తూరు, షాద్‌నగర్ పారిశ్రామిక వాడల్లో కార్మికులు ర్యాలీలు తీశారు. మంచాల మండల పరిధిలోని లోయపల్లి, మంచాల, జాపాల ప్రాంతాల్లో గ్రామీణ బంద్ స్వచ్ఛందంగా నిర్వహించారు. షాద్‌నగర్‌లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పాల్గొన్నారు. శంషాబాద్‌లో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ పాల్గొని కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. యాచారంలో ర్యాలీ సందర్భంగా పోలీసులకు, నిరసనకారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. చెవెళ్ల, పరిగిలో నిర్వహించిన బంద్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు పాల్గొన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు.ఆదిభట్లలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, ఇబ్రహీంపట్నంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్ పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో ఆర్టీసీ డిపోలు, బస్టాండ్ వద్ద బస్సులను అడ్డుకున్నారు. వ్యాపార సంస్థలు, హోటళ్లు, పెట్రోల్ బంకులు, విద్యా సంస్థలు, చిరు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించి సహకరించారు. ఖమ్మంలో ఖమ్మం పాత బస్టాండ్ అఖిల పక్ష పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు యం.సాయిబాబు, అఖిలపక్ష పార్టీల నాయకులు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఐ జాతీయ నాయకులు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడారు. భద్రాచలంలో బస్టాండ్ సెంటర్లో జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోదెం వీరయ్య, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో, కొత్తకోట మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జయలక్ష్మి మాట్లాడారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలో కార్మిక, ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లో ర్యాలీ తీశారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వద్ద ముందుగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ ప్రసంగించారు. కార్మికులు మహాప్రదర్శన చేపట్టారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ, మున్సిపల్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో వేలాది మంది కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఎఫ్‌సీఐ, బేవరేజెస్, పట్టణ ఎగుమతి దిగుమతి హమాలీలు పట్టణంలో బైక్ ర్యాలీ తీశారు. మిర్యాలగూడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మరోసారి మోడీ అధికారంలోకి వస్తే దేశం వినాశనమే అవుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టారని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. కొండమల్లేపల్లిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ ఎదుట బస్సులు బయటికి పోకుండా నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి సహా పలువుర్ని అరెస్టు చేశారు. అర్వపల్లి మండల కేంద్రంలో ధర్నా చేసిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో రాస్తారోకో, ర్యాలీ నిర్వహించారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో గీతా భవన్ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జమ్మికుంటలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. పెద్దపల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె ప్రశాంతంగా జరిగింది. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సిఎల్‌తోపాటు వివిధ పరిశ్రమల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. తెలంగాణ రైల్వే క్యాజువల్, కాంట్రాక్ట్, అల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

హైదరాబాద్ మెహిదీపట్నం టోలిచౌకి చౌరస్తాలో నాంపల్లి, కార్వాన్‌లో బహిరంగ సభ నిర్వహించారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బస్ భవన్ నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షులు, చంద్రశేఖర్ ప్రసాద్ పాల్గొన్నారు. హైదరాబాద్ ఓవైసీ చౌరస్తా వద్ద జరిగిన ర్యాలీలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఏఎస్ రావు నగర్ నుంచి ఈసీఐఎల్ వరకు వందలాది మంది కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోనూ భారీగా నిరసన ప్రదర్శన చేశారు. కూకట్‌పల్లిలో వీధులలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించి అడ్డాల వద్ద ఈ నిరసన చేపట్టారు. కుత్బుల్లాపూర్‌లో షాపూర్ నగర్, ఐడీపీఎల్, బాచుపల్లి, గండి మైసమ్మలో కార్మికులు పెద్దబత్తున ర్యాలీ నిర్వహించారు. సమ్మెను జయప్రదం చేశారు. ఉప్పల్ పారిశ్రామికవాడలో బంద్ చేశారు.

సంపాదకీయం

దిగజారిన జపాన్ జీడీపీ!

ఐదు దశాబ్దాల క్రితం అమెరికాను వెనక్కు నెట్టేసి ఆర్థికంగా మొదటి స్థానంలో ఉంటుందని అనేక మంది భావించిన జపాన్ 2010లో చైనా ముందుకు రావటంతో మూడవదైంది. తాజాగా ఆ స్థానాన్ని కూడా కోల్పోయి జర్మనీ తరువాత నాల్గవదిగా మారింది. జర్మనీ జీడీపీ నాలుగున్నర లక్షల కోట్ల డాలర్లు కాగా జపాన్ 4.2లక్షల కోట్లకు పడిపోయింది. జర్మనీ పరిస్థితి కూడా అటూ ఇటూగా ఉంది, అక్కడ కూడా ఆర్థిక వృద్ధి అనుమానంలో

అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లో జననాల రేటు తగ్గి కార్మికశక్తి కొరత, వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది.ఇంతకాలం రష్యా చౌక ఇంధనం మీద ఆధారపడిన జర్మనీ ఇప్పుడు ఉక్రెయిన్ సంక్షోభంతో ఇబ్బందుల్లో పడింది. జపాన్, జర్మనీలో ఎగుమతుల మీద ఆధార పడిన వ్యవస్థలుగా వృద్ధి చెందాయి. ఇప్పుడు అనేక దేశాల్లో ఏర్పడిన మందగమనంతో పాటు, చైనా అన్ని రకాల వస్తువులను చౌకగా ఎగుమతి చేస్తుండటంతో ఎగుమతి ఆధారిత వ్యవస్థలన్నీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

పడింది. ఎక్కడైనా వరుసగా రెండు త్రైమాస కాలాల్లో జీడీపీ తిరోగమనంలో ఉంటే ఆ దేశం సాంకేతికంగా మాంద్యంలోకి దిగజారినట్లు భావిస్తారు. గతేడాది చివరి ఆరు నెలల్లో జపాన్‌లో అదే జరిగింది. ఈ కారణంగానే జీడీపీలో తన స్థానాన్ని కోల్పోయింది. గురువారం నాడు జపాన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం 2023 జూలై- సెప్టెంబరు మాసాల్లో జీడీపీ వృద్ధి రేటు 0.8, తరువాత మూడు మాసాల్లో 0.1శాతం తిరోగమనంలో ఉన్నట్లు ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకొని లెక్కలను ఖరారు చేశారు. గడచిన రెండు మూడు దశాబ్దాలుగా పక్షవాత రోగి మాదిరిగా ఉన్న అక్కడి అర్థిక వ్యవస్థ తీరుతెన్నులను చూస్తున్న వారికి ఇది ఆశ్చర్యం కలిగించదు. జీడీపీ లెక్కింపులో జనాన్ని గందరగోళపరుస్తారు.

నామమాత్ర జీడీపీ వేరు, వాస్తవ జీడీపీ వేరు. నామమాత్రం అంటే వర్తమానం, తాత్కాలికమైనది. వాస్తవం అంటే ఒక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని తరువాత కాలంలో ఆ దేశ కరెన్సీ విలువ తగ్గిందా, పెరిగిందా అన్న అంశాన్ని తీసుకొని ఖరారు చేసేది. ఉదాహరణకు 2010లో ఒక దేశ జీడీపీ వంద అనుకుంటే పదేండ్ల తరువాత 150కి పెరిగిందంటే 50శాతం వృద్ధి కనిపిస్తుంది. కానీ ఈ కాలంలో ఆ దేశ కరెన్సీ విలువ 50 శాతం పడిపోతే పదేండ్ల తరువాత నిజవిలువ 75 మాత్రమే. జపాన్ లెక్కలు కూడా అలాంటివే, 2023లో 1.9 శాతం వృద్ధి రేటు నమోదైనట్లు గతంలో ప్రకటించారు. కానీ దిగజారిన కరెన్సీ ఎన్ విలువ, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆరునెలల కాలంలో తిరోగమన



వృద్ధి నమోదైనట్లు ప్రకటించటంతో డాలర్ లెక్కల్లో జర్మనీ కంటే జపాన్ జీడీపీ విలువ తగ్గినట్లు పరిగణించాల్సి వచ్చింది. మన దేశంలో కూడా నామమాత్ర జీడీపీ లెక్కలను చూపి కేంద్ర ప్రభుత్వం తమ ఘనత చూడమని చెబుతున్నది, కానీ కొందరు ఆర్థికవేత్తలు నిజ జీడీపీ విలువ గురించి నిలదీయటంతో నామమాత్ర జీడీపీనే పరిగణనలోకి తీసుకోవాలని మోడీ ప్రభుత్వం దబాయిస్తోంది.

జపాన్, జర్మనీ రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన తరువాత ఆ దేశాలలో మరోసారి మిలిటరీ నియంతలు తలెత్తకుండా ఉండేందుకు ఆత్మరక్షణ దళాలను మాత్రమే నిర్వహించాలని ఒప్పందాలు జరిగాయి. అందువలన మిలిటరీ ఖర్చును అక్కడి ప్రభుత్వాలు పరిశోధన-అభివృద్ధికి వెచ్చించటంతో రెండు దేశాలు కూడా పారిశ్రామిక, ఎగుమతి రంగాల్లో దూసుకుపోయాయి. ఇటీవలి కాలంలో చైనా పెరుగుతున్న కొద్దీ జపాన్ నామమాత్ర వృద్ధితో కొట్టుమిట్టాడుతోంది. ఎగుమతులు బాగా చేసిన కాలంలో సంపాదించుకున్న డాలర్ల మిగులు ఇప్పటికీ ఎంతో ఉంది కనుక ఆ మాత్రమైనా నిలిచి ఉంది. డాలరుతో పోలిస్తే జపాన్ కరెన్సీ ఎన్ విలువ గత రెండేండ్లుగా పతనం అవుతున్నది. అందుకే వాస్తవ జీడీపీ విలువ తగ్గుతున్నది. స్థానికంగా జనాలు చేస్తున్న ఖర్చు కూడా తగ్గుతున్నది, పని చేసేందుకు కార్మికులు లేకపోవటంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మహిళలను మరింతగా ఉత్పాదక రంగంలోకి దించేందుకు వేతనాల పెంపుదల వంటి కొన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వృద్ధి రేటు మెరుగుపడకపోగా దిగజారుతున్నది. అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లో జననాల రేటు తగ్గి కార్మిక శక్తి కొరత, వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. ఇంతకాలం రష్యా చౌక ఇంధనం మీద ఆధారపడిన జర్మనీ ఇప్పుడు ఉక్రెయిన్ సంక్షోభంతో ఇబ్బందుల్లో పడింది. జపాన్, జర్మనీలో ఎగుమతుల మీద ఆధారపడిన వ్యవస్థలుగా వృద్ధి చెందాయి. ఇప్పుడు అనేక దేశాల్లో ఏర్పడిన మందగమనంతో పాటు, చైనా అన్ని రకాల వస్తువులను చౌకగా ఎగుమతి చేస్తుండటంతో ఎగుమతి ఆధారిత వ్యవస్థలన్నీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. జపాన్ ఎగుమతులు గత కొద్ది సంవత్సరాలుగా తగ్గుతున్నాయి. గతంలో ప్రపంచ మార్కెట్లో ఎక్కడ చూసినా జపాన్ టీవీలు, కంప్యూటర్లు, కార్లు కనిపించేవి. ఇప్పుడు చైనా వాటి స్థానాన్ని ఆక్రమించింది. ఇది ఒక్క జపాన్ సమస్య మాత్రమే కాదు, పెట్టుబడిదారీ విధానాలను అనుసరిస్తున్న అన్ని సమాజాలు ఎదుర్కొంటున్న సంక్షోభమే ఇది.

గాంధీ రాముడు రామ మందిరంలో లేడు

గాంధీజీ 1948 లో 'హేరాం' అంటూ తన తుదిశ్వాస విడిచాడు. రాముని ప్రభావం మోహన్‌దాస్ కరంచంద్ గాంధీపై తన బాల్యం నుండి ఉంది. మహాత్ముడు తన ఆత్మకథలో తెలిపినట్లు, తాను పుట్టినప్పటి నుండి వైష్ణవ విశ్వాసం కలిగి ఉండి రాముని, కృష్ణుని దేవాలయాలను సందర్శించే అలవాటు ఉండేది. అయితే దేవాలయాలు చిన్న పిల్లవాడైన గాంధీలో విశ్వాసం కలిగించలేదు. "నేను అక్కడికి చేరుకోవడంలో వైఫల్యం చెందాను, నేను నా సంరక్షకురాలైన ఒక వృద్ధ సేవకురాలి నుండి ఆ విశ్వాసాన్ని పొందాను, ఆమె పేరు రంభ. ఈ భయాన్ని నివారించే మందు, అదే రామనామం (రాముని పేరు)" అని పేర్కొన్నాడు. ఇదే అతనికి జీవితంలో దోష నివారిణిగా మారింది. అయితే ఆయన ఉదహరించే రామ నామం దేవాలయంలో కనిపించే విగ్రహం కాదు, లేక ఒక ఆచారంగా పద్యాన్ని కంఠస్థం చేయడమూ కాదు. దానికి బదులుగా అది హృదయంలో చాలా లోతైన విషయం.



■ సుదర్శన్ అయ్యంగార్

ఆధ్యాత్మికతలో పాతుకుపోయింది గాంధీయిజం

గాంధీ, మతాన్ని రాజకీయాల్లోకి తీసుకొని వచ్చినా, ఆయన మతం, తన మూలాల్ని ఆధ్యాత్మికతలోనే ఉంచింది. గాంధీ రాజకీయాల్ని, మతపరంగానూ, మతాన్ని ఆచరణాత్మకంగానూ మారాలని కోరుకున్నాడని, గాంధేయ స్కాలర్ రాఘవన్ అయ్యర్ "ద మోరల్ అండ్ పొలిటికల్ థాట్ ఆఫ్ మహాత్మా గాంధీ" అనే తన రచనలో పేర్కొంటాడు. ఈ ప్రయత్నంలో ఆయన భారతీయ సాంప్రదాయం నిర్లక్ష్యం చేయబడిన ఒక

1929 లో భోపాల్ లో జరిగిన ఒక బహిరంగసభలో ఆయన ఇలా చెప్పాడు: "నేను రామరాజ్యం అనే పదాన్ని ఉపయోగించడంతో నన్ను అపార్థం చేసుకున్నందుకు నేను నా ముస్లిం మిత్రులకు ఒక హెచ్చరిక చేస్తున్నాను. రామరాజ్యం అంటే నా ఉద్దేశ్యంలో హిందూ రాజ్యం అని కాదు. నా ఉద్దేశ్యంలో రామరాజ్యం అంటే దైవ రాజ్యం, దేవుని సామ్రాజ్యం. నా దృష్టిలో రాముడు, రహీం ఒకే దేవుని కింద లెక్క, సత్యం, ధర్మం అనే ఏకైక దేవుడు తప్ప మరే ఇతర దేవుడ్ని నేను గుర్తించను." ఇది రాజకీయాల్లో, ప్రజాజీవితంలో గాంధీ మతం.

భావన- కర్మయోగ మార్గం లేదా సామాజిక చర్య ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానం నిర్మించాడు. ఇది, రాముడు, జనకుడు లాంటి సాంప్రదాయ యోధులతో సంబంధమున్న చర్య. దీన్ని వివేకానందుడు, అరబిందోలు ఆధునిక భారతదేశంలో పునరుద్ఘాటించారు.

రాజకీయాల ప్రక్షాళన, వ్యావహారిక మత సంస్కరణ కోసం పనిచేయాలని గాంధీ లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆయన, తన ప్రసంగాలలో రామ, రామనామం, రామరాజ్యానికి ఒక కొత్త అర్థాన్ని ఇచ్చాడు. ప్రార్థనా రూపంలో తన హృదయాంతరాల్లో నుండి రామనామాన్ని ఆలపించడం ద్వారానే ఆయన నిరంతర స్వీయ ప్రక్షాళనా ప్రయాణం సాగింది.


మార్చి 18, 1933లో 'హరిజన్' పత్రికలో ప్రసిద్ధి చెందిన విశ్వాసాల్ని, ఆచారాల్ని విమర్శించే ఒక పాఠశాల ఉపాధ్యాయుడు లేవనెత్తిన మూడు ప్రశ్నలను ఉదహరించి, వాటికి సమాధానాలు చెప్పాడు. మొదటిది : "శ్రీరామ చంద్రుడ్ని అనుసరిస్తున్న ఓ హిందువు కూడా దేవాలయానికి వెళ్ళి, ఆయన విగ్రహాన్ని చూడాల్సిన అవసరం ఉందా? కార్యం కంటే దర్శనం మెరుగైందా?" రెండు : మనం ఒక సజీవమైన వ్యక్తి ముందు మన తలదించినా లేదా మన చేతులు కట్టుకొని ఉన్నా, అతడు తిరిగి జవాబిస్తాడు, కానీ విగ్రహం అలా చెయ్యదు. అలాంటప్పుడు, మనం ఈ పని చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? ఉత్తరాలకు సమాధానం ఇవ్వని వ్యక్తికి ఉత్తరాలు రాయడం వల్ల ప్రయోజనం ఏమిటి?" మూడు : "హిందువులు ఆరాధించే వ్యక్తి తన జీవిత కాలంలో కొన్ని తప్పులు చేసి ఉండి ఉండవచ్చు. ఆ తప్పుల్ని అనుకరించడం ద్వారా ఆరాధకునికి ప్రమాదం కాదా? అతడు ఆ చిత్రాన్ని పూజిస్తే ఆ తప్పులు అనుకరించడా?"

తనలో ఉండాల్సిన రాముడ్ని విగ్రహంలో ఉండాలని కోరుకోవడం దురదృష్టకరమని గాంధీ అభిప్రాయపడ్డాడు. అయినా రాముడిని దేవాలయంలో చూసే "సామాన్యమైన విశ్వాసానికి" మాత్రం గాంధీ భంగం కలిగించడు. గాంధీ ప్రతిస్పందన ఇలా ఉంది: "రామచంద్రుని విగ్రహాన్ని పూజించడానికి ఏ హిందువు కూడా దేవాలయానికి వెళ్ళవలసిన అవసరం లేదు. అయితే ఇది ఆలయంలో రాముని విగ్రహాన్ని చూడకుండా తన రాముడ్ని దర్శించుకోలేని వ్యక్తి కోసమే. ఇది దురదృష్టం కావచ్చు, అతని రాముడు ఎక్కడా లేని విధంగా ఆ ఆలయంలోనే ఉంటాడనేది వాస్తవం. నేను ఆ సామాన్యమైన విశ్వాసానికి భంగం కలిగించను."

అయితే కార్యం లేదా చర్య, దర్శనం కంటే చాలా ముఖ్యమైనది. మూగతనంతో చేసే పూజ దేవునికి ఉత్తరం వంటిది. దేవుడు దేవాలయంలో మాత్రమే ఉండడు. ఆయన ఆలయం, మసీదు, చర్చ్‌ల మధ్య ఎలాంటి భేదాన్ని చూపించ లేదని గాంధీ పేర్కొన్నాడు. మూడవ ప్రశ్నపై ఆయన ఇలా రాసాడు: "నా హేతుబద్ధత, హృదయం చాలా కాలం కిందే దేవుని అత్యున్నతమైన లక్షణాన్ని, పేరును 'సత్యం' అని నిరూపించినప్పటికీ, నేను సత్యాన్ని రాముని పేరుతో గుర్తిస్తాను. నా విచారణ జరిగే చీకటి సమయంలో ఆ ఒక్క పేరే నన్ను రక్షించింది, ఇప్పటికీ రక్షిస్తూనే ఉంది." గాంధీ అన్ని ప్రసంగాలు, వ్యాసాలు, ఉత్తరాలలో రాముడు, రామనామం, తులసీదాస్ రామచరిత మానస (రామాయణం)లు వందలసార్లు ఉదహరించబడి, వ్యాఖ్యానించబడ్డాయి.

పేర్లు వేరే - దేవుడు ఒకటే

గాంధీ రాముడు ఎవరు? ఆయన ఒక హిందూ దేవుడా? ఆయన దీనిపై అనేకసార్లు స్పష్టత ఇచ్చాడు. ఏప్రిల్ 4, 1946న ఢిల్లీలోని బిర్లాహౌస్‌లో తన ప్రార్థనా సమావేశంలో గాంధీ ఈ విధంగా మాట్లాడారు : "రాముడు లేదా రామ నామ జపం హిందువులకు మాత్రమే ఉద్దేశించినదని ఎవరైనా అంటే నాలో నేను నవ్వుకుంటాను. అలాంటప్పుడు ముస్లింలు దానిలో ఎలా పాల్గొంటారు? ముస్లింలకు ఒక దేవుడు, హిందువులకు, పార్శీలకు, క్రైస్తవులకు వేరొక దేవుడు ఉంటాడా? లేదు, సర్వశక్తియుతుడు, సర్వవ్యాపియైన దేవుడు ఒక్కడే ఉంటాడు. ఆయనకు రకరకాల పేర్లున్నాయి. మనకు బాగా తెలిసిన పేరుతో మనం ఆయనను గుర్తుంచుకుంటాం. నా రాముడు, మన ప్రార్థనల రాముడు అంటే అయోధ్య రాజు దశరథుని కుమారుడైన చారిత్రక రాముడు కాదు. అతడు శాశ్వతమైనవాడు, ఇంతవరకు పుట్టనివాడు, రెండవవాడు లేనివాడు. నేను అతనిని మాత్రమే ప్రార్థిస్తాను, అతని సహాయాన్ని మాత్రమే నేను కోరతాను, మీరు కూడా అలానే చెయ్యాలి. ఆయన అందరికీ సమానంగా చెందినవాడు. అందువలన, ఒక ముస్లిం లేదా ఎవరైనా అతని పేరు తీసుకోవడానికి ఎందుకు ఆక్షేపిస్తున్నారో నాకెలాంటి కారణం కనిపించడం లేదు. అయితే దేవుడిని రామనామంగా గుర్తించేందుకు ఆయన కట్టుబడి లేడు. శబ్ద సామరస్యానికి హాని చేయకుండా ఉండడానికి అతడు తనలో తాను అల్లా లేదా ఖుదా అని ఉచ్చరించవచ్చు.



అన్ని మతాలకు సంబంధించిన ప్రజలు నివసిస్తున్న, ఒక శతాబ్దానికి పైగా హిందూ ముస్లిం ఘర్షణలు ఉన్న భారత దేశంలో రాముడిని ఒక ఆదర్శవంతమైన వ్యక్తిగా, అన్ని సమస్యలకు రామనామమే పరిష్కారమనే దానిని సమర్థించడంలో ఉన్న లోతైన, తీవ్రమైన చిక్కులు గాంధీకి తెలుసు. దురుద్దేశంతోనే బ్రిటీష్ వారు భేదాభిప్రాయాలను సృష్టించి చీలికల్ని తీవ్రం చేశారు. దాని కారణంగా ఆయన ఎప్పుడూ కూడా దేవాలయాలకు, మసీదులకు, చర్చ్‌లను సందర్శించకుండా చాలా జాగ్రత్త వహించాడు. అయితే ఆయన పుట్టిన హిందూ మతానికి సంబంధించిన, హిందూ సాంప్రదాయాల చిహ్నాలను మాత్రం ఉపయోగించాడు.

1929లో భోపాల్‌లో జరిగిన ఒక బహిరంగసభలో ఆయన ఇలా చెప్పాడు: "నేను రామరాజ్యం అనే పదాన్ని ఉపయోగించడంతో నన్ను అపార్థం చేసుకున్నందుకు నేను నా ముస్లిం మిత్రులకు ఒక హెచ్చరిక చేస్తున్నాను. రామరాజ్యం అంటే నా ఉద్దేశ్యంలో హిందూరాజ్యం అని కాదు. నా ఉద్దేశ్యంలో రామరాజ్యం అంటే దైవరాజ్యం, దేవుని సామ్రాజ్యం. నా దృష్టిలో రాముడు, రహీం ఒకే దేవుని కింద లెక్క. సత్యం, ధర్మం అనే ఏకైక దేవుడు తప్ప మరే ఇతర దేవుడ్ని నేను గుర్తించను." ఇది రాజకీయాల్లో, ప్రజాజీవితంలో గాంధీ మతం.

అయితే కార్యం లేదా చర్య, దర్శనం కంటే చాలా ముఖ్యమైనది. మూగతనంతో చేసే పూజ దేవునికి ఉత్తరం వంటిది. దేవుడు దేవాలయంలో మాత్రమే ఉండడు. ఆయన ఆలయం, మసీదు, చర్చ్‌ల మధ్య ఎలాంటి భేదాన్ని చూపించలేదని గాంధీ పేర్కొన్నాడు. మూడవ ప్రశ్న పై ఆయన ఇలా రాసాడు: "నా హేతుబద్ధత, హృదయం చాలా కాలం కిందే దేవుని అత్యున్నతమైన లక్షణాన్ని, పేరును 'సత్యం' అని నిరూపించినప్పటికీ, నేను సత్యాన్ని రాముని పేరుతో గుర్తిస్తాను. నా విచారణ జరిగే చీకటి సమయంలో ఆ ఒక్క పేరే నన్ను రక్షించింది, ఇప్పటికీ రక్షిస్తూనే ఉంది." గాంధీ అన్ని ప్రసంగాలు, వ్యాసాలు, ఉత్తరాలలో రాముడు, రామనామం, తులసీదాస్ రామచరిత మానస (రామాయణం) లు వందల సార్లు ఉదహరించబడి, వ్యాఖ్యానించబడినాయి.

గాంధీ తరువాత ఇలా రాసాడు : "నా ఊహలో ఉన్న రాముడు ఈ భూమి మీద జీవించాడో లేదో, రామ రాజ్యం ప్రాచీనమైన ఆదర్శం మాత్రం ఎలాంటి సందేహం లేకుండా నిజమైన ప్రజాస్వామ్యంలో ఒకటి. దీనిలో చాలా పేదవాడైన పౌరుడు విస్తృతమైన, ఖరీదైన ప్రక్రియలు లేకుండా న్యాయాన్ని ఖచ్చితంగా పొందగలడు. ఆఖరికి కుక్కకు కూడా రామరాజ్యంలో న్యాయం జరిగినట్లు కవి వర్ణించాడు."

కాని నేటి పరిస్థితేమిటి

నేడున్న పరిస్థితుల్లో గాంధీ రాముడు, రామనామం, రామరాజ్యంలను నమోదు చేయడం చాలా ముఖ్యం. మత రాజకీయాకరణ అనేది, గాంధీ దేనినైతే సమర్థించాడో, దేనికోసం నిలబడ్డాడో దానికి వ్యతిరేకం. ఇది దేశానికి శుభాన్ని సూచించదు. తన రాజ్యాంగం ద్వారా లౌకిక రాజ్యంగా ఉన్న దేశానికి ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు తీర్పుపై ఆధారపడి నిర్మించిన రామమందిర ప్రతిష్ఠాపన సందర్భంగా అపరిమితమైన శుభాకాంక్షలను తెలియజేయవలసి ఉండాల్సింది. భారతదేశం బహుళ మతాలు, బహుళ సంస్కృతులు ఉన్న సమాజం. ప్రధానమంత్రి తన మతం, విశ్వాసం, అంకితభావం కలిగి ఉన్నప్పటికీ ఒకే మతం పట్ల పక్షపాతాన్ని ప్రదర్శించడం అనేది ఆరోగ్యకరమైన సంకేతాలను పంపించలేదు. గాంధీ రాముడు కనిపించని ప్రాంతంలో ఇది ఒక ఉత్సవంగా జరిగింది.


("ద హిందూ" సౌజన్యంతో)

(మూల రచయిత 1920లో గాంధీ స్థాపించిన గుజరాత్ విద్యాపీఠ్‌కు గతంలో వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు)

అనువాదం : బోడపట్ల రవీందర్

సీఎంగారూ...నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు!

తెలంగాణలో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఉద్యోగ ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యతను తక్షణంగా చేపట్టాల్సిన అవసరం ఉంది. ఎన్నికల ముందు హామీనిచ్చిన విధంగా రెండు లక్షల ఉద్యోగాల భర్తీతో పాటు, నాలుగువేల రూపాయల నిరుద్యోగ భృతి చెల్లించే విషయంలో స్పష్టమైన విధివిధానాలు ప్రకటించాలి. ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో యువతకు నమ్మకం కలిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకోవాలి. ఇది తక్షణావసరం కూడా. ఎందుకంటే గత బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో అత్యంత ఎక్కువగా మోసగించబడ్డది, అన్యాయానికి గురైనది నిరుద్యోగ యువతేనన్నది స్పష్టం. ఉద్యోగ నియామకాల కోసం వేసిన నోటిఫికేషన్లు రద్దు కావడం, పేపర్ లీకేజీలు, లిటిగేషన్లు, కోర్టు వివాదాలు మూలంగా ఆశించిన రీతిలో ఉద్యోగాలు రాకపోగా నిరుద్యోగ యువత పూర్తి నిరాశ, నిస్పృహలకు లోనైంది. వందల మంది బలవన్మరణాలకు పాల్పడ్డ పరిస్థితి. ఉద్యోగాల భర్తీ చేపట్టడం ఇష్టం లేకనే ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా పరీక్ష పేపర్ లీకేజీలకు పాల్పడిందన్న ఒక వాదన కూడా బలంగా ముందుకొచ్చింది. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన తెలంగాణ ఉద్యమంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి త్యాగాలకు సిద్ధపడిన యువతను ప్రభుత్వం పట్టించుకోలేదు.



■ కోట రమేష్

యువత త్యాగాల మూలంగా వచ్చిన రాష్ట్రంలో ఒనగూరిన ప్రయోజనమేంటి? మోసపూరిత వాగ్దానాలు, నయవంచన తప్ప. ఉద్యోగ నియామకాల విషయమై ప్రకటనలు, కాలయాపనతోనే యువతను మభ్యపెడుతూ వచ్చింది గత ప్రభుత్వం. ఎన్నికల ముందు 80 వేల ఉద్యోగాలు భర్తీ చేయుటకు ఆగమేఘాల మీద, కొన్ని నోటిఫికేషన్లు వేసింది. కొన్నింటికి రాత పరీక్షలు నిర్వహించింది. గ్రూప్ 1 పేపర్ లీకేజీ కారణంగా ఒకసారి, ఓఎంఆర్‌లో అభ్యర్థుల వివరాలు లేకపోవడం చేత హైకోర్టు జోక్యంతో రెండోసారి వాయిదా పడింది. ఎన్నికల షెడ్యూల్ కారణం చేత గ్రూప్ 2, డీఎస్సీ పరీక్షలు రద్దు చేసింది. పలు కారణాలు, వివిధ ఆటంకాల నడుము ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పరిణామాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని వీలైనంత మేరకు ఉద్యోగ నియామకాల ప్రక్రియను చేపట్టాలి. అసలు రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీలు ఎన్ని ఉన్నాయో స్పష్టం చేయాలి. బిశ్వాల్ కమిటీ పీఆర్సి రిపోర్టు ప్రకారం రాష్ట్రంలో 1,91,126 ఉద్యోగ ఖాళీలు ఉన్నట్టు అంచనా. అసెంబ్లీ ఎన్నికల పేరుతో మొత్తం ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమ ఎన్నికల మేనిఫెస్టోలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. ముఖ్యమంత్రి ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఎప్పుడెప్పుడు మొదలుపెడతారోనని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

తెలంగాణకు మొత్తం మంజూరైన పోస్టులు 4 లక్షల 91,304 కాగా, 3లక్షల 178మంది ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నట్లు పీఆర్సీ రిపోర్టు తెలిపింది. దీంతో మొత్తం 1,91,126 ఉద్యోగాలున్నాయని పీఆర్సీ తన నివేదికలో వెల్లడించింది. గతంలో ఏ శాఖలో ఎంతమంది ఉద్యోగులున్నారన్న విషయాన్ని పీఆర్సీ నివేదికలో పేర్కొంది. అత్యధికంగా పాఠశాల విద్యాశాఖలో మొత్తం 1,37,851 పోస్టులు మంజూరు కాగా 1,13, 883 మంది పని చేస్తున్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో 98,394 పోస్టులకుగాను 61,212 మంది విధులు నిర్వహిస్తున్నారు. అత్యంత ముఖ్యమైన వైద్యారోగ్య శాఖలో 52,906 పోస్టులు మంజూరు కాగా ఇందులో కేవలం 22,336 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో కీలకమైన రెవెన్యూ శాఖలో 23,786 పోస్టులోగాను 19,825 మంది, పంచాయతీరాజ్ విభాగంలో 26, 2001 పోస్టులకు 13,573మంది ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో మొత్తం 50వేల 400 మంది కాంట్రాక్టు, 58,128 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. అయినా రాష్ట్రంలో మొత్తం 39 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వేతన సవరణ సంఘం తేల్చింది రాష్ట్రంలో ప్రతి వెయ్యి మందికి 14 మంది ఉద్యోగులు ఉండాల్సింది. కానీ అనేక పోస్టులు ఖాళీగా ఉండడం చేత వెయ్యిమందికి కేవలం 8.5శాతం మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తున్నారని తన నివేదిక స్పష్టం చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు



ఏ విధమైన ప్రాధాన్యతనిస్తుందో, యువత, ఉద్యోగ ఉపాధి కల్పన విషయంలోనూ అంతే ప్రాధాన్యత ఇవ్వడం అనేది ప్రథమ కర్తవ్యంగా వుండాలి. చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు ఏ విధమైన ప్రాధాన్యతనిస్తుందో, యువత, ఉద్యోగ ఉపాధి కల్పన విషయంలోనూ అంతే ప్రాధాన్యత ఇవ్వడం అనేది ప్రథమ కర్తవ్యంగా వుండాలి.

ప్రభుత్వ పాలన సక్రమంగా, సజావుగా జరగాలన్నా, ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలన్నా, అన్ని శాఖల్లో పూర్తిస్థాయి సరిపడా ఉద్యోగ నియామకాలు చేపట్టడం అవసరం. అత్యంత ప్రాధాన్యతగల రంగం ఏదైనా ఉందంటే అది విద్యారంగం. ఇందులో సుమారుగా 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోంది. ఏండ్ల నుండి ఉపాధ్యాయ నియామకాలు లేవు. డిఎస్సీ కోసం లక్షలాది మంది అభ్య ర్థులు ఆశతో ఎదురు చూస్తున్నారు. 5,089 పోస్టులకు డీఎస్సీ వేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అదే మాదిరిగా 13,086 పోస్టులతో పాటు ఇటీవల ఉపాధ్యాయుల పదోన్నతులతో ఏర్పడిన 9,979 పోస్టులను కలిపి మెగా డీఎస్సీ నిర్వహించాలనేది ప్రస్తుతం నిరుద్యోగుల ప్రధాన డిమాండ్. పాఠశాల విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో గాడిలో పెట్టేందుకు సుమారుగా 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. పాఠశాలలు, కళాశాలలే కాదు, యూనివర్సిటీల్లోనూ ఎక్కువ మొత్తంలో ఖాళీలున్నాయి. పెరిగిన గురుకులాల సంఖ్యకనుగుణంగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు జరగలేదు. పేదలకు మరింత నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యనందించేందుకు నియామకాలు చేపట్టడం అవసరం.

ఉద్యోగ నియామకాల విషయంలో టీఎస్పీఎస్సీ బోర్డు, ప్రభుత్వంఘోర వైఫల్యం కారణంగా అప్రతిష్ఠను మూటగట్టుకుంది. టీఎస్పీఎస్సీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలనీ ప్రధానంగా చర్చ జరిగింది. అందుకు తగ్గట్టుగానే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే ఈ విషయంపై దృష్టి సారించడం మంచి విషయం. గత టీఎస్పీఎస్సీ బోర్డు చైర్మన్, సభ్యుల రాజీనామాలు చేయడం, ఇటీవల కాలంలో టీఎస్పీఎస్సీ బోర్డు నూతన చైర్మన్, మరి కొంతమంది సభ్యుల నియామకానికి గవర్నర్ ఆమోదించడంతో నియామక ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుత టీఎస్పీఎస్సీ బోర్డు నూతన చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి నియామకం పట్ల భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. టీఎస్పీఎస్సీలో సరిపడా అధికారులు సిబ్బంది లేరన్న విమర్శ కూడా ఉంది. వీటన్నింటిని ఒక్కొక్కటిగా పరిశీలించాలి. ముందుగా టీఎస్పీఎస్సీలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి. ఉద్యోగాల నియామకాల విషయంలో గతంలో జరిగిన విధంగా లోపాలు జరగకుండా పరీక్షలను అత్యంత పకడ్బందీగా, నాణ్యతగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలి. జాబ్ క్యాలెండర్‌లో భాగంగా ఫిబ్రవరి ఒకటిన గ్రూప్ 1 నోటిఫికేషన్ వేస్తామని ప్రక టించిన ప్రభుత్వం, ఇప్పటివరకు స్పష్టతనివ్వలేదు. గ్రూప్ 3, గ్రూప్ 4 ఫలితాలు, గురుకుల రాత పరీక్షల ఫలితాలు ప్రకటించాలి. పోలీస్ నియామకాల విషయంలో జీవో 46పై నెలకొన్న గందరగోళాన్ని పరిష్కరించాలి. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన కోసం కృషి చేయాలి. స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.గత పదేళ్లలో ఉద్యోగ నియామకాల్లో జరిగిన తీవ్ర నష్టాన్ని భర్తీ చేస్తూ, నిరుద్యోగ యువత ఆకాంక్షలు నెరవేర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేయాలి. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో నిరుద్యోగం, ఉద్యోగ ఖాళీలపై ప్రత్యేక చర్చ చేసి జాబ్ కాలెండర్‌ను విడుదల చేయాలని యువత కోరుతోంది.

ప్రభుత్వ పాలన సక్రమంగా, సజావుగా జరగాలన్నా, ప్రజలందరికీ అభివృద్ధి,సంక్షేమ ఫలాలు అందాలన్నా, అన్ని శాఖల్లో పూర్తిస్థాయి సరిపడా ఉద్యోగ నియామకాలు చేపట్టడం అవసరం. అత్యంత ప్రాధాన్యతగల రంగం ఏదైనా ఉందంటే అది విద్యారంగం. ఇందులో సుమారుగా 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక బోధన కుంటు పడుతోంది.ఏండ్ల నుండి ఉపాధ్యాయ నియామకాలు లేవు.డిఎస్సీ కోసం లక్షలాది మంది అభ్య ర్థులు ఆశతో ఎదురు చూస్తున్నారు. 5,089 పోస్టులకు డీఎస్సీ వేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అదే మాదిరిగా 13,086 పోస్టులతో పాటు ఇటీవల ఉపాధ్యాయుల పదోన్నతులతో ఏర్పడిన 9,979 పోస్టులను కలిపి మెగా డీఎస్సీ నిర్వహించాలనేది ప్రస్తుతం నిరుద్యోగుల ప్రధాన డిమాండ్.



ఢిల్లీలో రైతు పోరాటమెందుకు? కేంద్రం బాధ్యతేంటి?

ఢిల్లీలో రైతులు సకల సంసిద్ధతతో, తిను బండారాలతో, వేలాది ట్రాక్టర్లతో కథం తొక్కుతూ ముందుకు సాగుతున్నారు. వారిని నిలువరించేందుకు గతంలో భంగపడ్డ బీజేపీ ప్రభుత్వం... సిమెంట్ దిమ్మెలతో, ఇనుప కంచెలతో అనేక చోట్ల బారికెడ్లు నిర్మించింది. వాహనాలు రాకుండా కందకాలు తవ్వింది.ఇనుప చువ్వలు రోడ్డుపై నాటింది. ఇంటర్నెట్‌ను బంద్ చేసింది.144 సెక్షన్‌ను నెల రోజులపాటు విధించింది. లాఠీ చార్జీలతో, వాటర్ క్యానన్లతో, భాష్ప వాయుగోళాలతో, రబ్బర్ బుల్లెట్లతో, డ్రోన్‌ల టెక్నాలజీతో, అధునాతన సాంకేతిక ఆయుధాలతో రైతుల పీచమణచడానికి, వారిని ఢిల్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడానికి సీఆర్పీ పోలీసు బలగాలు ఎక్కడికక్కడ ప్రయత్నించింది. అయితే వీరంతా పాకిస్తాన్ తీవ్రవాదులో, ఖలిస్తాన్ ఏజెంట్లో కాదు. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతులు. వారు చేసిన నేరమేంటి? కేంద్రం ఎందుకు వీరిని అణగదొక్కాలని చూస్తోంది? పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని అడగడమే వారి నేరం. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు యథాతథంగా అమలు చేయాలని, రైతు రుణాలను సంపూర్ణంగా మాఫీ చేయడం కోరడం. రైతులకు, వ్యవసాయ కార్మికులకు పింఛను మంజూరు చేయమని విన్నవించడం, 'లఖింపూర్' బాధితులకు న్యాయం చేయాలని, రైతులపై అక్రమంగా బనాయించిన కేసులు ఉపసంహరించాలని డిమాండ్ చేయడం. ఇవి మోడీ ప్రభుత్వం దృష్టిలో నేరాలు. కానీ ఇవి రైతుల కనీస డిమాండ్లు.

మూడేండ్ల కిందట జరిగిన ఢిల్లీలో రైతుల మహా పోరాటం గుర్తుండే ఉంటుంది కదా. రాత్రనకా, పగలనకా, ఎండనకా, వాననకా చేసిన ద్యమం. రైతు సమస్యల పరిష్కరించాలని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేసిన ఈ పోరాటం చరిత్రలో లిఖించదగినది. ఈఉద్యమంలో 700 మంది రైతులు చనిపోయారు. ఏడాది పాటు చేసిన ఈ ఉద్యమానికి చివరకు మోడీ ప్రభుత్వం తలవంచింది. చివరకు ఆ మూడు రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేస్తున్నట్లు భారత ప్రధాని పార్లమెంట్ నిండుసభలో ప్రకటించాడు. రైతులకు ప్రభుత్వం తరపున క్షమాపణలు చెప్పాడు. రైతు డిమాండ్లు నెరవేరుస్తామని హామీనిచ్చాడు. ఉద్యమంలో చనిపోయిన రైతులకు కనీసం ఇప్పటికీ నష్టపరిహారం కూడా చెల్లించలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు.ఇప్పుడు రైతుల పట్ల ప్రేమ ఉందని చాటుకోవడానికి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో... మాజీ ప్రధాని చౌదరీచరణ్ సింగ్‌కు, ప్రజల ఆహార కొరత తీర్చిన, రైతు బాంధవుడు శాస్త్రవేత్త స్వామి నాథన్‌కు దేశంలో అత్యున్నత పురస్కారం 'భారతరత్న'ను ప్రకటించింది. ఇంతవరకు బాగానే ఉంది. వీరిదంతా ఓట్ల రాజకీయమని తేలి పోయింది. అయితే ఆలయాలను కటించడం, నాయకులకు భారీ విగ్రహాలను ప్రతిష్ఠించటం, పురస్కారాలతో సరిపుచ్చటంతో అంతా అయిపోయిందా? వారి ఆశయాలను, వారి హిత వాఖ్యలను, చేసిన విలువైన సూచనలను అమలు చేయకుండా తుంగలోకి తొక్కి, ఈ హంగామాలు ఎందుకు?

అయితే రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మళ్లీ రైతు ఉద్యమం ప్రారంభమైంది. ఓవైపు చర్చల పేరుతో రైతు సంఘాలను పిలుస్తూనే మరోవైపు వారి పోరాటాన్ని అణిచేందుకు మోడీ ప్రభుత్వం పూనుకోవడం ఎంత మాత్రం సరికాదు. అయినా రైతులు ఎక్కడా వెనుకంజ వేయటం లేదు. పంజాబ్, హర్యానా నలమూలల నుంచి రైతులు ఢిల్లీ నగర ప్రవేశానికి తండోపతతండాలుగా భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. గతంలో రైతాంగ ఉద్యమ చరిత్రలో ఏడాదిపాటు బీజేపీ ప్రభుత్వంతో పోరాడి ఘన చరిత్ర సృష్టించారు. ఆ అనుభవంతో, ద్విగుణీకృత ఉత్సాహంతో కథం తొక్కుతున్నారు.మొత్తానికి అక్కడ ఇరుపక్షాల మోహరింపులు చూస్తూ ఉంటే మహాభారతంలో కురుక్షేత్ర సంగ్రామవర్ణన సన్నివేశాలను తలపిస్తున్నాయి. ఇప్పటికే అనేక చోట్ల ట్రాఫిక్ స్తంభించింది.2020-21లో ఢిల్లీలో కనపడిన దృశ్యాలే మళ్ళీ పునరావృతమవుతున్నాయి.

ప్రజలను ఇంకెంత కాలం ఈ గారడీ చేష్టలతో మభ్యపెడుతాడు మోడీ? దేశప్రజలకు ఆరుగాలాలు కష్టించి అన్నం పెట్టే రైతులకే సున్నం పెడతారా? ఈ కక్ష సాధింపులేమిటి? వారిపై పోలీసులు అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయరా? వారిపై యుద్ధ ప్రకటించినట్లు ఈ దాడులేమిటి? పాకిస్తాన్ సరిహద్దులో కూడా ఈ బారికేడ్లు, సైనిక, పోలీసుల మోహరింపులు లేవు.అలా చేసినా వారి ఆక్రమిత భూభాగంలో కొంతైనా దక్కేది. రైతుల ఓట్లతో గెలిచి వారినే శత్రువులుగా చూస్తారా? బ్యాంకులను దోచి విదేశాలకు పారిపోయిన గుజరాతీ నేరస్తుల ముఠాకు రుణాలను మాఫీ చేస్తే లేని కష్టం, రైతుల రుణాలకు మాఫీ చేస్తేనే వచ్చిందా? ప్రతి ఏటా రుణ భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతు వ్యధలను తీర్చలేరా? కౌలు రైతుల సమస్యలు పరిష్కరించరా? భూసంస్కరణలు, వ్యవసాయ భూమి అమ్మకాన్ని క్రమబద్ధీకరించడంలో వస్తున్న ఇబ్బందులేంటి? పొలాలకు నీటి వసతి కల్పించటం, వ్యవసాయ భూమిని కార్పొరేట్లకు అమ్మకుండా నిషేధించడం వంటి డిమాండ్లు నేరవేర్చలేనివా? గ్రామీణభివృద్ధిని ఏర్పాటు చేసి, పంటల బీమా, గ్రామీణ మౌలిక సదుపాయాలు కల్పించడం, రైతులకు నాలుగు శాతం సరళ వడ్డీతో రుణాలందించడం వంటి అనేక సిఫారసులు కూడా స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన అంశాలే.వీటిలో ఏ ఒక్కటీ ఈ పదేండ్లలో మోడీ ప్రభుత్వం అమలు చేయలేదు. ఇక ప్రభుత్వం ఉండెందుకు? ఇంత తిరుగులేని మెజారిటీ ఉండి ఏమి సాధించినట్లు? రేపు నాలుగు వందల సీట్లు సాధిస్తా అంటున్నారు? ఇంతకన్నా పెద్దగా ఉద్ధరించేదేముంది? ఇప్పటికైనా రైతు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి. ఈ దేశ ప్రజలు విజ్ఞత గలవారన్న విషయం మరవకూడదు. సమయం వచ్చినప్పుడు సరైన నిర్ణయం తీసుకుంటారు.

- డా.కోలాహలం రామ్ కిశోర్, 9849328496

స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా సిరిసిల్ల రాజయ్య



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ నాయకులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమయం రానే వచ్చింది. కార్పొరేషన్ల పదవులను ఆశిస్తున్న నాయకులు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కార్పొరేషన్ల నియామక ప్రక్రియను ప్రారంభించింది. శనివారం ఈమేరకు తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను నియమించింది. కమిషన్ సభ్యులుగా ఎం రమేష్, సంకేనపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూనాయక్ మాలోత్‌లను నియమించింది.

వక్ఫ్ బోర్డు చైర్మెన్ అజ్మత్ ఉల్లా హుస్సేన్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వక్ఫ్‌బోర్డు కమిటీ చైర్మెన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత అజ్మత్ ఉల్లా హుసేన్‌ను నియమించింది. ఆయన విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ పత్రిక తెలంగాణ

- ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా కోడూరు శ్రీనివాసరావు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ మాస పత్రిక తెలంగాణ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా కోడూరు శ్రీనివాసరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.శనివారం ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం హనుమంతరావు ఉత్తర్వులు చేశారు. ప్రస్తుతం ఆయన ఓ ప్రముఖ టీవీ చానల్‌లో సీనియర్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన ఎన్నిక తర్వాత శనివారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు

సమ్మెలో బీఎస్ఎన్ఎల్...



నవతెలంగాణ- హైదరాబాద్

బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెను విజయవంతం చేశారు. తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలలో సమ్మె జరిగింది. సమ్మెలో 500 మంది ఉద్యోగులు, 350 మంది కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. 1000 మంది పెన్షనర్లు వివిధ జిల్లాలలో సమ్మె శిబిరాల వద్దకు మద్దతు తెలిపి ప్రదర్శనలు నిర్వహించారు. కొన్నిచోట్ల సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ నిర్వహించిన ప్రదర్శనలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు. సమ్మెకు బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జె. సంపత్‌రావు, జి. సాంబశివరావు, క్యాజువల్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యమ్ తిరుమలాచార్యులు, బి.పరిపూర్ణాచారి, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ఆర్ వీరాస్వామి, రాంచంద్రుడు నాయకత్వం వహించారు.

కులగణనకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగావకాశాలు కల్పించాలని గంగుల డిమాండ్ చేశారు.

సర్వే సర్వరోగ నివారిణి భట్టి

రాష్ట్రంలో కులగణన మాత్రమే కాదనీ, ప్రతి ఇంటి సర్వే నిర్వహించి వారి ఆర్థిక స్థితిగతుల వివరాలు సేకరిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు...రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వంటి అంశాలపై సభ్యులు వ్యక్తం చేసిన అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు. తాము చేపట్టబోయే సర్వే వీటన్నింటికీ సర్వరోగ నివారిణిగా ఉండబోతోందని వివరించారు. ఆ సర్వే ఈ దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక మార్పులకు పునాదిగా మారనుందని తెలిపారు. సర్వే విషయంలో బీఆర్ఎస్ సభ్యులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని చెప్పారు.

అక్కడ మాట్లాడలేకే ఇక్కడ...

ప్రతిపక్షాల సందేహాలను నివృత్తి చేసే బాధ్యత తమదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గంగుల కమలాకర్ గత ప్రభుత్వంలో పదేండ్లు మంత్రిగా ఉండి బీసీల గురించి ఏమీ మాట్లాడలేకపోయారని ఎద్దేవా చేశారు. ఆ బాధనంతా ఇప్పుడు వెళ్లబోసుకుంటున్నారని తెలిపారు. ఎవరు ఏం చెప్పినా విని, తాము జవాబు చెబుతామని వ్యాఖ్యానించారు.

ఓబీసీలకు మంత్రిత్వశాఖ కావాలని కోరింది మేమే : కేటీఆర్

కులగణనపై అసెంబ్లీలో ప్రభుత్వం పెట్టిన బిల్లును స్వాగతిస్తూ, మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కే తారకరామారావు (కేటీఆర్) అన్నారు. 2004లో కేంద్ర మంత్రి హోదాలో తమపార్టీ అధినేత కేసీఆర్ ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కోరారని గుర్తుచేశారు. దీనిపై రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామన్నారు. అయితే బీహార్ తరహాలో న్యాయసమస్యలు తలెత్తకుండా, బిల్లు రూపొందించి, చట్టబద్ధత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికోసం జ్యుడీషియరీ కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2011లో చట్టం చేయకుండానే కులగణన జరిగిందనీ, చేసే పనిలో చిత్తశుద్ధి ఉండాలని అన్నారు. 2014లో సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను ఇప్పటి వరకు బయటపెట్టలేదని గుర్తుచేశారు. 2014 నుంచి 2023 వరకు తొమ్మిదిన్నరేండ్లలో బీసీల కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు కేవలం రూ.23వేల కోట్లు అని చెప్పారు. ఎమ్‌బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నామని చెప్పి, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. బీహార్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో కులగణనపై చట్టం చేయలేదనీ, ఎక్కడా న్యాయస్థానాలు స్టే విధించలేదని చెప్పారు.

అఖిలపక్షంతో నిర్వహించండి : కూనంనేని

ఇదే అంశంపై సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కులగణనపై విస్తృత చర్చ కోసం అఖిలపక్షాన్ని పిలవాలనీ, దానిలో బీసీ సంఘాలకూ ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. దేశంలో కార్పొరేట్ రంగం విస్తరించి, ప్రభుత్వ రంగం కుదించుకుపోతున్నదనీ, ఈ దశలో కులగణన ద్వారా జనాభా ప్రాతిపదికన ఎవరి వాటాలు ఎంతో తేల్చాల్సి ఉంటుందన్నారు. అదే సందర్భంలో క్రిమీలేయర్‌పై కూడా చర్చ జరగాలన్నారు. తీర్మానాన్ని బిల్లు రూపంలో తేవాలనీ, ఆర్థిక స్థితిగతుల ప్రాతిపదికగా నిర్ణయాలు జరగాలని చెప్పారు. అదే సమయంలో ఓసీల ఆర్థిక స్థితిగతుల్నీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ బీసీ జనగణనకోసం కమిషన్ ఏర్పాటు చేయాలనీ, చర్చించేందుకు అసెంబ్లీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో తీర్మానాలు చేయలేదనీ, పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కులగణన తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్టు భావించాల్సి వస్తుందన్నారు. 2014 ఆగస్టులో బీఆర్ఎస్ ప్రభుత్వ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఏమైందని ప్రశ్నించారు. ముస్లింల ఆర్థిక స్థితిగతులపై గతంలో సచార్ కమిషన్, రంగనాథ్ కమిషన్లు అనేక నివేదికలు ఇచ్చాయనీ, వాటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. చిత్తశుద్ధితో కులగణన చేపడితే తొలుత న్యాయసలహా తీసుకోవాలని సూచించారు. కులగణన జరిగాక ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తారా అని ప్రశ్నించారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాంగ్రెస్ సభ్యులు కే శంకర్, వాకాటి శ్రీహరి తదితరులు మాట్లాడారు. అనంతరం సభ్యుల సందేహాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానాలు ఇచ్చారు. సభ్యుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. తీర్మానానికి ఆమోదం తెలపాలని కోరారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్మానం ఆమోదం పొందినట్టు ప్రకటించారు.

నీటిపారుదల రంగంపై నేడు శ్వేతపత్రం

- మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై వెల్‌లోకి దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు
- ఉద్రిక్తతల నడుమ నేటికి సభ వాయిదా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల రంగం-శ్వేతపత్రం అనే అంశంపై శనివారం అసెంబ్లీలో లఘుచర్చ చేపట్టనున్నారు. సాగునీటి రంగంపై మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. వాస్తవానికి శుక్రవారం సాయంత్రమే సభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి అసెంబ్లీ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సాయంత్రం 5:51 నిమిషాలకు సభ ప్రారంభమైంది. వెంటనే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య లేచి మాట్లాడారు. సభలో సాగునీటిరంగంపై సుదీర్ఘ చర్చ జరగాల్సిన అసవరమున్న నేపథ్యంలో శనివారానికి వాయిదా వేయాలని స్పీకర్‌ను కోరారు. దీన్ని బీఆర్ఎస్ సభ్యులు తప్పుబట్టారు. ఈ సమయంలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేచి 'పాపాల భైరవుడు..సభకు వచ్చి చర్చలో పాల్గొనాలి' అంటూ కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లారు. కోమటిరెడ్డి మాటలను రికార్డుల నుంచి తొలగించాలని పట్టుబట్టారు. 'శ్రీధర్‌బాబు ఇది పద్ధతేనా? సభను నడిపే తీరు ఇదేనా. ఇది చెప్పడానికి రెండు గంటలు కూర్చోబెట్టాలా?' అంటూ కడియం శ్రీహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు స్పీకర్‌నుద్దేశించి మాట్లాడుతూ..'సభను నడిపే పద్ధతి ఇది కాదు. మంత్రి ఇలా మాట్లాడటం సరిగాదు. మేం కూడా ఇష్టమున్నట్టు అనొచ్చు. స్పీకర్‌గారూ ఇలా మాట్లాడొచ్చా? మంత్రి చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తేనే మేం మాట్లాడుతాం' అని స్పష్టం చేశారు. అదే సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేచి 'హెలికాప్టర్‌లో ప్రయాణం చేసి నల్లగొండ సభకు పోవచ్చుగానీ, పెద్దమనిషి ఇక్కడ ఉండి సభకు రాలేరా? నల్లగొండకు అన్యాయం చేసిండు. అందుకే కేసీఆర్‌ను రమ్మన్ని పట్టుబడుతున్నం.. మమ్ముల్ని దున్నపోతు లంటాడా? నన్ను అరెయ్..తురెయ్ అంటడా? సీఎంను పట్టుకుని ఇష్టమొచ్చిన మాటలు అనొచ్చా? కేసీఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. అదే సమయంలో హరీశ్‌రావు జోక్యం చేసుకుంటూ 'సభలో అలా మాట్లాడొద్దు. బయట అన్న వాటిని సభలో ప్రస్తావించొద్దు. గతంలో రేవంత్‌రెడ్డి..కేసీఆర్‌ను కాల్చిపడేయాలి, ఉరితీయాలి అన్నడు' అని గుర్తుచేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'అసెంబ్లీ కార్యకలాపాల షెడ్యూల్‌లో తెలంగాణ రాష్ట్ర సాగునీటి రంగం-శ్వేతపత్రం'పై చర్చ అని పేర్కొని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జీరో అవర్ పెట్టి, ఆ



తర్వాత కులగణనపై తీర్మానం చేసి సభకు టీ బ్రేక్ ఇచ్చారు. రెండు గంటలు వెయిట్ చేయించి ఇప్పుడు వాయిదా అంటారా? ఇదేం పద్ధతి' అని అడిగగారు. బీఏసీలో చర్చించి ఫైనల్ చేయకుండా కొత్త అంశాలను పెట్టకూడదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. రాత్రి 11 అయినా సభలో చర్చించడానికి తాము సిద్ధమనీ, పూర్తిగా సన్నద్ధమై వచ్చామని తెలిపారు. విప్‌లు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి సహకరించాలని కోరారు. బీజేపీ పక్షనేత ఎ.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..కొన్ని గంటల పాటు వెయిట్ చేయించి ఇప్పుడు వాయిదా వేస్తున్నామని చెప్పటం సరిగాదన్నారు. శనివారం నాడు ఢిల్లీలో తమ పార్టీ నేషనల్ కౌన్సిల్ మీటింగ్ ఉందనీ, ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్యేలు ఢిల్లీకి పోయారని చెప్పారు. జీరో అవర్ ఉండాల్సిందేననీ, సభను ఇంకొన్ని రోజుల పాటు పొడిగించినా తమకేం అభ్యంతరం లేదని చెప్పారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం సభ్యులు జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ..సభను శనివారానికి వాయిదా వేయాలని కోరారు. సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..సమ్మక్కసారలమ్మ జాతరను పరిగణనలోకి తీసుకుని సభను 25 తర్వాత పెట్టినా తమకు ఓకేననీ, ఒకవేళ రేపే నిర్వహిస్తామన్నా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సభను మాత్రం ఈ రోజు వాయిదా వేయాలని కోరారు.

బీఏసీ రోజూ పెట్టరని తెలియదా? : దుద్దిళ్ల

ప్రతిరోజూ బీఏసీ పెట్టరనే విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ఇంకేమైనా మిగతా కార్యకలాపాలుంటే స్పీకర్ అనుమతితో ముందుకెళ్తామని బీఏసీలోనే చెప్పామని గుర్తుచేశారు. శ్వేతపత్రంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అయితే, సీపీఐ, ఎంఐఎం, తమ సభ్యులు సభను వాయిదా వేయాలని స్పీకర్‌ను కోరారని చెప్పారు. ఎక్కువ మంది సభ్యులు చర్చలో పాల్గొనాల్సి ఉంది కాబట్టి శనివారం నిర్వహించాలనే డిమాండ్ సభ్యుల నుంచి వచ్చిందన్నారు. మంత్రి మాట్లాడిన అనంతరం సభను శనివారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

ప్రోటోకాల్ సమస్యలు రాకుండా చూడండి

- జీరో అవర్‌లో స్పీకర్‌ను : కోరిన నూతన ఎమ్మెల్యేలు
- కొత్త వాళ్లను ప్రోత్సహించాలని విజ్ఞప్తి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

'నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ సమస్యలు రాకుండా చూడండి..అవమానాలు ఎదురుకాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. స్పీకర్ ఇందుకు చొరవ చూపాలని' నూతన ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. కొత్తవాళ్లను ప్రోత్సహించాలని కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు స్పీకర్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. తొలుత జీరో అవర్‌ను చేపట్టారు. ఈసందర్భంగా పదుల సంఖ్యలో నూతన ఎమ్మెల్యేలు మాట్లాడారు. నియోజకవర్గాల్లో ఎదురవుతున్న ప్రజాసమస్యలతోపాటు ప్రోటోకాల్ ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, రోడ్లు, భవనాల శాఖ మంరతి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపటు ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కె.తారకరామారావు, తన్నీరు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, పి.సబితాఇంద్రారెడ్డి సభలోనే ఉన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన జీరో అవర్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. దాదాపు మూడు గంటలపాటు కొత్త, పాత ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లోని సమస్యలను స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానం పంపడం లేదని స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. కొత్త ఎమ్మెల్యేలకు ఇబ్బందులు



తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం తోపాటు స్పీకర్‌దేనని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, మంత్రులు, సీఎం, అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలను భాగస్వాములను చేయాలని కోరారు. వెనుకబడిన నియోజకవర్గమైన ఆర్మూర్‌లో కొడంగల్ తరహా మోడల్ ప్రణాళిక అమలుచేయాలని కోరారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ జీవో 111 రద్దయిందనీ, దాని స్థానంలో జీవో 69 తీసుకొచ్చారని అన్నారు. ఆ జీవో అమలవుతున్నదా అని ప్రశ్నించారు.

ఈ జీవోపై ప్రజల్లో అపోహలు ఉన్నాయని గుర్తు చేశారు. ఓడిపోయిన అభ్యర్థులు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తారనే ప్రచారం జరుగుతున్నదని చెప్పారు. గతంలో మంజూరైన పనులు రద్దుచేయకూడదని కోరారు. తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గం గురించి స్పీకర్‌కు తెలుసని అన్నారు. స్థానిక నాపరాతి పరిశ్రమల్లో దాదాపు 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. తాజాగా సెరామిక్ టైల్ల రావడంతో పోటీ ఏర్పడిందన్నారు. సుద్దగనుల యాజమానులు సైతం ఆందోళనలో ఉన్నారని చెప్పారు. రాయల్టీ కర్నాటకలో ఒకలా, తెలంగాణలో మరోలా ఉందనీ, దీన్ని సవరించాలని కోరారు. కంది పంటకు తాండూరు ఫేమస్ అని చెబుతూ, ఇక్కడ కంది బోర్డు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. విప్ బీర్ల మల్లయ్య మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని గందిమల్ల ప్రాజెక్టును చేపట్టాలని అన్నారు. దీని ద్వారా పది మండలాలను సస్యశ్యామలం చేయడానికి వీలవుతుందని పేర్కొన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే కె.అనిరుద్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పెరిగితున్నదనీ, బైపాస రోడ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక రెవెన్యూ డివిజన్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ నియోజకవర్గంలోని చేర్యాల మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలని కోరారు.

ఒక్కో సమస్య పరిష్కారానికి ఒక్కో చోటకు వెళ్లాల్సి వస్తున్నదని చెప్పారు. ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌కు మార్చాలని అన్నారు. అన్ని అవసరాల కోసం నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు హైదరాబాద్‌కు వస్తారని గుర్తు చేశారు. ఉద్యోగులు ప్రమోషన్లు కోల్పోతున్నారని చెప్పారు. ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ బహదూర్‌పుర లో పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలు ఉన్నాయనీ, అధికంగా ఆర్టీసీ బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఎల్కర్తికి మంజూరైన సైనిక్‌స్కూల్‌ను మార్చాలని ప్రభుత్వం భావిస్తు న్నట్టుగా తెలిసిందన్నారు. ఇది సరికాదనీ, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్రానికి మూడు నుంచి నాలుగు సైనిక్ స్కూళ్లు మంజూరు చేయించుకునే అవకాశం ఉందన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం విఫలమైందన్నారు.సభ్యుల ప్రశ్నలకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమాధానాలిచ్చారు. సభ్యుల ప్రసంగాల మధ్యలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని ప్రతి సభ్యులు ఒక్క ప్రధాన సమస్యను సభలో ప్రస్తావించాలని సూచించారు.

కాంగ్రెస్ అకౌంట్లు సీజ్

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయ పన్ను శాఖ విధించిన జరిమానా, నోటీసులకు ఇప్పటి వరకూ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు స్పందించ లేదని ఆదాయపన్ను శాఖ తెలిపింది. అకౌంట్లు సీజ్ చేస్తున్నట్టుగా కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ విభాగాలకు సమాచారం పంపింది. దీంతో కాంగ్రెస్ ఐటీ అప్పిలియేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఆదాయపు పన్ను సీజ్ చేసిన అకౌంట్లను ఉపయోగించుకునేందుకు ఐటీ అప్పిలియేట్ ట్రిబ్యునల్ అనుమతించింది.

ప్రజాస్వామ్యంపై దాడి

కాంగ్రెస్‌కి చెందిన బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై లోతైన దాడి అని తెలిపారు. అధికార మత్తులో ఉన్న మోడీ సర్కార్ లోక్‌సభ ఎన్నికల ముందు దేశంలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు నగదు రూపంలో డిపాజిట్ చేసిన రూ.14.40 లక్షలకు, గతంలో ఐటీ శాఖ ఏకంగా రూ. 210 కోట్ల జరిమానా విధించిందని చెప్పారు. అయితే ఇప్పుడు ఈ చిన్నసాకుతో ఆదాయపు శాఖ కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంస్థ అయిన యువజన కాంగ్రెస్ బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసిందని ఆరోపించారు. ఈ అంశంపై సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఖర్గే స్పందించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎలక్టోరల్ బాండ్లను సుప్రీంకోర్టు కొట్టేసిన తరువాత బీజేపీ ఖాతాలు సీజ్ చేయాలని అన్నారు. ఇప్పటికే ఇందులో 95 శాతానికి పైగా నిధుల్ని బీజేపీ జేబులో వేసుకుందని ఆరోపించారు. అంతేకానీ క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సేకరించిన ప్రతిపక్ష కాంగ్రెస్ కాదన్నారు. 'ర్యాజ్యాంగ విరుద్ధంగా సేకరించిన డబ్బును బీజేపీ ఎన్నికల్లో ఖర్చు చేస్తోంది. మేము క్రౌడ్ ఫండింగ్ ద్వారా సేకరించిన నిధుల్ని సీజ్ చేశారు' అని విమర్శించారు. మోడీ మూడోసారి గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యం అంతమవుతుందని మరోసారి వ్యాఖ్యానించారు. అందుకే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవని గతంలోనే హెచ్చరించానన్నారు.

కాంగ్రెస్ ది డబ్బు కాదు... ప్రజా బలం

కాంగ్రెస్ పార్టీకి డబ్బు బలం కాదని, ప్రజల బలం ఉందని అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. నియంతృత్వ బెదిరింపులకు కాంగ్రెస్ లొంగదని స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్యాన్ని అన్ని విధాలుగా పరిరక్షించేందుకు, ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పోరాడుతారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు ఒక నెల ముందు, ప్రతిపక్ష పార్టీ ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేపట్టకుండ బీజేపీ ఒక బలహీన చర్యలను ఎంచుకుందని పార్టీ జనరల్ సెక్రటరీ(సంస్థాగత) కెసి వేణుగోపాల్ విమర్శించారు. బీజేపీ తన అకౌంట్లలో కోటికిపైగా నిల్వచేసిందని విమర్శించారు. అక్రమ ఎలక్టోరల్ బాండ్ స్కాంతో రూ. 6,500 కోట్లు చెక్కు చెదరకుండా ఆ పార్టీ అకౌంట్‌లో మిగిలిపోయాయన్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌కు ముందు ఉద్దేశపూర్వకంగా అకౌంట్ల సీజ్ జరిగిందని పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ విమర్శించారు. అకౌంట్ల రిలీజ్ కోసం చట్టపరమైన మార్గాలను అన్వేశిస్తున్నామని, తమకు న్యాయ వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందన్నారు.

కన్నెర్ర ...

(మొదటి పేజీ తరువాయి)

రచయితలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు "నేషన్ ఫర్ ఫార్మర్స్" వేదిక ఆధ్వర్యంలో బంద్, సమ్మెకు మద్దతు తెలిపారు.

సమ్మె మోడీ ప్రభుత్వం క్రూరమైన అణచివేతకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహాన్ని ప్రతిబింబిస్తుంది. బీజేపీ నేతృత్వంలోని హర్యానా రాష్ట్ర ప్రభుత్వం పంజాబ్‌లోని శంభు సరిహద్దు వద్ద రైతులపై దాడికి వడిగట్టింది. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు జాతీయ ఎజెండాలో ప్రజల జీవనోపాధి సమస్యలను తిరిగి తీసుకొచ్చామని రైతు, కార్మిక సంఘాల నేతలు తెలిపారు.పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, బీహార్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒడిశా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, అసోం, త్రిపుర పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు తదితర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో దుకాణాలు, పరిశ్రమలు, మార్కెట్లు, విద్యాసంస్థల్లో నిరసన దాదాపు బంద్‌గా మారగా, గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. భారీ ప్రదర్శనలు, నిరసన ర్యాలీలు నిర్వహించారు. పంజాబ్, హర్యానాలో రైల్వే స్టేషన్ల వద్ద ఆందోళనలు జరిగాయి. దీంతో కొన్ని రైళ్లను దారి మళ్లించారు. మరికొన్నింటిని రద్దు చేశారు. ఇందులో లక్షలాది మంది ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్మికులు పని నిలిపేసి, భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ వివిధ రాష్ట్రాల్లో బంద్ లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని సర్కిళ్లలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు సమ్మెలో భారీగా పాల్గొన్నారు. విద్యార్థులు తరగతులను బహిష్కరించి బంద్ లో భాగస్వామ్యం అయ్యారు. యువత, మహిళలు కూడా భారీగా పాల్గొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ప్రెస్ కాలనీలో వందలాది మంది యాపిల్ రైతులను పోలీసులు, పారా మిలటరీ బలగాలు బలవంతంగా చెదరగొట్టారు. నాయకులను పోలీసు వాహనాల్లోకి లాగారు. ఎటువంటి నోటీసు లేకుండా కస్టడీకి తరలించారు. కాంట్రాక్ట్ కార్మికులతో సహా కార్మికుల భారీ సమ్మె కారణంగా కలకత్తా, పారాదీప్, టుటికోరిన్, విశాఖపట్నం, చెన్నై వంటి దేశంలోని దాదాపు అన్ని ప్రధాన ఓడరేవులలో కార్గో హ్యాండ్లింగ్ కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గుజరాత్‌లోని భావ్‌నగర్ పోర్టుతోపాటు పలు మైనర్ పోర్టుల్లో కార్మికులు సమ్మెలో ఉన్నారు.

అసోం, నాగాలాండ్, మణిపూర్‌లలో విస్తరించి ఉన్న దేశంలోని ఈశాన్య ప్రాంతంలోని ప్రభుత్వ రంగ చమురు శుద్ధి కర్మాగారాలు, మార్కెటింగ్ వ్యవస్థలు ముఖ్యంగా కాంట్రాక్టు కార్మికులు, కార్మికుల భారీ సమ్మె కారణంగా దాదాపుగా మూసివేతకు గురయ్యాయి. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా వర్కర్లు భారీ సమ్మెలో ఉన్నారు. గుజరాత్‌లో అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశాలు తమ రెండు రోజుల సమ్మెను ప్రారంభించారు. తమిళనాడులోని తిరుచిరాపల్లి, తిరుమయం, రాణిపేట్‌లోని బీహెచ్ఈఎల్ ప్లాంట్లు దాదాపు పూర్తి సమ్మెలో ఉన్నాయి. విశాఖపట్నంలోని బీహెచ్ఈఎల్ పాక్షిక సమ్మెను ప్రకటించింది.సేలం స్టీల్ ప్లాంట్‌లో సమ్మె పాక్షికంగా జరిగింది. ఇతర స్టీల్ ప్లాంట్లలో ప్రదర్శన నిర్వహించారు. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్మికులు అన్ని ఈశాన్య రాష్ట్రాలు, అన్ని దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్, సిక్కింలలో వందలాది ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు, ఇతర పని ప్రదేశాలలో పూర్తి సమ్మెలో ఉన్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో కొన్ని సబ్ స్టేషన్లలో పాక్షిక సమ్మె, ఢిల్లీలోని ఘజియాబాద్, సాహిబాబాద్, నోయిడా, యుపిలోని బులంద్‌సహర్, హర్యానాలోని ఫరీదాబాద్‌లతో పాటు ఢిల్లీలోని జాతీయ రాజధాని ప్రాంతంలోని లక్షలాది మంది పారిశ్రామిక కార్మికులు సమ్మెలో ఉన్నారు.

మహారాష్ట్రలోని నాసిక్‌లోని పారిశ్రామిక ప్రాంతాల కార్మికులు దాదాపు అన్ని పారిశ్రామిక యూనిట్లలో భారీ సమ్మెలో చేరారు. ఉత్తర చెన్నై, కాంచీపురం, తమిళనాడులోని కంబాటోర్‌లోని ఎంఎస్సిలు, పవర్‌లూమ్స్, ఇంజనీరింగ్, ఎంఎస్ఎంఈలతో పాటు కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ , ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాల్లోని కొన్ని ప్రధాన కర్మాగారాల్లోని పారిశ్రామిక కార్మికులు కూడా హెూల్డింగ్‌తో పాటు సమ్మెలో ఉన్నారు. కేరళలో రాజ్‌భవన్‌తో సహా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ సమీకరణలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు బీహార్, హర్యానా, రాజస్థాన్, నాగాలాండ్, పంజాబ్ తదితర ఆరు రాష్ట్రాల్లో సమ్మెలో ఉండగా, ఇతర రాష్ట్రాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. బీమా, బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా తమ శాఖలు, కార్యాలయాల వద్ద ప్రదర్శనలు నిర్వహించారు.

ఈ బంద్, సమ్మె దేశమంతటా రైతు-కార్మికుల ఐక్యతను పటిష్టం చేయడానికి, గ్రామ, పట్టణ స్థాయి వరకు ప్రజల ఐక్యత దిశగా ముందుకు సాగడానికి, మోడీ ప్రభుత్వం ఆధ్వర్యంలో కార్పొరేట్-మత సంబంధానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో గొప్ప విజయమని రైతు, కార్మిక నేతలు పేర్కొన్నారు.

కార్పొరేట్ కంపెనీల పట్ల పూర్తి సానుభూతి చూపిస్తున్న ప్రధాని మోడీ రైతులపై లాఠీచార్జి, పెల్లెట్ ఫైరింగ్, టియర్ గ్యాస్ స్ప్రేలు, డ్రోన్‌ల వినియోగం, రోడ్డు దిగ్బంధనం, ఇంటింటికీ బెదిరింపులతో అణచివేతకు గురిచేయడం దురదృష్టకరమని నేతలు విమర్శించారు. శంభులో ముగ్గురు రైతులకు చూపు కోల్పోయిన గాయాన్ని ఎస్కేఎం మరింత తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై ఉద్దేశ్యపూర్వకంగా ప్రజలను మోసం చేసిన మోడీ ప్రభుత్వం, తాను నిజాయితీపరుడని నమ్మించాలనుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 2021 డిసెంబర్‌లో ఎంఎస్పీ, ఇతర డిమాండ్‌లను పరిగణనలోకి తీసుకుంటామని ప్రధాని మోడీ ఒక కమిటీ ఏర్పాటుకు హామీ ఇచ్చారని, ఏడు నెలల తరువాత ఎంఎస్పీని ఇవ్వడాన్ని బహిరంగంగా వ్యతిరేకించిన వారితో ఒక కమిటీని ఏర్పాటు చేశారని విమర్శించారు. ఇప్పుడు చర్చల పేరుతో ప్రజలను మభ్యపెట్టేందుకు శంభు వద్ద ఆందోళనకారుల వద్దకు మంత్రులను పంపుతున్నారని, చర్చలను అపహాస్యం చేస్తూ చర్చలోని అంశాలను, పురోగతిని 'రహస్యం'గా ఉంచి యావత్ దేశ రైతులను అంధకారంలో పడేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయిన మోడీ సర్కార్, మతపరమైన వివాదాల వైపు వారి దృష్టి మళ్లించడంలో బిజీగా ఉందని మండిపడ్డారు. రైతులు, కార్మికులు, విద్యార్థి, యువత, మహిళా,.సాంస్కృతిక కార్యకర్తల ఇతర సంఘాలకు మద్దతును అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసి ఈ డిమాండ్లపై బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని, రైతు, కార్మిక, ప్రజల అనుకూల విధానాలను భర్తీ చేయడానికి ముందుకు సాగాలని ఆశిస్తున్నామని అన్నారు.

డిమాండ్లు

"సి2 ప్లస్ 50 శాతం ఎంఎస్పీతో పంటల సేకరణకు చట్టబద్ధ హామీ ఇవ్వాలి. ఇన్‌పుట్ ఖర్చులలో తగ్గించాలి. విత్తనాలు, ఎరువులు, విద్యుత్‌పై రైతులకు సబ్సిడీని పెంచాలి. అన్ని వ్యవసాయ కుటుంబాలను అప్పుల ఉచ్చు నుంచి విముక్తి చేయడానికి సమగ్ర రుణ మాఫీ పథకాన్ని అమలు చేయాలి. రైతుల ఆత్మహత్యలను ఎలాగైనా అరికట్టాలి. విద్యుత్ (సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలి. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు అనుమతించకూడదు. వాతావరణ మార్పులు, కరువు, వరదలు, పంట సంబంధిత వ్యాధులు మొదలైన వాటి వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు కార్పొరేట్ అనుకూల పీఎం ఫసల్ బీమా యోజనను ఉపసంహరించుకోవాలి. అన్ని పంటలకు సమగ్ర ప్రభుత్వ రంగ పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. చారిత్రాత్మక రైతు పోరాటాన్ని నిలిపివేసినప్పుడు రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీలను అమలు చేయాలి. (అమరవీరులైన రైతులందరికీ సింగు సరిహద్దులో స్మారక చిహ్నం, నష్ట పరిహారం చెల్లించి వారి కుటుంబాలకు పునరావాసం, పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను ఉపసంహరించుకోవడం). లఖింపూర్ ఖేరీ మారణకాండకు ప్రధాన కుట్రదారు కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రా టెనీ మంత్రి పదవి నుంచి తొలగించి, విచారణ చేయాలి. ప్రభుత్వం రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ)ని రద్దు చేయాలి. ఖనిజాలు, లోహాల తవ్వకాలపై ప్రస్తుత చట్టాన్ని సవరించాలి. స్థానిక సంఘాలు, ముఖ్యంగా ఆదివాసీలు, రైతుల అభ్యున్నతి కోసం బొగ్గు గనులతో సహా గనుల నుండి లాభంలో 50 శాతం వాటాను నిర్ధారించాలి. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి. ఆహారం, మెడిసిన్, వ్యవసాయ ఇన్‌పుట్స్, యంత్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి. పెట్రోలియం ఉత్పత్తులు, వంట గ్యాస్ పై సెంట్రల్ ఎక్సైజ్ సుంకం తగ్గించాలి. కరోనా సాకుతో రద్దు చేసిన సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు, మహిళలకు, క్రీడాకారులకు రైల్వే రాయితీని పునరుద్ధరించాలి. ఆహార భద్రతకు హామీ ఇవ్వాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను విశ్వవ్యాప్తం చేయాలి. అందరికీ ఉచిత విద్య, ఆరోగ్యం, నీరు హక్కు. కొత్త జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి. అందరికీ ఇండ్లు ఉండేలా చూడాలి. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఎ), భూ సేకరణ పునరావాసం, పునరావాస చట్టం (ఎల్ఎఆర్ఆర్) 2013ని కఠినంగా అమలు చేయాలి. అటవీ (పరిరక్షణ) చట్టం, 2023, జీవ వైవిధ్య చట్టం, నివాసితులకు కూడా తెలియజేయకుండానే అటవీ క్లియరెన్స్‌ను ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతించే నిబంధనలకు సవరణలను ఉపసంహరించుకోవాలి. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ను క్రమం తప్పకుండా నిర్వహించాలి. పని చేసే హక్కును ప్రాథమిక హక్కుగా మార్చాలి. మంజూరైన పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి. రోజుకు రూ.600 వేతనంతో ఏడాదికి 200 రోజులకు ఉపాధి హామీ విస్తరించాలి. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి. నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి. పనిలో సమానత్వం, భద్రతను నిర్ధారించాలి. అసంఘటిత కార్మికులను నమోదు చేసి, పెన్షన్‌తో సహా సమగ్ర సామాజిక భద్రత కల్పించాలి. భవన నిర్మాణ కార్మికులకు ఈఎస్ఐ కవరేజీని అందించాలి. సంక్షేమ నిధి నుండి విరాళాలతో పాటు, ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులందరికీ ఆరోగ్య పథకాలు, ప్రసూతి ప్రయోజనాలు, జీవిత, వైకల్య భీమా కవరేజీని కూడా అందించాలి. గృహ కార్మికులు, గహ-ఆధారిత కార్మికులపై ఐఎల్ఓ ఒప్పందాలను ఆమోదించి, తగిన చట్టాలను రూపొందించాలి. వలస కార్మికులపై సమగ్ర విధానాన్ని రూపొందించాలి. ఇప్పటికే ఉన్న ఇంటర్-స్టేట్ మైగ్రెంట్ వర్క్‌మెన్ (ఉపాధి నియంత్రణ) చట్టం-1979 వారి సామాజిక భద్రతా కవర్ పోర్టబిలిటీని బలోపేతం చేయాలి. ఎన్పిఎస్ ని రద్దు చేసి, ఓపిఎస్ ని పునరుద్ధరించాలి. అందరికీ సామాజిక భద్రతను అందించాలి. కనీస పెన్షన్ నెలకు రూ.10 వేలు ఉండేలా చూడాలి. సూపర్ రిచ్‌పై పన్ను విధించాలి. కార్పొరేట్ పన్నును మెరుగుపరచాలి. సంపద పన్ను, వారసత్వ పన్నును మళ్లీ ప్రవేశపెట్టాలి. హిట్ అండ్ రన్ నిబంధనలతో సహా భారతీయ న్యాయ సంహితలోని క్రూరమైన నిబంధనలను ఉపసంహరించుకోవాలి" వంటి డిమాండ్ల సాధన కోసం గ్రామీణ బంద్ జరిగింది.



హామీల అమలుకు పూనుకోవాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

విద్య, ఉపాధ్యాయ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో చేర్చిన హామీల అమలుకు వెంటనే పూనుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. శుక్రవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సంఘం నాయకులు రఘుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కె రంజిత్‌కుమార్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు రెగ్యులర్ డీఈఓలను, అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల నిర్వహణకు చొరవతీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, అర్థాంతరంగా నిలిచిపోయిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని కొనసాగించాలని చెప్పారు. జీఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు, స్పౌజ్‌లను బదిలీ చేసి న్యాయం చేయాలని కోరారు.

గత ప్రభుత్వం బకాయిపడిన మూడు డీఏలను విడుదల చేయాలని అన్నారు. ట్రెజరీల్లో ఆమోదం పొంది ఇరవై నెలలుగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్రశిక్ష, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగులకు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జనవరి నెల జీతాలు మంజూరు చేయాలని అన్నారు. గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రమేష్, కోశాధికారి తిరుపతయ్య, నాయకులు నక్క తిరుపతి, ఎం రామయ్య, కన్నయ్య, రమేష్, సూర్యకిరణ్, రాజేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మెన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన చైర్మెన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ హజ్‌హౌస్‌లోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో జరిగిన బోర్డు పాలక మండలి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బీఆర్ఎస్ హయాంలో నియమించిన నామినేటెడ్ సభ్యుడైన చైర్మెన్‌ను తొలగించిన విషయం విదితమే. తాజాగా నూతన ప్రభుత్వం బోర్డు సభ్యులుగా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మహిళా ఐఏఎస్ అధికారి ఆయేషా ముసరత్‌ను నామినేట్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎన్నికల కేటగిరిలో ఎన్నికయిన బోర్డు సభ్యుడు మౌలానా బందగీ బాద్‌షా రియాజ్ ఖాద్రీ స్వాగతించారు.

అనంతరం జరిగిన పాలకమండలి సమావేశంలో బోర్డు సభ్యులు మల్లిక్ మోహితేశం చైర్మెన్ పదవికి సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ పేరును ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అజ్మతుల్లా హుస్సేనీకి బోర్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. పాలక మండలి సమావేశంలో సభ్యులు ఆయేషా ముసరత్, మౌలానా బందగీ బాద్‌షా రియాజ్ ఖాద్రీ, అక్బర్ నిజామోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్స్ మైనింగ్‌పై పిటిషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సూర్యాపేట జిల్లాలోని అటవీ ప్రాంతంలో సాగర్ సిమెంట్స్ మైనింగ్ కోసం శుక్రవారం జరిపిన ప్రజాభిప్రాయ సేకరణపై తుది నిర్ణయం తీసుకోరాదని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. కోర్టు అనుమతి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని కోరింది. ప్రజాభిప్రాయ సేకరణ చేయవచ్చునని ప్రధాన న్యాయమూర్తి ఆలోక్ అరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. వి.పద్మ, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. సూర్యాపేట జిల్లా మఠంపల్లి, పెద్దవీడు గ్రామాల్లోని 33 గిరిజన తండాల్లో మైనింగ్ చేసేందుకు ప్రజాభిప్రాయ సేకరణ నోటీఫికేషన్‌ను రద్దు చేయాలని పిటిషనర్ల వాదన. అటవీ, గనుల శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇస్తే స్పందించలేదన్నారు. వాదనల తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులిచ్చింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా అటవీ అధికారితోపాటు సాగర్ సిమెంట్స్‌లకు కూడా నోటీసులు జారీ చేసింది.

ఎలక్షన్ పిటిషన్ కొట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హుస్నాబాద్ నుంచి 2018లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా సతీష్ కుమార్ ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర నేత చాడ వెంకట్‌రెడ్డి దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు కొట్టేసింది. ఉమ్మడి కుటుంబ ఆదాయ వివరాలను ఎన్నికల నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదని చాడ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేసి తీర్పు చెప్పారు. ఎన్నికలప్పుడు సతీష్ కుమార్ మూడు సెట్లను దాఖలు చేశారనీ, ఒక సెట్ అఫిడవిట్‌లో వివరాలు చెప్పకపోవడం వాస్తవమేనని ఆయన అంగీకరించారు. అయితే, 3వ సెట్‌లో అన్ని వివరాలు ఉన్నాయని చెప్పారు. ఈ వివరాలతో సంతృప్తి చెందిన హైకోర్టు, సతీష్ కుమార్ ఎన్నిక చెల్లదన్న పిటిషన్ను కొట్టేసింది.

బీసీల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన కాంగ్రెస్

- చనగాని దయాకర్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టేందుకు వీలుగా అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం ఆ వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ తెలిపారు. తీర్మానాన్ని సభ ఆమోదించడం పట్ల శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో సంబరాలను నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రకటించిన బీసీ మ్యానిఫెస్టోకి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి తీర్మానం చేసిందని చెప్పారు. దీంతో రానున్న రోజుల్లో విద్యా వైద్యం, ఉపాధి, రాజకీయ రంగాల్లో బీసీలకు అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం అవకాశం కల్పిస్తామని చెప్పడం చారిత్రాత్మకమని చనగాని తెలిపారు. తాను ఓబీసీ అని చెప్పుకునే ప్రధాని మోడీ బీసీ కుల గణనపై స్పందించకుండా ద్రోహిగా మిగిలారని విమర్శించారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ బీసీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.



గ్రామీణ బంద్, సమ్మె దృశ్యమాలిక

పేదలపై ప్రభుత్వ దౌర్జన్యం నశించాలి

కూల్చిన గుడిసెలకు నష్టపరిహారం చెల్లించాలి

- వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు





నవతెలంగాణ - కోరుట్ల

గూడు కోసం ప్రభుత్వ స్థలంలో గుడిసెలు, శాశ్వతనివాసాలు ఏర్పాటుచేసుకున్న పేదల ఇండ్లను అర్ధరాత్రి దౌర్జన్యంగా కూల్చేసిన ప్రభుత్వం.. వారికి నష్టపరిహారం చెల్లించి, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో పోలీసులు, ప్రభుత్వ అధికారులు కూల్చిన గుడిసెలు, ఇండ్ల స్థలాన్ని చెరుపల్లితో పాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు పి.ఆశయ్య జిల్లా నాయకులు పరిశీలించారు. కోరుట్ల పట్టణ శివారులోని సర్వేనెంబర్ 923లోని 53 ఎకరాల ప్రభుత్వ భూమిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఏడాదికిపైగా పోరాడి సుమారు 600మందికిపైగా పేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని పూలే, అంబేద్కర్ నగర్‌లుగా నామకరణం చేసుకున్నారని తెలిపారు. అందులో దాదాపు 80 కుటుంబాలు రూ.లక్ష చొప్పున ఒక్కో కుటుంబం ఖర్చుపెట్టి పక్కా ఇండ్లు నిర్మించుకుని ఆర్నెల్లుగా అక్కడే ఉంటున్నారన్నారు. కానీ ఇది సహించని ప్రభుత్వం.. అన్యాయంగా గురువారం అర్ధరాత్రి వందల మంది పోలీసుల బలగాలతో ప్రభుత్వ అధికారులు జేసీబీలతో ఆ ఇండ్లను కూల్చివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు పక్కా ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాత్రం పేదలు వేసుకున్న గుడిసెలపై దౌర్జన్యకాండ ప్రదర్శిస్తోందన్నారు. కోరుట్లలో కూల్చిన ఇండ్లలో విలువైన వస్తువులు, వంటగ్యాస్ సిలిండర్, సామాగ్రి, కుట్టుమిషన్లు ధ్వంసం అయ్యాయని, అందులో కొన్ని పోలీసులు తమ వాహనాల్లో తరలించుకుని పోయారని తెలిపారు. ఇప్పటికే ఆ పోరాటానికి బాసటగా ఉన్న తమ పార్టీ ముఖ్య నాయకులను అరెస్టు చేసి పేదలను భయభ్రాంతులకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాలతో గత పాలకులకు, ఈ పాలకులకు తేడా ఏముందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంపీ, ఎమ్మెల్యేల స్థాయిలో ప్రజాప్రతినిధులు చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసినా ఏ అధికారీ పట్టించుకున్న దాఖలాలు లేవని, ప్రభుత్వ భూమిలో నిలువనీడ లేని పేదలు గుడిసెలు వేసుకుంటే మాత్రం కబ్జా పేరుతో దమనకాండ ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల్లో నివసించేందుకు గుడిసెలు వేసుకోవచ్చని రాజ్యాంగమే చెబుతుందని, దాన్నీ కాలరాస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) బృందం కలిసి తమ పార్టీ ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారని, వాటికి పక్కా ఇండ్లతోపాటు పట్టాలు ఇవ్వాలని కోరామని వివరించారు. అప్పుడు వారందరి గుడిసెలను ఇందిరమ్మ ఇండ్లుగా మార్చి పట్టాలు ఇస్తామని, తమ పార్టీ నాయకులపై కేసులనూ ఎత్తివేస్తామని చెప్పారని గుర్తు చేశారు. అది మరిచి తమ నాయకులపై మరిన్ని కేసులు బనాయించి పేదలను వేధిస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా నాయకులు చౌదరి, ఎమ్‌డీ సలీం సహా గుడిసెవాసులు ఉన్నారు.

యాదాద్రి పవర్ ప్లాంట్‌ను

త్వరగా పూర్తి చేయండి

సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. నిర్దేశిత గడువు నాటికి 1,600 (2x800) మెగావాట్ల విద్యుదుత్పత్తిని అందుబాటులోకి తేవాలన్నారు. శుక్రవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్టేజ్ -1 లోని రెండు యూనిట్లు, స్టేజీ-2లో నిర్మాణం అవుతున్న మూడు యూనిట్ల పనుల పురోగతిపై ఆరా తీశారు. బొగ్గు రవణాకు సంబంధించి రైల్వే పనులను సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు 75శాతం రైల్వే పనులు పూర్తయ్యాయనీ, మిగత 25 శాతం పనులను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గడచిన మూడేండ్ల పనుల పురోగతిపై జెన్‌కో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణ అనుమతులు వచ్చిన తరువాత చేపట్టబోయే పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ అలీ ఫారుఖీ, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, జెన్‌కో డైరెక్టర్లు సచ్చిదానందం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతికి ఆధార్ తప్పనిసరి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గృహజ్యోతి పథకానికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎమ్ రిజ్వి తెలిపారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ లబ్దిదారుల ఎంపికలో ఆధార్‌కార్డును ప్రామాణికంగా పరిగణిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికీ ఆధార్ లేని వారికోసం తప్పనిసరిగా ఎన్‌రోల్ చేసుకోవాలని చెప్పారు. ఆధార్ చట్టం ప్రకారం ఆర్థిక వ్యవహారాలు, సబ్సిడీలు, లబ్దిదారులు, సేవలకు వర్తించే సెక్షన్ 7 గృహజ్యోతి స్కీంకు వర్తిస్తుందని వివరించారు.

మందుల టెండర్‌కు రూ.3 లక్షల లంచం

ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చునాయక్


ఇంట్లో, ఆస్పత్రి చాంబర్‌లో సోదాలు



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు నాయక్ శుక్రవారం తన నివాసంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఔషధాల టెండర్‌కు అనుమతి ఇచ్చేందుకు కాంట్రాక్టర్ లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఎం.వి శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన కాంట్రాక్టర్ రాపోలు వెంకన్న రెండు సంవత్సరాలుగా సర్జికల్, డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. అయితే నాన్ టెండర్ డ్రగ్స్‌ను కూడా సప్లై చేయాలని గతంలోనే సూపరింటెండెంట్ కాంట్రాక్టర్‌కు ఆర్డర్ ఇచ్చారు. అయితే దానికి గడువు ఇంకా ఐదు నెలలు ఉండగానే ప్రతి దానిలో 10 శాతం వాటా కావాలంటూ సూపరింటెండెంట్ లచ్చు నాయక్ డిమాండ్ చేశారు. అందులో భాగంగానే కాంట్రాక్టర్ 45 రోజుల కిందట లక్ష రూపాయలు, 12 రోజుల కిందట మరొక లక్ష రూపాయలు ఇచ్చాడు. కాగా మూడ్రోజుల కిందట కాంట్రాక్టర్‌తో మాట్లాడిన సూపరింటెండెంట్ మళ్లీ రూ.3 లక్షలు డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే టెండర్ కాల్ ఫర్ చేస్తానని చెప్పడంతో కాంట్రాక్టర్ రాపోలు వెంకన్న ఏసీబీని ఆశ్రయించాడు. 9తేదీనే ఏసీబీకి ఫిర్యాదు అందింది. అప్పటి నుంచి అధికారులు వివరాలు సేకరించారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో కాంట్రాక్టర్ సూపరింటెండెంట్ ఇంటికి వెళ్లి డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డబ్బులను రికవరీ చేశారు. సూపరింటెండెంట్ లచ్చు నాయక్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్లోనూ తనిఖీ చేశారు. టెండర్ ప్రాసెస్, నాన్ టెండర్ ప్రాసెస్ రికార్డులతో పాటు మరికొన్ని రికార్డులను పరిశీలించారు. విచారణ పూర్తయిన అనంతరం కోర్టులో హాజరు పరచనున్నారు. నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా 2021 డిసెంబర్ 30న లచ్చు నాయక్ బాధ్యతలు స్వీకరించారు.

దిక్కుతోచని పరిస్థితుల్లో ఏసీబీని ఆశ్రయించా..



రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి మందులు సరఫరా చేస్తున్నాను. నన్ను జేపీ అపాయింట్‌మెంట్ చేశారు. నిబంధనలకు అనుగుణంగా మందులు సప్లై చేస్తున్నాను. గత నవంబర్ నెలలో ఆడిట్ జరిగింది. దాని బేస్ చేసుకుని సూపరింటెండెంట్ లచ్చు నాయక్ డబ్బులు డిమాండ్ చేశారు. లేదంటే టెండర్ పెడతానని చెప్పారు. ఇప్పటికే రెండు లక్షలు ఇచ్చినా మళ్లీ మూడు లక్షల రూపాయలు డిమాండ్ చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏసీబీని ఆశ్రయించాను.

రాపోలు వెంకన్న (డ్రగ్స్ కాంట్రాక్టర్)

లిక్కర్ స్కాంలో కవిత పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో దర్యాప్తు సంస్థల తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్ పై విచారణను సుప్రీంకోర్టు ఈనెల 28కి వాయిదా వేసింది. ఈ స్కాం కు సంబంధించి ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనపై ఎలాంటి బలవంతపు (అరెస్ట్ లాంటివి) చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ గతేడాది మార్చిలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సతీమణి నళిని చిదంబరం, వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీల పిటిషన్లతో ట్యాగ్ చేసిన విషయం తెలిసిందే. అయితే మరోసారి ఈ పిటిషన్లు శుక్రవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ తో కూడిన ద్విసభ ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. అందరి సమస్య ఒకటేనని, ఈ పిటిషన్లను విచారించాలని కవిత తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. జస్టిస్ త్రివేది స్పందిస్తూ... ఎందుకు అన్ని కలిపి విచారించాలని ప్రశ్నించారు. అన్ని పిటిషన్లు దేనికి అది వేరని, ఒకే అంశానికి సంబంధించినవి ఎలా అవుతాయన్నారు. రిట్ పిటిషన్లలో ఎలాంటి మధ్యంతర ఆదేశాలు లేవని మరోవైపు పిటిషన్లన్నీ ఎందుకు జత చేశారో అర్థం కావడం లేదన్నారు.

ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో

ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా తెలంగాణ పోలీసులు

విజేతలను అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు తమ ప్రతిభ చాటారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచారు. ఐదు బంగారు, ఏడు వెండి పతకాలను పొందారు. శుక్రవారం హైదరాబాద్‌లో విజేతలను, డీజీపీ రవిగుప్తాను, ఉన్నతా ధికారులను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఫొటోగ్రఫీలో (బంగారు, వెండి, రన్నర్స్ ట్రోఫీ), ప్రొఫెసనల్‌ఫొటోగ్రఫిలో(బంగారు, వెండి, విన్నర్స్ ట్రోఫీ) వీడియో గ్రఫీ(వెండి, రన్నర్స్ ట్రోఫి) విభాగాల్లో పతకాలు సాధించారు.

రైతులను బజారుపాలు చేసిన మోడీ

- అధికారంలోకి వచ్చాక కనీస మద్దతు ధర కల్పిస్తాం : కోదండరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని మోడీ సర్కార్ రైతులను బజారుపాలు చేసిందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ నాయకులు కోదండరెడ్డి విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో రైతు కూలీలకు న్యాయం చేసేందుకు సంస్కరణలు తెచ్చిందని తెలిపారు. 2014లో అధికారంలో రావడానికి ముందు మోడీ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సుదీర్ఘ పోరాటం తరువాత మోడీ తప్పు దిద్దుకుంటానని పార్లమెంటులో చెప్పారని గుర్తుచేశారు. అయినప్పటికీ కనీస మద్దతు ధరపై స్పష్టత ఇవ్వకపోగా, ఢిల్లీలో రైతులపై దౌర్జన్యం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా -కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ జెండాలు కనిపించినందునే బాయ్ కాట్ చేసి వచ్చినట్టు చెప్పారు. ధర్నాకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తే రైతులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ జెండాలు పట్టుకుని డ్రామాలు చేసిందని దుయ్యబట్టారు.

పీఓడబ్ల్యూ సంధ్య జీవిత భాగస్వామి..

నవ్య ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామకృష్ణారెడ్డి కన్నుమూత

- పలువురి సంతాపం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య జీవిత భాగస్వామి, కవి, నవ్య ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామకృష్ణారెడ్డి(62) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. కొంత కాలంగా మల్టిపుల్ ఆర్గాన్ డిసార్డర్‌తో బాధపడుతున్న ఆయనకు శుక్రవారం ఉదయం తీవ్రమైన గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని అపోలో హాస్పటల్‌కు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా, ఆయన అంత్యక్రియలు చిట్యాల సమీపంలోని నేరడ గ్రామంలో ఉన్న వారి వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థి దశలో పీడీఎస్‌యూలో చురుకుగా పాల్గొన్న రామకృష్ణారెడ్డి అదే యూనియన్‌లో పనిచేస్తున్న ఉద్యమ సహచరురాలు వి.సంధ్యను ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. వీరిద్దరూ ఈస్ట్ మారేడుపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రింటింగ్ టెక్నాలజీ చేసిన మొదటి బ్యాచ్ విద్యార్థులు. విద్యార్థి దశ నుంచి నేటి వరకు ప్రగతిశీల భావాల పట్ల సానుకూల ధోరణి ప్రదర్శిస్తూ విప్లవోద్యమాలకు సహకరిస్తూ అందరికీ ఆర్కేఆర్‌గా ఆయన సుపరిచితుల య్యారు. రెండేండ్ల క్రితం నవ్య ప్రింటింగ్ ప్రెస్‌లో విప్లవ సాహిత్యాన్ని ముద్రిస్తున్నారనే కారణంతో పోలీసులు ఆయన ప్రెస్ మీద దాడి చేసి సీజ్ చేయడం అప్పట్లో సంచలనంగా మారింది.

ప్రముఖుల సంతాపం



రామకృష్ణారెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే హిమాయత్ నగర్‌లోని ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు తరలి వచ్చి ఆయన భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. నివాళ్లర్పించిన వారిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వై.వెంకటేశ్వర్లు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ అల్లం నారాయణ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, నాయకులు బొజ్జ బిక్షమయ్య, రాములు, బండారు రవికుమార్, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, పి.సూర్యం, వేములపల్లి వెంకట రామయ్య, కె.గోవర్ధన్, కె.రమా, సీపీఐ నాయకులు పశ్య పద్మ, తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నరసయ్య, మహిళా నాయకులు జ్యోతి, పద్మకుమారి, రమా మేల్కోటే, సజయ, విమల, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, జర్నలిస్టు కె.శ్రీనివాస్, మాభూమి సంధ్య, కవులు కళాకారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామిక వాదులు ఉన్నారు.

ఎంపికైన కానిస్టేబుళ్లందరికి శిక్షణ ఇవ్వాలి

- డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీయస్సీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారందరికి శిక్షణ ఇవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు. ఎంపికైన వారి పట్ల ప్రభుత్వ వివక్షను ఖండించారు. ఒకే పోలీస్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్, టీఎస్‌పీయస్సీ కానిస్టేబుళ్ళందరికీ ఏకకాలంలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. కేవలం సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లకు శిక్షణ ఇస్తూ మిగిలిన 5,010 మంది టీఎస్‌పీయస్సీ కానిస్టేబుళ్లకు ఇవ్వకపోవడం సరైనది కాదని హితవు పలికారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శనివారం | ఫిబ్రవరి 17, 2024 | www.navatelangana.com

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు నాయకులు విఠల్ అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా లంగర్ హౌస్ లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎంఎంవి మోటార్ వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలని ఆటో కార్మికులకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని పోలీసుల ఈ చలాన్ వేధింపులు ఆపాలని పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో ఫ్రీ బస్ పేరుతో లక్షలాది ఆటో కార్మికుల కు ఉపాధి దొరకక కుటుంబాన్ని పోషించలేక ఇబ్బం దులకు గురవుతున్నారు. కావున ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ మహేష్, శ్రావణ్ కుమార్, రమణ, రసూల్, నాగేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

'దళిత క్రైస్తవులపై దాడులను ఖండిస్తున్నాం'

- క్రిష్టియన్ డెమోక్రటిక్ మూవ్మెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.ఏ.మెల్కి సెదక్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మెథడిస్ట్ చర్చ్ సంఘ సభ్యులైన దళిత క్రైస్తవుల పై జరిగిన అమానుష దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని క్రిష్టియన్ డెమోక్రటిక్ మూవ్మెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.ఏ.మెల్కి సెదెక్ అన్నారు. ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలం, జన్వాడ గ్రామంలో చర్చీ సభ్యులపై అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కొంత మంది ఆర్ఎస్ఎస్, భజ రంగ్ దళ్‌కు చెందిన కార్యకర్తలు కలిసి ముందస్తు పథకంతో కర్రలతో, ఇనుప రాడ్లతో, రాళ్ళతో విచక్షణా రహితంగా దాడులు చేయడం దారుణమన్నారు.క్రైస్తవులకు రక్షణ కల్పించే విషయంలో త్వరలో రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డితో పాటు డీజీపీలను కలిసి వివరిస్తామన్నారు.ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ రెవ.రేనాల్డ్ వెస్లీ, ఆర్గనైజర్ ఆల్బర్ట్ ఖురేషీ, జాన్ మాథ్యూస్, ప్రేమ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

10 నెలల పెండింగ్ ఉపకార వేతనాలు చెల్లించాలి

టీవీవీపీ పీజీ వైద్యులు డిమాండ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గత పది నెలలుగా ఉపకార వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని టీవీపీ పీజీ వైద్య విద్యార్థులు టీవీవీపీ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం కోఠి డిఎం ఈ ఆవరణలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను వారు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2020లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పక్షాన డిప్లొమాటిక్ నేషనల్ బోర్డు ఆధ్వర్యంలో 46 మందినీ సంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్ జిలాలకు పీజీ వైద్య విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. 2023 వరకు ఉపకార వేతనాలు అందించినప్పటికీ, గత ఏడాది ఏప్రిల్ నుంచి సుమారు 10 నెలలుగా ఉపకార వేతనాలు అందజేయడం లేదని వారు ఆరోపించారు. ఈ విషయమై తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌ను, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నత అధికారులను పలుమార్లు విన్నవించిన తమ సమస్యను పట్టించుకున్న నాథుడే కరువయ్యారన్నారు. గత నెల క్రితం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా పది రోజులలో మీ సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారన్నారు. మంత్రి హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ తమ సమస్య పరిష్కారం కాకపోవడంతో పాటు ఉపకార వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి కైనా ప్రభుత్వం డిఎన్‌బీ లో ఉన్న 46 మంది పీజీ వైద్య విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయాలని టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్‌ను కోరారు.

సమ్మె సక్సెస్..

- కదం తొక్కిన ప్రజా, కార్మిక లోకం..
- బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానం తగదు
- సీఐటీయు సీనియర్ రాష్ట్ర నాయకులు ఎండి అబ్బాస్
- సంతోష్ నగర్ చౌరస్తా నుండి ఓవైసీ హాస్పిటల్ చౌరస్తా వరకు ర్యాలీ
- సౌత్ జిల్లాలో చోట్ల నిరసన ర్యాలీలు
- పోలీసుల అడ్డంకులు, తొక్కిసలాట
- హక్కుల పోరు కై సమ్మె విజయవంతం



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక విధానాల వ్యతిరేకిస్తూ చెప్పట్టిన ప్రజా, కార్మికులతో సక్సెస్ చేశారు. పోలీసులు ర్యాలీలు అడ్డుకున్నా, యూనియన్ కార్యాలయం చుట్టేసి, కార్మికుల రాకుండా, అడ్డుకునే ప్రయత్నాలు చేసినా వివిధ రంగాల కార్మికులు మేము సైతం అంటూ కదం తొక్కిన కార్మిక లోకం. సౌత్ జిల్లా లోని చార్మినార్ మిరా లం మండి, డీఆర్డీఎల్, లంగర్ హౌస్ బాపు ఘాట్ వద్ద ఆయా ప్రాంతాల జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులు, ఆశా వర్కర్లు, క్రీడా కార్మిక ఉద్యోగులు, అంగన్ వాడిలు, హమాలిలు, ఆటో కార్మికులు, కేంద్ర ప్రభుత్వ రంగాలలో పని చేస్తున్న వివిధ రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ కార్మిక లోక సత్తా నిరసనతో చాటారు. ఎర్ర జెండా చేత పట్టి బీజేపీ అవలంబిస్తున్న కుట్రలను వ్యతిరేక నినాదాలు చేస్తూ కొనసాగిన ర్యాలీలో పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. కార్మికులతో భారీ ర్యాలీ ప్రదర్శన అనంతరం ఓవైసీ హాస్పిటల్ వద్ద సభలో సీఐటీయు సీని యర్ రాష్ట్ర నాయకులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ అధికారంలోకి వచ్చిన ప్పటి నుండి ప్రజా కార్మిక వ్యతిరేక విధానాల అవలంబిస్తూ ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అచ్చే దీన్ హాయేగా.. విశ్వ గురువు ఆత్మ నిర్భయభారత్ మేకింగ్ ఇండియా వంటి మోస పూరిత నినాదాలు ఇచ్చి భారతదేశ ప్రజలను నిండుగా మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనియెడల గద్దె దిగాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సౌత్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర స్కీంలలో పనిచేస్తున్న ఆశ అంగన్వాడి తదితర కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అదే విధంగా స్కీంల బలోపేతానికై తగిన విధంగా బడ్జెట్ కేటాయించాలన్నారు.

ప్రజా సంఘాల మద్దతు..

ప్రజా, కార్మిక సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఐద్వా, గిరిజన సంఘం, క్రీడా సంఘం, కేంద్ర ప్రభుత్వ రంగ కార్మిక సంఘం, అవాజ్ నాయకులు ఈ సందర్భంగా సమ్మె నుద్దేశించి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని అందులో పొందుపరిచిన లౌకిక వాదాన్ని తారుమారు చేస్తూ హిందూ రాజ్యస్థాపన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ తన ఎజెండాను ముందుకు తీసుకెళ్తుంది నిరుద్యోగం, ధరల పెరుగుతుల, పేదరికం, ఆకలి మొదలైన కీలక అంశాలను ప్రజల దృష్టి నుండి మరలచడానికి ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో మతతత్వ శక్తులు ఎప్పుడూ రామాలయ ప్రారంభోత్సవం, అక్షింతలు అనేవి ముందుకు తీసుకువస్తున్నారన్నారు. సమస్యలను దృష్టి మరల్చే ఇలాంటి మతం మత విధానాలను తిప్పికొట్టాలన్నారు. సమస్త కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే బీజేపీ ప్రభుత్వంకు తగిన బుద్ధి చెబుతామన్నారు ఈ కార్యక్రమంలో సీఐటీయు అధ్యక్షులు మీనా, జంగయ్య, కోటయ్య, నాగేశ్వర్, కిషన్, కృష్ణ, రామ్, కుమార్, మహేష్ దుర్గి, శ్రీను, బాబా, బాబరాన్, అబ్దుల్ సత్తార్, బాలు నాయక్, స్వరూప, ఫిర్దోస్, సంగీత, కల్పన, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలి

- సీఐటీయు రాష్ట్ర నాయకులు మల్లేష్



నవతెలంగాణ మెహిదీపట్నం

కార్మికుల, కర్షకుల సమస్యలు పట్టని మోడీ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని సీఐటీయు రాష్ట్ర నాయకులు మల్లేష్ పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మెహిదీపట్నం డివిజన్‌లోని టోలిచౌకి చౌరస్తాలో నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల సీఐటీయు కమిటీల ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల, రైతుల, వ్యవసాయ కూలీల సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు.మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకులు, రైతు కూలీలు సీఐటీయు ఆధ్వర్యంలో సమ్మెకు దిగిరని తెలిపారు. కార్మికులు ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తు మోడీ ప్రభుత్వం కొత్త లేబర్ చట్టాలను తెచ్చిందని ఆయన తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్న ఈ కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా కార్మికులంతా ఐక్యమై మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారన్నారు. దేశంలోని ప్రజలందరూ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాబోయే ఎన్నికలలో ఓటు వేసి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నగర నాయకులు విట్టల్, ఐద్వా సంఘ నగర కార్యదర్శి శశికళ, సిఐటియు నాయకులు నరసింహ, చుక్క నర్సింలు, కళ్యాణ్, యాదమ్మ, మొగులమ్మ, సైదమ్మ, శంకర్, లక్ష్మణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయు కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు





నవతెలంగాణ-ధూల్‌పేట్

కార్మిక, కర్షక సమస్యలపై దేశవ్యాప్తంగా సమ్మె సందర్భంగా ముందస్తుగా పోలీసులు ఐఎస్ సదన్ చౌరస్తా సీఐటీయు హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యాలయాన్ని మోహరించారు. గత నాలుగు నెలలుగా దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ లు సిద్ధమై ప్రధానంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన సమ్మెకు పోలీసులు మోహరించడంతో స్థానికంగా పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే హక్కును కాలరాస్తూ ఈ సమ్మెను భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు అంటూ కొందరు.. ఈ ప్రభుత్వం కార్మికులు శాంతియుతంగా ఎవరి ప్రాంతాల్లో వారు నిరసనలు తెలియజేసి కేంద్ర ప్రభుత్వానికి చెప్పుకుందామంటే ఆ మాత్రం అధికారం లేదు అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ పాలక వర్గాలు అంటూ పలువురు వాపోవడం విశేషం. సీఐటీయు హైదరా బాద్ సౌత్ (ఓల్డ్‌సిటీ) జిల్లా ఆఫీస్ ముందు వచ్చే పోయే జనాన్ని భయ భ్రాంతులకు గురిచేసే పద్ధతుల్లో పోలీసులు మొహరించారు. సీఐటీయు జిల్లా అధ్యక్షులు మీనా ఆఫీసుకు వస్తుంటే ఎవ్వరూ లోపల వెళ్లకూడదని నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మీ డ్యూటీ మీరు చేసు కోండి. ఆఫీసుకు వచ్చేవారిని అడ్డుకోవడం ఏంటని.. ప్రశ్నించారు. యూనియన్ కార్యాలయం చుట్టూ మోహరించారు.

'కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి'



- లేకపోతే దేశవ్యాప్తంగా రవాణా రంగ కార్మికుల ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరిక
- భారతీయ న్యాయ సంహిత-2023లోని హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి
- ట్రాన్స్ పోర్టు బంద్ విజయవంతం తెలంగాణ ట్రాన్స్ పోర్టు వర్కర్స్ జేఏసీ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారతీయ న్యాయ సంహిత-2023లోని హిట్ అండ్ రన్ చట్టంలోని 106(1), (2) నిబంధనలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ట్రాన్స్ పోర్టు వర్కర్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటీయూసీ), కో-కన్వీనర్ వి.మారయ్య (బీఆర్‌టీయు) అజయ్ బాబు (సీఐటీయు), ప్రవీణ్ (ఐఎఫ్‌టీయు), ఎంఏ సలీం (ఆటో జేఏసీ), మీర్జా రఫాత్ బైగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్), క్యాబ్స్ జేఏసీ నేతలు షేక్ సలావుద్దీన్, బి.తిరుమలేష్ గౌడ్, దూపం ఆంజనేయులు, ఏ.నగేష్, సతీష్, కిరణ్, సంతోష్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కరంలో మోడీ ప్రభుత్వం ఉదాసీనత వహిస్తే దేశవ్యాప్తంగా రవాణా రంగ కార్మికుల ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కేంద్రంలోని రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్తంగా 16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ పిలుపులో భాగంగా తెలంగాణ ట్రాన్స్ పోర్టు వర్కర్స్ జేఏసీ తెలంగాణ రాష్ట్రమంతటా రవాణా బంద్ పాటించి శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి వేలాది మంది రవాణా రంగ కార్మికులతో భారీ ర్యాలీని నారాయణగూడ చౌరస్తా వరకు నిర్వహించి ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ నిరుద్యోగం పెరుగుదల, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపు, కొత్త విద్యుత్ చట్టంతో భారం ఇవేవి పట్టించుకోకుండా మోడీ సర్కార్ పేదల జీవనోపాధిపై దెబ్బ తీసేందుకు ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన మోటారు వాహనాల సవరణ-2019 చట్టంతో చిన్నపాటి తప్పిదానికి భారీ జరిమానాలు విధిస్తుండడంతో డ్రైవర్లలో విస్తృతమైన అశాంతి, భయాందోళనలకు గురై తమ వాహనాలు రోడ్డు పైకి తేవడానికి జంకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు రూ.12,000 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రోడ్డు రవాణా కార్మికులకు ప్రత్యేక సామాజిక భద్రత చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ ర్యాలీలో తెలంగాణ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ జేఏసీ నేతలు కొంరెల్లి బాబు, సి.హెచ్.జంగయ్య, ఒమర్ ఖాన్, ఎ.బిక్షపతి యాదవ్, కృష్ణమూర్తి, ఎస్.కె.లతీఫ్, ఎండి.జాకీర్, కృష్ణయ్య, జి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్' ప్రయివేటీకరణను ఆపాలి

- తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ
- టీఎస్ఎస్‌పీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ విద్యుత్ ప్రయివేటీకరణను ఆపేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మింట్ కాంపౌండ్‌లోని టీఎస్ఎస్‌పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ ఎదుట కేంద్ర ప్రభుత్వ విద్యుత్ రంగ ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, సెంటల్ ట్రేడ్ యూనియన్స్ తలపెట్టిన దేశ వ్యాప్త ఆందోళనకు మద్దతుగా నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్, ఇంజినీర్స్ సెంట్రల్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించినట్టు టీఎస్‌పీఈజేఏసీ నాయకులు నాయకులు వేంకటేశ్వర్లు, కన్వీనర్ రత్నాకర్ రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణకు 2019, 2021, 2022 లో బిల్లు ప్రవేశపెట్టాలని ప్రయత్నించినపుడు దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఉద్యోగులు ఏకమై అడ్డుకుని పార్లమెంటులో బిల్లు పెట్టకుండా అడ్డుకున్నట్టు గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 11 రాష్ట్రాల్లో విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లును వ్యతిరేకించినట్టు తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్‌ను ప్రయివేటు పరం చేస్తే ఊరుకునేది లేదనీ, మెరుపు సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. రత్నాకర్ రావు మాట్లాడుతూ దేశంలోని విద్యుత్ ఉద్యోగులను సమీకరించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం వల్ల పార్లమెంటు విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లును స్టాండింగ్ కమిటీకి సిఫారసు చేసినట్టు తెలిపారు. గోవర్ధన్, తులసి నాగరాణి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రయివేటుపరం చేయకుండా ఎవరు అడ్డుకుంటారో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, ఈశ్వరరావు, వెంకట నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, జ్యోతి రాణి, సదానందం, జనప్రియ, సురేష్ కుమార్, గోపాల్ రావు, రాజు, వెంకటేశ్వర్, కిరణ్, కిషోర్, భాస్కర్, సుధీర్, వరప్రసాద్, ప్రశాంత్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్ని రంగాలలో రిజర్వేషన్లు పెంచాలి

- అసెంబ్లీలో కులగణన తీర్మానం పట్ల 14 బీసీ సంఘాలు హర్షం
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట:

కులగణన తీర్మానాన్ని అసెంబ్లీ లో ప్రవేశ పెట్టినందుకు, బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, స్కాలర్షిప్‌లు పెంచాలని, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి బీసీ స్టడీ సర్కిల్ మంజూరు చేయాలని స్కాలర్షిప్‌లు, ఫీజులు బకాయిలు చెల్లించాలని బకాయిలు లేకుండా గ్రీన్ ఛానల్‌లో పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల జాతీయ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, వివిధ బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ హొటల్ లో 14 బీసీ సంఘాలు జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కులగణన లెక్కలు రాగానే బీసీల పంచాయితీ రాజ్ రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42 శాతంకు పెంచాలని జనగణనలో కులగణన చేయడానికి కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి అన్ని రాజకీయ ప్రతిపక్ష పార్టీలు వచ్చే పార్లమెంటు సమావేశంలో ఐకమత్యంతో ఒక్కటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి. అలాగే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ రైల్వే, ఎల్.ఐ.సి, బి.హెచ్.ఈ.ఎల్, బి.డి.ఎల్, బ్యాంకింగ్, రక్షణ సంస్థలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయరాదని అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పార్లమెంటులో ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. పై రెండు ప్రధాన డిమాండ్ల సాధనకై పార్లమెంటులో ఉన్న 34 రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి జులై నెలలో జరిగే పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలని, ప్రభుత్వం దిగిరాకపోతే పార్లమెంటు సమావేశాలు బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, నందా గోపాల్, జి. భరత్, రాజేందర్, అనంతయ్య, పి. సుధాకర్, జి. అంజి, వేముల రామకృష్ణ, కోట్ల శ్రీనివాస్, జోషి రాఘవ, జి. కృష్ణ యాదవ్, నరసింహ గౌడ్, ఉదయ్ నేత, పి. సతీశ్, రాజ్ కుమార్, సిరిశాల మంగతయారు, గిద్ద శ్రీనివాస్ నాయుడు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కోఠి డీహెచ్ కార్యాలయం ముందు వైద్య ఉద్యోగుల మహాధర్నా



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా డైరెక్టర్ హెల్త్ కార్యాలయం ముందు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసీయుద్దీన్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య రంగంలో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ యథావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి, ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 142 జీవో రద్దు చేయాలన్నారు. పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయుసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల పట్ల అనుసరించిన విధానాల వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించే 142 జీవోను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు. సీఐటీయు నాయకులు బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏకపక్షంగా రద్దు చేసిన డిప్రె షన్లను పునసమీక్షించి అర్హులైన ఉద్యోగులకు డిప్రెషన్‌లో కొనసాగించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బలరామ్, కుమారస్వామి, రాబర్ట్ బ్రూస్, వేణుగోపాల్ గౌడ్, గోవిందరెడ్డి, అనిల్ కుమార్, బీసీ శ్రీనివాస్ విజయభాస్కర్, భూషణ్, మహిళా నాయకురా ల్లు, మహేల, రామలక్ష్మి, రామేశ్వరి, కిరణ్మయి, కవిత, రాజే శ్వరి, పద్మరమాదేవి, విజయ, కాంట్రాక్టు వైద్యుల సంఘం నాయకులు అరవింద్, పాల్గొన్నారు.

'జీవో నెం.58 ప్రకారం కొమరంభీం కాలనీ ఆదివాసీలకు ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలి'



- 20న 'చలో హైదరాబాద్' పేరుతో మహాధర్నా
- ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గోడం గణేష్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల మండలం, బట్టిసావర్ గాం శివారులో గల సర్వే నెంబర్.72/23, 72/22 ప్రభుత్వ భూమిలో నివాసముంటున్న కొమరంభీం కాలనీ ఆదివాసీలకు ఇంటి స్థలాలకు జీవో నెంబర్.58 ప్రకారం ఇండ్ల పట్టాలు మంజూరు చేసి పక్క ఇండ్లు నిర్మించుకొనుటకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గోడం గణేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈనెల 20న తలపెట్టిన 'ఛలో హైదరాబాద్' మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోడం గణేష్ మాట్లాడుతూ ఆదివాసీలకు ఇండ్ల పట్టాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఆదివాసీలతో భారీ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. బట్టిసావర్‌గాం గ్రామ సమీపంలోని గుడిసెల్లో నివసిస్తున్న 2043 మంది నిరుపేద ఆదివాసులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల పట్టాలు ఇచ్చి, సౌకర్యాలు కల్పిం చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్. 58 ప్రకారం ఆదివాసీలకు ఇండ్ల పట్టాలను మంజూరు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. 20న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన మహాధర్నాకు అన్ని ప్రజా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పుర్క బాపురావు, ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు సోయం బీంరావు, కుమ్ర రామకాంత్, మేస్రం కేశవ్, సి.రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రభుత్వ సంస్థలు ధ్వంసం

- కేంద్రం అదానీ, అంబానీల ప్రయివేటు కంపెనీల అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టింది
- దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో బహుజన వామపక్ష కార్మిక సంఘాల నాయకులు



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలతో ప్రభుత్వ సంస్థలను ధ్వంసం చేస్తుందని, ప్రభుత్వానికి అత్యంత ప్రీతిపాత్రులైనా ఆదానీ, అంబానీల ప్రైవేట్ కంపెనీల అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టిందని బహుజన వామ పక్ష కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ ను బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎక్స్ రోడ్డు లోని బస్ భవన్ నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహము వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్మిక సంఘాల నాయకులు తుడుం అనిల్ కుమార్ ఏఐసీటీయు రాష్ట్ర అధ్యక్షులు, చంద్రశేఖర్ ప్రసాద్, బీఎల్‌టీ యు, ఎస్.కుమార్ ఏ ఆర్ కె ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షు లు ఏ యాదగిరి, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జి.చంద్ర మౌళి, ఎస్ బీఎస్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.యాదగిరి, టీఏఆర్‌కె ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఇ.చిన్నారావు, టీఎస్ బీ. ఐఎన్‌కేటీయు రాష్ట్ర అధ్యక్షులు కందుల ధనలక్ష్మి, జి. శివాని ఏఐసీటీయు, ఆంజనేయులు తదితర కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొని కేంద్రం ప్రభుత్వ కార్మిక కర్షక రైతు ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేక నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆధిపత్య కార్పొరేట్ కాషాయకరణ ఆర్థిక విధానాలతో ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రీతిపాత్రులైనా ఆదానీ, అంబానీల ప్రైవేట్ కంపెనీల అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎలిసి, బ్యాంకులు, ఓడరేవులు, రైల్వేలు, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, విద్యా, వైద్యం, ఉపాధి కల్పన తదితర ప్రభుత్వ ఆస్తులను తమ మిత్రులైన ప్రైవేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టింది బీజేపీ కేంద్ర ప్రభుత్వమేనన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేసి కడప ఉక్కును నిర్మించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించి స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు డిమాండ్లు పరిష్కరించకపోతే తీవ్ర పరిణామం ఎదుర్కొకతప్పదని హెచ్చరించారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

'నూతన విద్యా విధానం రద్దు చేయాలి'

- భగత్ సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి
- ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై కాల్పులు జరిపి నిర్బంధించడం దుర్మాగం
- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా నిరసన



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశంలో నూతన విద్యా విధానం తీసుకువస్తున్నారని, దాన్ని వెంటనే రద్దు చేయాలని పలు వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.విద్యా రంగాన్ని కార్పోరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం, విద్యా విధానం ద్వారా దేశంలో విదేశీ యూనివర్సిటీలను రద్దు చేయాలని, యూజీసీకి గ్రాంట్స్ పెంచాలని డిమాండ్ చేస్తూ రైతులు, కార్మికులు ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్ మద్దతుగా వామ పక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యు, ఏఐడీఎస్ఓ, ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యు(వి) ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడ నుండి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు టి.నాగరాజు, ఆర్.ఎల్.మూర్తి (ఎస్ఎఫ్ఐ), పుట్టా లక్ష్మణ్ (ఏఐఎస్ఎఫ్), మహేష్ (పీడీఎస్ యు), రామకృష్ణ (పీడీఎస్‌ఎస్‌యు), మల్లేష్ (ఏఐఎస్ డిఓ), హాకీమ్ నవీద్ (ఏఐఎస్ బి), ఎ.విజయ్ (పీడీఎస్‌యు విజృంభణ)లు మాట్లాడారు దేశంలో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించి, నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ యూనివర్శిటీలు, విద్యా సంస్థలను నష్టం చేసే చర్యలు చేస్తుందని ఆరోపించారు. దేశంలో విద్య రంగంలో ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసి రాష్ట్రాల హక్కులు కాలరాస్తుందని, కార్పోరేట్, విదేశీశక్తుల ప్రవేశం ద్వారా మరింత సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం.మమత, దామెర కిరణ్, జిల్లా అధ్యక్షులు లెనిన్, కమిటీ సభ్యులు రమ్య రమేష్, పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్, అనిల్, జిల్లా కార్యదర్శి శ్రీను, ఎఐడిఎస్ఓ హైదరా బాద్ జిల్లా అధ్యక్షులు అరుణ్, కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం.డి.అన్వర్, జిల్లా నాయకులు స్టాలిన్, శ్రీమాన్, నాగేందర్, ప్రశాంత్, సుష్మ, నందిని తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో ర్యాలీ, రాస్తారోకో..



నవతెలంగాణ-శామీర్ పేట

కార్మిక చట్టాలు సవరించి కార్మికులకు భద్రత కల్పించాలని సీఐటీయూ శామీర్ పేట మండల అధ్యక్షుడు కిష్టప్ప కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం శామీర్ పేట మండల సీఐటీయూ అధ్యక్షుడు కిష్టప్ప ఆధ్వర్యంలో మండలంలోని అలియబాద్ చౌరస్తా నుండి శామీర్ పేట మండల పరిషత్తు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి రాజీవ్ రహదారి పై బైఠాయించి రాస్తా రోకో చేశారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్‌టీయూ జిల్లా నాయకులు యాదయ్య సీఐటీయూ నాయకులు ఆంజనేయులు, భాగ్యలక్ష్మి, అరుణ, పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నాయకులు దేవిరెడ్డికి మాతృవియోగం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సీహెచ్ దేవిరెడ్డి తల్లి గురువారం సాయంత్రం కన్నుమూశారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి. నర్సింగ్ రావు, మేడ్చల్-మల్కాజిగిరి కార్యదర్శి పి.సత్యం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రవి, జె.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు, పార్టీ నాయకులు సీహెచ్ ప్రసాద్, జీపీ రావు ఎం.శ్రీనివాసరావు, గణేష్, దేవిరెడ్డి పార్థివ దేహానికి నివాళు లర్పించారు. అంత్యక్రియలు దేవిరెడ్డి స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా తాళ్ల సింగారంలో నేడు మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

బీజేపీ పాలనలో కార్మికుల హక్కులు హరించుకుపోయాయి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్
- దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మేడ్చల్ జిల్లాలో ర్యాలీలు
- జిల్లాలో విజయవంతమైన భారత్ బంద్





నవతెలంగాణ-కాప్రా

బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులు హరించుకు పోయాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఏఎస్‌రావునగర్ నుంచి ఈసీఐఎల్ వరకు దాదాపు 1400 మందితో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ జిల్లా కోశాధికారి ఉన్నికష్ణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు శంకర్రావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్, ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు హేమలత,రేవతి, కళ్యాణి అంగన్వాడి కార్యదర్శి శోభారాణి, ఉపాధ్యక్షురాలు శివరాణి, కె.వి.ఆర్ యూనియన్ కార్యదర్శి నాయక్, సిఎన్ది నాయకుడు రమేష్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 1996 చట్టంలోని పథకాల ద్వారా లభించే ఆర్థిక సహాయాలను తానే ఇస్తున్నట్లుగా మోడీ ప్రభుత్వం తన మార్కు చూపెట్టాలనే దురుద్దేశంతో "మిషన్ మోడ్" అనే పథకాన్ని ప్రవేశపెట్టి కార్మికులకు ప్రస్తుతం చెల్లిస్తున్న ప్రతీ పథకానికి ప్రధాన మంత్రి పేరును జోడించి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే, ఇస్తున్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నదని తెలిపారు. 1996 చట్టాన్ని రద్దుచేసి రాష్ట్రాలకు పూర్తి అధికారాలు ఇచ్చి వెల్ఫేర్ బోర్డుల ద్వారా వసూలైన సెస్సును వారి ఇష్టం వచ్చిన విధంగా బెనిఫిట్స్ ఇచ్చేలా వివిధ రకాల పేర్లు పెట్టుకునేలా అవకాశం కల్పించారని చెప్పారు. దీంతో బోర్డులో ఉన్న నిధులు పక్కదారి పట్టి ఇతర పథకాలకు అక్రమంగా మళ్లించడం లాంటి చర్యలతో నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున నష్టపోయారని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో బిజెపి కార్యకర్తలకు వారి తాబేదారులకు వెల్ఫేర్ బోర్డు నిధులను అక్రమంగా అందిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు విదేశీ కంపెనీలకు అనుకూల నిర్ణయాలతో వారి పరిశ్రమల్లో తయారయ్యే సిమెంటు, ఐరన్, పెయింట్స్,పివిసి,హార్డ్వేర్, సిరామిక్, మార్బుల్, గ్రానైట్ తదితర వారి పరిశ్రమల్లో తయారయ్యే నిర్మాణాల్లో వాడే ముడి సరుకుల ధరలు అదుపు లేకుండా పెరగడం వలన సామాన్యుల ఇంటి నిర్మాణాలు తగ్గిపోయి కార్మికులు పని దినాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలమణి, రేణుక, అంజమ్మ, జయసుధ, రాధ, వాసంతి. ఎస్ఎఫ్ఐ కాప్రా అధ్యక్షుడు శ్యామ్ రావు, ఎస్ఎఫ్ఐ కాప్రా మండల నాయకులు మనీష్, అనిల్, రాకేష్, శివ, నిఖిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె విజయవంతం

మన హక్కుల రక్షణ కోసం చివరి వరకు పోరాటం చేసి వాటిని కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జే చంద్రశేఖర్ అన్నారు. దేశవ్యాప్త సమ్మె చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో విజయవంతమైంది. గురువారం సమ్మెను ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. మూడోసారి మోడీ అధికారం లోకి వస్తే కార్మికులు కట్టు బానిసలుగా పనిచేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రెండు రోజుల నుంచి దేశ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న పోరాటాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. సమ్మెకు పారిశ్రామికవేత్తల సంఘం స్వచ్ఛందంగా బందును ప్రకటించడం అత్యంత అభినందనీయమని తెలియజేశారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బివి సత్యనారాయణ, జి. శ్రీనివాసులు, చర్లపల్లిలోని ఇతర యూనియన్ల ప్రధాన కార్యదర్శిలు జే. వెంకటేశ్వర్లు, టి. నరసింహ బాలరాజు,పి శ్రీనివాసు ఎండి రసూల్, మొయిన్ పాషా,ఆదామ్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



వామపక్షాల ఆధ్వర్యంలో వరంగల్ జాతీయ రహదారిపై దర్నా

నవతెలంగాణ-బోడుప్పల్

కార్మిక చట్టాలకు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కార్మికుల సమ్మె- గ్రామీణ భరత్ బంద్‌లో భాగంగా శుక్రవారం సీపీఐ(ఎం), సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ అధ్వర్యంలో వరంగల్ జాతీయ రహదారిపై సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎస్.సజన,శోభ,కర్రె జంగయ్య, సీఐటీయూ నాయకులు మైసగళ్ల బాల్ నరసింహ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ- మేడ్చల్



కేంద్రంలోని బీజేపీ మతతత్వ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు నిరసనగా 10కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమం మేడ్చల్‌లో విజయవంతమైందని సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ అన్నారు.ఈ శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో నుండి అంబేద్కర్ విగ్రహం వరకు సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో అంగన్వాడీ,ఆశ,మధ్యాహ్నభోజన,గ్రామ పంచాయతీ, మున్సిపల్, ప్రైవేట్ పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు. సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చక కార్మికులు ఎన్నో ఏడ్లు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేశారని విమర్శించారు.అధికారికంగానే 12గంటల పని సమయాన్ని అమలు చేస్తున్నారని అన్నారు.యూనియన్ లు పెట్టుకుని హక్కు లేకుండా చేసి సమ్మెలు చేయకుండా కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలోని కొద్ది మంది బడా వ్యాపారులకు బ్యాంకులలో 15లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేశారని గుర్తు చేశారు.

కుటుంబ కలహాలతో మహిళ అదృశ్యం

నవతెలంగాణ- జవహర్ నగర్



కుటుంబంలో భార్యాభర్తల మధ్య విభేదాలు ఏర్పడి, భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లకౌత్ సురేష్ బుకాయ మౌనికలు 2019 లో ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. వారికి ఒక బాబు సంతానం. కుటుంబంతో కలిసి యాప్రాల్‌లో కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలకు కుటుంబ సమస్యలతో మూడు రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. గురువారం సాయంత్రం సురేష్ ఇంటికి వచ్చేసరికి తన భార్య మౌనిక కనిపించక పోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో భార్య కోసం వెతికినా ఆచూకీ లభించక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కూడా..

ఓ బాలిక ఇంటి నుండి వెళ్లిపోయిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దమ్మాయిగూడకు చెందిన బింగి శ్రీహరి దంపతులు ఇద్దరు కూతుళ్ళతో కలిసి నివాసం ఉంటున్నారు. 17 ఏండ్ల పెద్ద కుమార్తె ఇంటర్మీడియట్ వరకు చదివి ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. శుక్రవారం శ్రీహరి భార్య పని ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి పెద్ద కూతురు ఇంట్లో కనిపించడం లేదు. తన చిన్న కూతురిని అడగగా, అక్క ఏమీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయిందని చెప్పింది. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవ్య ప్రింటర్స్ రామక్రిష్ణారెడ్డి మృతికి విప్లవ జోహార్లు



నవతెలంగాణ- జవహర్ నగర్

కామ్రేడ్ రామకష్ణారెడ్డి మరణం ప్రజా సంఘాలకు, విప్లవ సంఘాలకు తీరని లోటని భారత ప్రగతిశీల మహిళా సంఘం (ఐపీఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత, దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ రషీద్, ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి ఒక ప్రకటనలో అన్నారు. పీఓడబ్ల్యూ సంధ్య జీవిత భాగస్వామి, నవ్య ప్రింటర్స్ యజమాని, మాజీ పీ.డి.ఎస్.యు. నాయకులు కామ్రేడ్ రామక్రిష్ణారెడ్డి మృతికి తీవ్ర సంతాపాన్ని తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, విప్లవ జోహార్లు తెలిపారు. శ్రామిక, పీడితవర్గాల పక్షాన ధ్రుఢంగా నిలిచి పోరాడుతున్న పీఓడబ్ల్యూ సంధ్యకు, వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

పోలీస్ ఫోటోగ్రఫీలో దేవేందర్‌కు ప్రథమ బహుమతి



నవతెలంగాణ - మేడ్చల్

జాతీయ స్థాయి పోలీస్ ఫోటోగ్రఫీ విభాగంలో మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్ ప్రసాద్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి అందుకున్నారు. కాగా దేవేందర్ ప్రసాద్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ డిపార్ట్మెంట్ కు అవసరమైన ఫోటోలు తీస్తుంటాడు. ఉత్తర్ ప్రదేశ్ లోని లక్నోలో ఈనెల 12నుండి 16వరకు 67వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమాన్ని ఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి పాల్గొన్న పోలీసులకు నేర పరిశోధనకు సంబంధించిన పలు విభాగాల్లో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా పరిశోధనకు సహకరించే విధంగా తీసిన ఫోటోలకు తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొన్న దేవేందర్ ప్రసాద్ జాతీయస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచి శుక్రవారం లక్నోలో ప్రశంస పత్రం,బహుమతిని అందుకున్నారు.



ఉప్పల్‌లో సమ్మె విజయవంతం

నవతెలంగాణ-ఉప్పల్

నల్ల చట్టాలను, అమలు చేస్తూ, కార్మికుల, పొట్టకొడుతూ, కార్మికుల, జీవితాలను, రోడ్డున పడేస్తున్న, కేంద్రప్రభుత్వానికి చరమ గీతం పడాలని, సీఐటీయూ నాయకులు జె వెంకన్న అన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉప్పల్ పారిశ్రామికవాడలో మోడల్ బేకరీ నుంచి ర్యాలీ నిర్వహించి కంపెనీలను బంద్ చేశారు. జరిగింది ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, సీఐటీయూ నాయకులు ఎండీ గౌస్, యాదగిరి, వెంకటేష్, పాండు, జంగయ్య, నరసింహ, ఏఐటీయూసీ నాయకులు పరమేష్, బీఆర్‌టీయూ నాయకులు బూరుగు మారుతి రావు తదితరులు పాల్గొన్నారు

పీర్జాదిగూడలో పర్యటించిన డిప్యూటీ సొలిసిటర్ జనరల్



నవతెలంగాణ-బోడుప్పల్

హైకోర్టు ఆదేశాల మేరకు రాష్టంలోని వివిధ చెరువుల సంరక్షణ, అభివృద్ధి పురోగతిని పరిశీలించేందుకు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా గాడి ప్రవీణ్ కుమార్, రెవెన్యూ ప్రభుత్వ ప్లీడర్ టి శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలోని కమిటీ సభ్యుల బృందం, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ త్రిశేశ్వర్ రావు కలిసి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు (మినీ ట్యాంక్ బండ్) ను సందర్శించారు.ఈ సందర్భంగా పీర్జాదిగూడ పెద్ద చెరువును మొదటి హెచ్ఎండీఏ నిధులు సుమారు రూ 13.5 కోట్లతో బండ్ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రెండో దశలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు చెరువు సంరక్షణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసామన్నారు. ప్రజలను వరదముంపు నుంచి రక్షించాలనే ఉద్దేశంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎస్ఎన్డీపీ ద్వారా బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.110 కోట్లతో స్ట్రాం వాటర్ డ్రైన్ నిర్మాణం పనులు చేపట్టామని.. పనులు పూర్తయితే చెరువును పూర్తిగా శుద్ధి చేసి డ్రయినేజి నీటిని చెరువులో కలవకుండా చేయడంతో మూసి వద్ద ఏర్పాటు చేసే ఎస్టీపీ ద్వారా డ్రయినేజి శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. తద్వారా చెరువులో వర్షపు నీరు ఒడిసి పట్టడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే అవకాశం ఉంటుందన్నారు. చెరువుల అభివృద్ధి, సంరక్షణతో పాటు అన్యాకాంతం కాకుండా ఎఫ్టీఎల్ , బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేయడం, అక్రమణలపై తీసుకోవలసిన చర్యలు మొదలైన అంశాలను పరిశీలించి నివేదికలో పొందుపరచడం జరుగుతుందన్నారు.పీర్జాదిగూడ పెద్ద చెరువు బండ్ అభివృద్ధిపై కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎన్డీపీ ఎస్ఈ ఆనంద్, డీఈ పవన్, ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, ఏఈ పరమేష్, పీర్జాదిగూడ కమీషనర్ త్రిశేశ్వర్ రావు,తహసీల్దారు హసీన, నాయకులు అలవాల దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ సమస్యల పట్ల ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో గళమెత్తారు. శాసనసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులను అభివృద్ధి చేయాలని, గుర్రపు డెక్క తొలగించాలని, సహాయనిధి చెక్కులు, ఎస్టీపీలు, రోడ్లు సంబంధించిన అంశాలకు పరిష్కారం చూపాలని మాట్లాడారు. ఉప్పల్‌కు మంజూరైన వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు.

కుల గణనతో అన్ని వర్గాలకు సమ న్యాయం

- కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కుల గణన నిర్ణయం తెలంగాణలో అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తుందని టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ శాసన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధ్వర్యంలో తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైన నిర్ణయమని అన్నారు. కుల గణనతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ రోజు శాసన సభలో బిల్లు పాస్ చేయడంతో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం పెరిగిందని అన్నారు.



మల్లాపూర్ బీరప్ప గడ్డకు చెందిన మల్లాపూర్ కురుమ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు బెల్లం గట్టయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి బెల్లం గట్టయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో పీఆర్ ప్రవీణ్, దయాకర్ రెడ్డి, సిహెచ్ మల్లేష్, రాపోలు శీను తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-కాప్రా

నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

నవతెలంగాణ-సిటీబ్యూరో



నూతన జాతీయ విద్యావిధానం 2020ని రద్దు చేయాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మె - గ్రామీణ భారత్ బంద్ కు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయించాలన్నారు. చరిత్రను వక్రీకరిస్తూ చేస్తున్న ఎన్సీఈఆర్టీ సిలబస్ మార్పులను ఆపాలన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిధులను తగ్గించి నిర్వీర్యం చేసే కుట్రను మానుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్‌ల్లో కోతను విరమించుకోవాలన్నారు. విద్యారంగంలో మతోన్మాద ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేయాలని, విద్యా రంగాన్ని కార్పొరేట్, ప్రయివేటు శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేయడానికి దేశంలో నూతన విద్యా విధానం తీసుకుని వస్తున్నారన్నారు. నూతన విద్యావిధానం 2020 దేశంలో విద్యారంగంలో ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతీసి రాష్ట్రాల హక్కులు కాలరాస్తుందన్నారు. కార్పొరేట్ శక్తుల, విదేశీ శక్తుల ప్రవేశం దీని ద్వారా మరింత సులభతరం అవుతుంది అన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఘట్‌కేసర్

మండలంలోని చౌదరిగూడ గ్రామం సాయిరాం నగర్ కాలనీలో జడ్పీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, వార్డు సభ్యుడు ఆర్. భోజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసులాది నర్సింగ్ ముదిరాజ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పాలడుగు సందీప్ రెడ్డి, దామోదర్ రెడ్డి, దావీద్ రెడ్డి, ధరావత్ వెంకటేష్ నాయక్, సిద్ధగొని నరసింహ, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడిగా సింగిరెడ్డి వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కాంగ్రెస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడిగా కుషాయిగూడ చెందిన సింగిరెడ్డి వెంకట్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సింగిరెడ్డి వెంకటరెడ్డి పేరును ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ. డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి, ప్రజా సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనను అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సింగిరెడ్డి వెంకటరెడ్డిని పార్టీ నాయకులు కార్యకర్తలు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. నాయకులు సీతారాం రెడ్డి, గోపాల్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, లింగం నాయక్, ముస్తాక్, వీరా నాయక్, ఖాదీర్, వెంకటేష్ గౌడ్, హీరలాల్ నాయక్ , వెంకటేష్, రాగిరి శ్రీకాంత్ గౌడ్, క్రాంతి, చరణ్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

'కార్పొరేట్‌కు ఊడిగం చేస్తున్న బీజేపీని సాగనంపుదాం'





నవతెలంగాణ-జవహర్‌నగర్

కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శివ బాబు, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ ఆఫీస్ నుంచి కోళ్ల ఫారం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. సీపీఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, సీపీఐ(ఎం) జవహర్ నగర్ కార్యదర్శి శివన్నారాయణ, కాప్రా మండల సహాయ కార్యదర్శి ఎం రాజేశ్వరి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వరూప, రవి నాయక్, ఎల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన రహదారిలో వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత, ఆదివాసి, క్రిస్టియన్, ముస్లిం ఇతర మైనార్టీ వర్గాల ప్రజలపై జరుగుతున్న సాముహిక లైంగికదాడులు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలు లాంటి విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్న మనువాద బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉన్మాద చర్యలు దేశానికి చాల ప్రమాదకరం అన్నారు. జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు ఎం.డి. పాషామియా, మహమ్మద్ రషీద్, టీ కాలేషా, మబ్బు బాలు, ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ పాల్గొన్నారు.

కాప్రా : ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ స్ట్రైక్ కు మద్దతుగా ఇ.సి.ఐ.ఎల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఇ.సి.ఐ.ఎల్ మెయిన్ గేటు వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇ.సి.ఐ.ఎల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తెస్తున్న కార్మికులకు, ప్రభుత్వ రంగ సంస్థలకు నష్టం చేసే విధానాలను వ్యతిరేకించారు, దేశంలో నిరుద్యోగ సమస్య భారీగా పెరిగిందని తెలిజేస్తు మరియు గతంలో ఇ.సి.ఐ.ఎల్ లో ఏడూ వేలకు పైగా పర్మినెంట్ కార్మికులు పనిచేసేవారని ప్రస్తుతం అది మూడు వందలకు పడిపోవడం నిరుద్యోగ సమస్య లో కొంత భాగంగా పరిగణిస్తూ, ఇప్పటికే మంజూరు కాబడిన 37 వర్క్ మేన్ పోస్ట్ లతో పాటు అధికమొత్తంలో వర్క్ మేన్ పోస్ట్ లు తక్షణమే భర్తీ చేసి ఇ.సి.ఐ.ఎల్ వర్క్ షాప్స్ మరియు అసెంబ్లీ షాప్స్ మెరుగు పరిచి ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోషి, విజయ్, రాజశేఖర్, బాలక్రిష్ణ, గణేష్, అంజనీకుమార్, గండాలు, రమేష్





కూకట్‌పల్లి ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస రావుకు, బీఆర్ఎస్ శ్రేణులు ఏసీపీను కలిసి, సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి

కాంగ్రెస్‌లో చేరిన జగదీశ్వర్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి, కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను, రంగారెడ్డి జిల్లా మాజీ మంత్రి మహేందర్ రెడ్డి ,వికారాబాద్ జిల్లా చైర్మెన్ సునీత రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కలిశారు. ఈ కార్యక్రమంలో మంత్రి.కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారులు.వేం నరేందర్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్
ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



నవతెలంగాణ-హైదరాబాద్

మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సును ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నాలెడ్జ్ ఇంజినీరింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ICKEAI 2024) పేరుతో రెండు రోజుల సదస్సును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ డా. అంజాన్ షేక్ మాట్లాడుతూ 600కు పైగా పేపర్లు వచ్చాయని వాటిలో10 శాతం ప్లగరిసం, క్వాలిటీ ఆఫ్ కంటెంట్ చూసి 156 పేపర్స్‌ను ఎంపిక చేస్తామని వీటిలో 84 యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కాలేజెస్ నుంచి పేపర్స్ వచ్చాయని, 16 పేపర్స్ అవుట్ సైడ్ ఆఫ్ ఇండియా నుంచి వచ్చాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత మాట్లాడుతూ.. అప్లికేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేపర్స్ తీసుకోవడం జరిగిందని తెలిపారు. కళాశాల సెక్రెటరీ టివి రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేపర్ ప్రజెంటేషన్ వీక్షించి, వాటి నుంచి మనం ఎలా పేపర్స్‌ని పబ్లిష్ చేసుకోవాలి అనే మెలుకువలు తెలుసుకోవా లని, మన విద్యార్థులు చదువు మీద ఎక్కువ ఆసక్తి చూపుతారు కానీ రీసెర్చ్ మీద తక్కువగా ఆసక్తి చూపుతారని తెలిపారు. టెక్నాలజీ ఎలా డెవలప్ అయ్యింది అనేదానికి ఒక ఉదాహరణ వివరించారు. ముఖ్య అతిథి డా.వి అనిల్ కుమార్, ప్రొఫెసర్, ఐఐఐటీ, హైదరాబాద్ మాట్లాడుతూ పరిశోధనలు ఇప్పుడు మాత్రమే మొదలైంది వీటిని ఇంకా కొనసాగించాలని సూచించారు. ఈ పరిశోధనల ద్వారానే మనకున్న సమస్యలను మనమే పరిష్కరించుకోవచ్చని సూచించారు. ప్రత్యేక అతిథి సుభందు కుమార్ ఫణి, ప్రిన్సిపాల్, కృపా జల ఇంజినీరింగ్ కాలేజ్, భువనేశ్వర్, మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నడుస్తుందని మనకు వస్తున్న సమస్యల ను వివిధ రకాల మాధ్యమాల ద్వారా పరిష్కరించుకోగలు గుతున్నామని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలా ఉపయోగపడుతుంది అనేదానికి ఒక ప్రాంతీయ భాషల నుంచి జాతీయ, అంతర్జాతీయ భాషల్లోకి అనువదించుకోవచ్చని తెలిపారు. ఇదంతా ఏఐ ద్వారా సాధ్యమవుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా.బి భాస్కర్ రెడ్డి, అకడమిక్ డీన్ లక్ష్మీదేవి, పీఆర్వో రవి సుధాకర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీగా శ్రీనివాసరావు బాధ్యతలు



ఏసీపీకు శుభాకాంక్షలు తెలిపిన దరువు అంజన్న...

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి ఏసీపీగా శ్రీనివాసరావు పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, ఆయనను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఓయూ జేఏసీ చైర్మెన్ దరువు అంజన్న కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దరువు అంజన్న మాట్లాడుతూ.. గత 13 సంవత్సరాల క్రితం శ్రీనివాస రావు ఇక్కడ సీఐ గా పని చేశారని, ఆ సమయంలో పేదల పక్షాన నిలిచి వారికి రక్షణ కల్పించాడని ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించాడని, శ్రీనివాసరావు ప్రజల మనిషని కొనియాడారు. అటువంటి మహోన్నత వ్యక్తి మన ప్రాంతానికి ఏసీపి గా రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు.

కూకట్‌పల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా నూతనంగా భాద్యతలు స్వీకరించిన, ఏసీపీ శ్రీనివాస్ రావును రాష్ట్ర దళిత నాయకులు కర్క పెంటయ్య, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరా బాద్ అధ్యక్షులు కర్క నాగరాజు కలిసి, శాలువాతో సత్కరి ంచి పుష్ప గుచ్ఛాన్ని అందించి, శుభాకాంక్షలు తెలిపారు.



ఏసీపీకు శుభాకాంక్షలు తెలిపిన కర్క నాగరాజు....

పలు ప్రాంతాలలో రైతు, కార్మిక సంఘాల ర్యాలీలు



రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం...
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

దేశవ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం కుత్బుల్లాపూర్‌లో షాపూర్ నగర్, ఐడీపీఎల్, బాచుపల్లి, గండి మైసమ్మలో కార్మికులు పెద్దయెత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ అధ్యక్షుడు అశోక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరుస్తూ పేద, మధ్య తరగతి ప్రజల పై ధరల భారం పెంచుకుంటూ రైతులను, కార్మికులను కొత్త చట్టాల పేర మోసం చేస్తున్నారని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా కార్పోరేట్ శక్తులకు మాత్రం అనేక రాయితీలను కల్పిస్తూ రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఉమా మహేష్, సీఐటీయూ కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్‌లు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం డ్రైవర్లు ప్రమాదం చేస్తే 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 7 లక్షల జరిమాన విధించడం అనేది పిచ్చి ఆలోచనని వెంటనే ఇలాంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు రాము, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాములు,ఆటో యూనియన్ నాయకులుకుమార్, ఎల్లస్వామి, చందర్, పూర్ణచందర్,ప్రభాకర్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు. షాపూర్ నగర్ మార్కెట్ నుంచి ఉషోదయం వరకు ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఐడీపీఎల్ చౌరస్తా వద్ద ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

బాలానగర్: ప్రజా కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించుతామని ఐలాపురం రాజశేఖర్ అన్నారు. దేశ వ్యాప్త సెక్టోరియాల్ భారత్ బంద్ సమ్మె పిలుపులో భాగంగా బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో సీఐటీయు ఆధ్వర్యంలో 600 మందితో భారీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐలాపురం రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా చేయడమే కనీస వేతనాలను నిర్ణయించే విధానానికి స్వస్తి పలికారన్నారు. విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకుని ప్రతి ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఆరు గ్యారంటీలతో కూడిన సేకరణతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలన్నారు. అదేవిధంగా అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం, ఐకెపి, ఫీల్డ్ అసిస్టెంట్స్ కస్తూర్బా, ఎన్ఆర్ హెచ్ఎం లాంటి స్కీం వర్కర్లకు చట్టపరమైన కనీస వేతనాలు రూ. 26 లు చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలిపారు. కార్మిక వర్గంతో పెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికులు సరైన సమయంలో సరైన తీర్పు ఇస్తారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మాజీ రాష్ట్ర నాయకులు వి.వెంకట నరసయ్య, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి చైతన్య రెడ్డి, ట్రాన్స్ పోర్ట్ రంగం మండల కార్యదర్శి పి.శంకర్, ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జి. కార్తీక్, రమణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్....
నవతెలంగాణ-బాలానగర్

దుండిగల్: కేంద్ర బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ , దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా శుక్రవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బాచుపల్లి మున్సిపల్ వార్డు ఆఫీస్ నుంచి బాచుపల్లి చౌరస్తా వరకు మున్సిపల్ కార్మికులు సమ్మె ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక లోకం గర్జించిందని మోడీ నియంతృత్వ మతతత్వ విధానాలను రైతాంగం కార్మిక వ్యవసాయ శ్రామికులంతా దేశవ్యాప్తంగా సమ్మె భారత్ గ్రామీణ బందులో పాల్గొని ప్రతిఘటించారన్నారు. మున్సిపల్ రంగంలో ప్రయివేట్ కార్పొరేట్ శక్తులకు పారిశుధ్య ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఎన్ ఎల్లమ్మ శ్రీను లక్ష్మి యశోద పి స్వామి ప్రవీణ్ యాదగిరి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్
నవతెలంగాణ-దుండిగల్

ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

- 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు అమలు చేయాలనుకునే చర్యలను తిప్పి కొట్టాలి
- ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడాన్ని అడ్డుకోవాలి
- ఆటో డ్రైవర్‌ల సమస్యలు పరిష్కరించాలి
- సీఐటీయూ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణానాయక్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై, కార్మిక కిసాన్ మోర్చా సంయుక్తంగా నిర్వహించిన భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా, కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్ కార్మిక వీధులలో ర్యాలీని నిర్వహించారు. అనంతరం జేఎన్టీయూ, కూకట్‌పల్లి ఆటో స్టాండ్ వద్ద టీసీ డబ్ల్యూ అడ్డాల వద్ద ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టిన సీఐటీయూ నాయకులు, కార్మికులు, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినప్పటికి రైతాంగ కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదనీ తెలిపారు. అచ్చే దిన్ ఆయేగా అంటూ నినదించిన మోడీ, అచ్చేదిన్ రాలేదు గాని, సచ్చే దినం వచ్చిందని కార్మిక సంఘాలు ఎద్దేవా చేశారు. సింగరేణి గనులలో నాలుగు బొగ్గు గనులను వేలం వేయడానికి ప్రయత్నాలు చేస్తుందని, దానిని కార్మికులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పనులను పట్టణాల్లో అమలు చేయాలని, ప్రతి వ్యక్తికి రెండువందల రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగాన్ని లౌకిక విధానాన్ని తారుమారు చేస్తూ, హిందూ రాజ్యస్థాపన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ తన ఎజెండాను ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.శంకర్, సీఐటీయూ మండల నాయకులు రాములు, నరసింహ, లాజరు, ఆటో యూనియన్ నాయకులు అర్జున్ భీమ్ రాజ్, హిస్టరీ యాకయ్య తదితరులు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కేపీహెచ్‌బీ : కేంద్ర ప్రభుత్వం రైతుల, కార్మికుల, ఉద్యోగుల, ప్రజల వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని కూకట్‌పల్లి ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శి ఎల్.డి.ప్రసాద్, కె.శంకర్ రావులు అన్నారు. దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం హెచ్ఎంటీ హిల్స్ రామాలయం చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు చెన్న కేశవులు, లక్ష్మీనరసయ్య, ఎల్.ఆర్.లక్ష్మీరెడ్డి, పి.సత్తయ్య, శివప్రసాద్, వెంకట నరసయ్య, సత్యనారాయణ, పెన్షనర్లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలన్నారు. అన్ని రకాల ఆహార వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించాలన్నారు. నాలుగు లెబర్ కోడ్స్ ఎన్‌పీఎస్ చట్టం, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం ప్రయివేటు పరం చేయడం ఆపాలన్నారు. కనీస పెన్షన్ రూ.10 వేలకు పెంచాలన్నారు. ఈ ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపి జయప్రదం చేసిన వారికి కూకట్ పల్లి ఏరియా కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

దుండిగల్: కేంద్ర బీజేపీ కార్పొరేట్ మతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మలో వివిధ రంగాలలో ఉండే కార్మికులను సమీకరించి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభిస్తూ సీపీఐ(ఎం) పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయింది అయినా రైతాంగ కార్మిక వర్గ ప్రజా సమస్యలను పరిష్కరించలేదు. భారత్ వెలిగిపోతుంది ఆత్మ నిర్భర భారత్ మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు ఇచ్చిన ఏమి ఒరగలేదని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చారు. ప్రతి పేదవాడి అకౌంట్లో రూ. 15 లక్షల ఇస్తామని నల్లధనాన్ని తీసుకొస్తామని చెప్పారు. కానీ గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఆరోగ్య భీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. తక్షణమే రైతు సమస్యలు పరిష్కారం చేయాలని రైతులకు దేశంలోని ప్రజానీకం అంత అండగా ఉండాలని కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఈ సమ్మె ర్యాలీలో సీఐటీయూ దుండిగల్ గండిమైసమ్మ మండల కన్వీనర్ బొడిగే లింగస్వామి సత్యం, వీరమల్లు, నరసింహ, ఎల్లయ్య సూరి, పెంటేశ్, జగన్, రాధా, మున్సిపల్ కార్మికులు, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీ కార్మికులు వివిధ పరిశ్రమంలో పనిచేసే కార్మికులు ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం....
నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్: దేశవ్యాప్త సమ్మె సందర్భంగా ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో బాచుపల్లి మెయిన్ రోడ్ బొల్లారం చౌరస్తాలో నిరసన ర్యాలీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, కె. యేసు రత్నం, వి.కోటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, వై.రాంబాబు మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ కార్పొరేట్ మద్దతు విధానాలను ప్రతిఘటించే పద్ధతుల్లో శుక్రవారం దేశవ్యాప్తంగా సమ్మె గ్రామీణ బంద్‌లో కార్మికులు రైతాంగం వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అధికారానికి వచ్చి పది సంవత్సరాలు పూర్తయిందని అయినా రైతాంగ కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించట్లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, పి.ఎంఎస్ రెడ్డి, పి.స్వామి, నారాయణ, ఆశి.యాదయ్య, మోహన్ రెడ్డి రైతు సంఘం నాయకులు బ్రహ్మానందం, కార్యకర్తలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎంటీ హిల్స్ రామాలయం చౌరస్తాలో ధర్నా చేస్తున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు...
నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



బాచుపల్లిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె రాస్తారోకో...
నవతెలంగాణ-దుండిగల్

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత రవాణా వల్ల లక్షలాది ఆటో డ్రైవర్ల జీవనోపాధి కోల్పోవడం బాధాకరం అని పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు. ఉచిత ప్రయాణాన్ని ఔటర్ రింగ్ రోడ్డు లోపల, వివిధ మున్సిపల్ కార్పొరేషన్‌లలో వరంగల్, నిజామాబాద్ లాంటి కార్పొరేషన్‌లలో నివారించి, గ్రామీణ రైతులకు ఉచిత రవాణా ఇస్తూ విద్యార్థులకు లేదా కాలేజీ వారికి ప్రభుత్వ పాఠశాలలో చదివే వారికి మాత్రమే ఉచిత రవాణా కల్పిస్తే ఆటో డ్రైవర్లకు జీవనోపాధి లభిస్తుందని అన్నారు. ఒకసారి రాష్ట్ర ప్రభుత్వాధికారులు, ముఖ్యమంత్రి ఆలోచన చేసి, రవాణా శాఖను నష్టాలలో పడకుండా ఆటో యాజమానులు బతికే విధంగా పునరాలోచన చేయవలసిన అవసరం ఉందన్నారు. పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ ఆటో యూనియన్ అసోసియేషన్ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ మరుగుదొడ్ల స్థలాలను కాపాడాలి

- సీపీఐ, కాంగ్రెస్, స్థానికుల డిమాండ్
- టౌన్ ప్లానింగ్ అధికారుల పరిశీలన



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తినగర్ బస్తీ ప్రాంగణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ మరుగుదొడ్ల స్థలాలను కాపాడాలని స్థానిక బస్తీ ప్రజలు, సీపీఐ, కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. గత నెలలో సీపీఐ, కాంగ్రెస్, ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేసి, కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహులు ఫిర్యాదు చేశారు. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులకు సదరు ఆక్రమణ కు గురైన స్థలాన్ని పరిశీలించాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం సంబంధిత టౌన్ ప్లానింగ్ సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమిత స్థానంలో చిరు వ్యాపారాలు చేసుకుం టున్న వారి కోరిక మేరకు గడువు ఇచ్చి ఐదు రోజుల్లో చర్యలు తీసుకుంటామని వ్యక్తిగత హామీ పత్రం వ్రాతపూర్వకంగా బస్తీ వాసులకు, సీపీఐ, కాంగ్రెస్ నేతలకు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా స్థలాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య, సీపీఐ నియోజకవర్గ నాయకులు వంగాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఉస్మాన్, ఆరిఫ్ నయీమ్, టీజేపీ నాయకులు శివరాజు, స్థానికులు మర్కంటి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలి



- కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మహిళలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని 3వ ఫేస్‌లోని మహిళా మండలి భవనంలో ఖార్డ్ సంస్థ వారు నిర్వహిస్తున్న మహిళల స్వయం సమృద్ధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ పాల్గొని, కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో, ఖార్డు స్వచ్ఛంద సంస్థ వారు నియోజకవర్గం లోని మహిళలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలన్న సంకల్పం తో వారికి తగిన శిక్షణ ఇప్పించి, ఉపాధి మార్గం చూపిస్తున్న ందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమా లను మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. ఖార్డు సంస్థ నిర్వాహకురాలు మంజుల, మహిళలు పాల్గొన్నారు.

తీర్మానం హర్షణీయం



నవతెలంగాణ-ఓయూ

సమగ్ర కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టడం పట్ల గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి సంతోషంతో హర్షం వ్యక్తం చేశారు. గతం లో ప్రతి 10 సంవత్సరా లకు ఒకసారి సెన్సెస్ జరుగుతుంది. 2011 నుంచి ఇప్పటి వరకు ఎపుడు జరగలేదు. కానీ ప్రస్తుత ప్రభు త్వం కులగణన చేపట్టాలని నిర్ణయిం చుకుంది, బడుగు బలహీన వర్గాల ప్రజలు కూడా చట్ట సభల్లో అడుగుపెట్టే అవకాశం లభిస్తుందన్నారు.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాము అన్నారు.

సమగ్ర కుల గణన తీర్మానం ఆమోదించడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన మేయర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమగ్ర కుల గణన తీర్మానంను అసెంబ్లీలో అమోదించిన పట్ల మే యర్ గద్వాల్ విజయ లక్ష్మి సం తోషం వ్యక్తం చేశారు. సమగ్ర కుల గణన తీర్మానానికి సహకరి ంచిన బీ.పీ శాఖ పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలిపారు. దీని వలన దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న సామాజిక రాజకీయ న్యాయం, బడుగు వర్గాలకు చేకూరుతుందని మేయర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

అఖిల భారత సమ్మెకు మద్దతుగా నిరసన



నవతెలంగాణ-ఓయూ

ఎక్కడైనా పనిచేసిన కార్మికులకు కనీ స వేతనాలు ఈఎస్ఐ, పీఎఫ్ కనీస సౌక ర్యాలు కల్పించాలని, చదువుకున్న యువతీ యువకులకు, ఉద్యోగ అవకాశా లు కల్పి ంచాలని అన్ని రాజకీయ పార్టీల కార్మిక సంఘాల నాయ కులు డిమాండ్ చేస్తూ పో రాడుతున్నారని ఇంటిపనివారల సంఘం నేతలు తెలిపారు. అఖిల భారత సమ్మెకు మద్ద తు తెలుపుతూ శుక్రవారం నిర సన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య వైద్యం ఉచితంగా అందించాలని, చెబుతూ రంగాలను ప్రయివే టుపరం చేయొద్దని, రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలని, ఎరువులు విత్త నాలు ఉచితంగా అందించాలని అధిక ధరలు తగ్గించాలని, డిమాండ్లతో జరుగు తున్న సమ్మెను జయప్రదం చేయాలని ఇంటి పని వరల సంఘంగా కోరారు. నిరసన కార్యక్రమంలో నాయకులు లలితమ్మ వసంత లక్ష్మి రమ, ఫాతిమా, వరలక్ష్మి సిఐయుటి నగర నాయ కులు యం.అజయ్ బాబు, చేతివృత్తుల సికింద్రాబాద్ జోన్ నాయకుడు, గోపాల్ పాల్గొన్నారు.

భాషా పండితుల గీతం ఆవిష్కరణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

విద్యార్థుల మానసిక ఎదుగు దలకు దోహ దపడే మాతృ భాష విశిష్టత,ఆ భాషను బోధించే పం డితుల కష్టాలను తెలియజేస్తూ రూపొందిం చిన పాటను నిర్మాత వివేక్ భవానీ, టీపీసీసీ అధి కార ప్రతినిధి గల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డిలతో కలిసి శుక్రవారం శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ భాషా పండితులు రాంబాబు రచించిన కమ్మనైన అమ్మ ప్రేమతో నేర్పిన పలుకుల కథ వినరా ఆ పలుకుల్ని పాటం గా మార్చి చెప్పి గురువుల కాదా వినరా అంటూ సాగిన పాటను అద్భుతమని వారు తెలిపారు. సాంకేతికంగా ఎంతో ఉన్నత సాధించిన మాతృభాష విశిష్టత ఎంతో ఉన్నతమైన దన్నారు. తల్లి గర్భం నుంచి నేర్చుకున్న కమ్మని భాషలో బోధనతో విద్యార్థులు మానసికంగా ఎంతో శక్తివ ంతంగా తయారవుతారన్నారు.అంతటి విశిష్టత కలిగిన భాషను బోధించే పండితుల పరిస్థితి అధ్వానంగా ఉండడం బాధాకరమన్నారు. మాతృభాష గొప్ప తనం ఇటు పండితుల సమస్యలను వివరిస్తూ రూపొందించిన పాట అద్భుతమని కొనియాడారు. భాషా పండితులు ఎదుర్కొన్న సమ స్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హర్షవర్ధన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పని వారల సంఘ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ-కంటోన్మెంట్

అడ్డగుట్ట ఇంటి పని వారల సం ఘం అఖిల భారత సమ్మెకు మద్దతు తెలిపారు. దీనిలో భాగం గా శుక్రవారం మారేడ పల్లి మం డల కార్యాలయం వద్ద నిరసన నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ పని చేసిన కార్మికులకు కనీస వేతనాలు ఈ ఎస్ఐ, పిఎఫ్. కనీస సౌకర్యాలు కల్పిం చాలని చదువుకున్న యువతీ యువకులకు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశా రు. విద్య వైద్యం ఉచితంగా అందించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎరువులు విత్తనాలు ఉచితంగా అందించాలని ధరలు తగ్గించాలని, డిమాండ్లతో ఇంటి పని వరల సం ఘంగా నిరసన ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు లలితమ్మ వసంత లక్ష్మి రమ, ఫాతి మా, వర లక్ష్మి. సీఐటీయూ నగర నాయకులు అజయ్ బాబు, చేతివృత్తుల సికింద్రాబాద్ జోన్ నాయ కుడు గోపాల్ బంధులాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.పి.చంద్ర శేఖర్‌కు పలువురు శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూ నికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ), విభాగం ప్రొఫెసర్ పైడి మర్రి చంద్రశేఖర్ ఓయూ ఇంజ నీరింగ్ కళాశాల ప్రిన్సి పాల్‌గా నియ మితులయ్యారు. ఈ మేరకు ఓయూ వీసీ ప్రొ.రవీందర్ నుండి నియామక పత్రాన్ని శుక్రవారం అందుకున్నారు. అయిన ప్ర స్తుతం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారని, గతంలో ప్రతిష్టాత్మక అవార్డ్‌కు ఎంపి కయ్యారని, ఇనిస్ట్యూట్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఐఈ టీఈ-న్యూఢిల్లీ), వారు ప్రదానం చేసే ప్రొ.కె.శ్రీని వాసన్ మెమోరియల్ అవార్డ్ 20 23 అందుకు న్నారు. అయిన మూడు ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పూర్తి చేసి మరొక ప్రాజెక్టును చేస్తున్నా రు.15 మంది విద్యార్థులకు పీహెచ్డీలు పూర్తి చేశారు. ప్రొ.చంద్రశేఖర్‌కు పలువురు అధ్యాపకులు, ఉద్యో గులు, విద్యార్థులు ప్రొచంద్రశేఖర్‌కు శు భాకాంక్షలు తెలియజేశారు. పలువురు విద్యార్థులు సత్కరించారు. అందరి సహకారంతో కళశాల అభివృద్ధి కి కృషి చేస్తానని చెప్పారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

- ధర్నాచౌక్‌కు వద్ద నిరసన తెలుపుతున్న జూబ్లీహిల్స్ జోన్ కార్మికులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

భారతబంద్‌లో భాగంగా సంక్షేమ చట్టాలను రక్షించాలని, కార్మి కుల హక్కు లను రక్షించే చట్టాలను రద్దు చేయటాన్ని ఖండిస్తూ, రైతులు అన్ని రంగాల కార్మికులు కలిసి చేస్తున్న భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ, ఇందిరా పార్కులో గల ధర్నాచౌక్‌కు మోతీన గర్, యూసఫ్ గూడా లేబర్ అడ్డా ల భవన నిర్మాణ సంఘాల నాయ కులు భారీగా వాహనాలలో తరలి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రమణ, కృష్ణ, రవి, బాలు, కుమార్ రాజు, ప్రజాసంఘాల నాయకులు టి.సాయి శేషగిరిరావు ,ఇత ర కార్మిక సంఘం నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దీపా దాస్ మున్షినీ మర్యాద పూర్వకంగా కలిసిన గజ్జెల కాంతం



నవతెలంగాణ-బంజారాహిల్స్

పెద్దపల్లి ఎంపీ సీటును సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక, సీఎం.రేవంత్ లకు గిఫ్ట్ ఇవ్వనున్నట్టు తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం చెప్పారు. తెలంగాణలోని మూడు రిజర్వుడ్ పార్ల మెంటు నియోజకవర్గాలలో రెండు సీట్లు మాది గలకు ఇవ్వాలని ఆయన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షికి విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో 68శాతం మాదిగలు ఉన్నట్టు కాంతం వివరించారు.దీపాదాస్ సానుకూలంగా స్పందించినట్టు గజ్జెలకాంతం తెలిపారు. తనకు పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సారి తనకు పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ కేటాయిస్తే ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలుపొందగలనని గజ్జెల ధీమా వ్యక్తం చేసారు.దీపాదాస్ మున్షీకి కాంతం తన వినతి పత్రం అందజేశారు.

18 న ధర్నాచౌక్‌లో మహాధర్నా



నవతెలంగాణ-బంజారా హిల్స్

దళిత, గిరిజన, బహుజ, మైనార్టీ, ప్రజా సంఘాలు, డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ (న్యూఢిల్లీ) అద్వర్యంలో 18న ఇంది రాపార్కు వద్ద ఉన్న ధర్నాచౌక్ లో ఉద యం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మహాధర్నాకూ ఫెడరే ంషన్ జాతీయ సెక్రటరీ జనరల్ ఎం. నర్సింగ్‌రావు పిలుపు నిచ్చారు.శుక్రవారం సోమాజి గూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి. శంక ర్,రాష్ట్ర అధ్యక్షులు టి. రాజ లింగం, ప్రధాన కార్యదర్శి వి.జగన్నాధంతో కలిసి బ్రోచర్ ఆవిష్కరించి మాట్లా డారు. డాక్టర్ బీఆర్ అం బేద్కర్ రచించిన రాజ్యా ంగా న్ని నిర్వీర్యం చేసే ప్రయ త్నాలు జరుగుతున్నా య న్నారు. ఎన్నికల్లో ఈవీఎంలపై నమ్మకం లేదని, వాటి స్థానంలో బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహిం చాలన్నారు. బీసీ, ఓబీసీ, మైనార్టీ లకు చట్ట సభల్లో ప్రాధాన్యతన కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల పాలసీని రాజ్యాం గంలోని తొమ్మిదవ షెడ్యూల్ పరిధిలోకి తీసుకు రావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఆయా డిమాండ్లపై నిర్వహించే మహా ధర్నాకు అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎండి సనాఉల్లా ఖాన్, డీటీఎఫ్ నాయకురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

19న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి రద్దు

- కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 19న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యా లయంలో జరుగనున్న ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల19వ తేదీన ఉదయం 10 గంటలకు జీహెచ్ఎంసీ ప్రధాన కా ర్యాలయంలో జనరల్ బాడీ సమావేశం ఉన్న నేపథ్యంలో అ రోజు ప్రజావాణి, ఫోన్ ఇన్ ప్రోగ్రాం ఉండదని కమిషనర్ తెలిపారు. హెడ్ ఆఫీస్ మాత్రమే రద్దు అయినందున సర్కిల్, కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడుతుందని కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు.

18 న ఆస్ట్రేలియా అడ్మిషన్ డే

- యూని ఎక్స్‌పర్ట్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆస్ట్రేలియా దేశంలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థిని విద్యార్థుల కోసం యూని ఎక్స్‌పర్ట్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18న సోమా జి గూడ లోని సంస్థ కార్యా లయం లో ఆస్ట్రేలియా అడ్మిషన్ డేను నిర్వ హిస్తున్నట్లు సంస్థ ఆపరేషన్ హెడ్ ఉమా తెలిపారు. గురువారం సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె బ్రోచర్‌ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆస్ట్రేలియా చదు వుకోవాలనుకునే విద్యార్థు లకు ఇది ఒక సువర్ణ అవకాశం అని అన్నారు. ఈ ఎడ్యుకే షన్ ఫెయిర్ లో పాల్గొనే విద్యార్థులు, తల్లి దండ్రులు వీసా రిక్రూట్‌మెంట్స్, అడ్మిషన్ రిక్రూట్‌మెంట్స్, స్కాలర్షిప్ ఆప్షన్స్, లాంగర్ స్టే బ్యాక్ ఆప్షన్స్, ట్రావెల్ అప్డేట్స్ తదితర అంశాలపై నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలి పారు. మరిన్ని వివరాల కోసం 9912328645 నెంబర్ ను సంప్రదించవలసిందిగా కోరారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీ అందజేత

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

మోకాలి శస్త్ర చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బం దులు పడుతున్న పేద మహిళకు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తల సాని శ్రీనివాస్ యాదవ్ అండగా నిలిచారు. రాం గోపాల్ పేట డివిజన్ లోని గైదన్‌బాగ్ కు చెం దిన నఫీజ్ బేగం కొద్ది కా లంగా మోకాలి నొప్పితో బాధపడుతున్నది. వైద్యులను సంప్రదించగా ఆపరేషన్ చేయాలని తెలిపారు. ఆపరేషన్ కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ సహకారంతో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి తమ పరిస్థితిని విన్నవించింది. స్పందించిన శ్రీనివాస్ యాదవ్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 90 వేల రూపాయలు మంజూరయినట్లు తెలిపారు. అనంతరం శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని నివాసంలో బాధితురాలు నఫీజ్ బేగంలు ఎల్‌ఓసీని అందజేశారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో విజయడైరీ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఓయూ

పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ (విజయ డైరీ) లాలపేట్ ఎదుట వేతనాల కోసం, ఈఎస్ఐ , పీఎఫ్ కోసం. నూతన వాహన చట్టాన్ని వెంటనే సవరించాలని కోరుతూ దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా, గురు వారం విజయ డైరీ ఎదుట సీఐటీయూ అధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఎక్కడ పని చేసి నా కార్మి కులందరికీ కనీస వేతనాలు ఈఎస్ఐ, పిఎఫ్ చట్టాలు అమలు చేయాలని చెప్పి కోరుతూ విజయ డైరీ డీసీ ఎం డ్రైవరు, హెల్పర్లు డైరీ ఎదుట నిరసన ధర్నా నిర్వ హించారు. దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్న కార్మికు లంద రికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు, మేము సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ సమ్మె కార్యక్రమాన్ని జయ ప్రదం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ పని చేసినా కార్మి కులందరికీ కనీస వేతనాలు ఇవ్వా లని ఈఎస్ఐ, పిఎఫ్ చట్టాన్ని వెంటనే అమలు పర చాలని ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటుపరం చేయొద్ద న్నారు. వారంత సెలవులు పండుగ సెలవులు కచ్చి తంగా కార్మికుల వర్తింపజేయాలని, అధిక ధరలు తగ్గిం చాలని తగ్గించాలని,హక్కులకు చట్టబద్ధత కల్పిం చాలని. చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని.విద్యావైద్యం పూర్తిగా ఉచి తంగా అందించాలన్నారు. సీఐటీయూ అధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి, నగరనాయకులు ఏం.అజ య్‌బాబు, అధ్యక్ష కార్యదర్శులు. ఏ.బాల రాజు, ఎండి. అమిత్ ఖాన్ నాయకులు కృపాకర్, కే అంజి, సాదిక్ బాబు సెట్.మహేష్ హరి, అభి పాల్గొన్నారు.

ఉద్యమిస్తున్న రైతులకు అండగా నిలబడదాం



ఓయూ-ఎఐఎస్ఎఫ్, ఓయూ-ఏఐటీయూసీ

నవతెలంగాణ-ఓయూ

వ్యవసాయ ఉత్పత్తులకు ఎమ్మెస్.స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కనీస మద్దతు ధర చట్టం చేయాలని పంజాబ్ హర్యానా సరిహద్దుల్లో ఉద్యమం చేస్తున్న రైతుల దేశవ్యాప్త సమ్మె,గ్రామీణ బంద్ పిలు పులో భాగంగా గురువారం ఓయూలో ఏఐఎస్ఎఫ్, పారిశుద్ధ కార్మికులు (ఏఐటియుసి అనుబంధం) సం యుక్తంగా కలిసి రైతులకు,రైతు ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, ఏఐటియుసి ఓయూ నాయకురాలు బాలమ్మ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నను శాంతియుతంగా నిరసన చేయకుండా నిర్బంధాలకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి విఘాత మని అన్నారు. రైతుల ప్రదాన డిమాండ్లయిన వ్యవసా య రంగ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించి దానికి చట్టబద్ధతను కల్పించాలని,ఎమ్ ఎస్ స్వామినా థన్ కమిటీ సిఫార్సుల అన్నింటినీ అమలు చేయాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని.రైతులకు, వ్యవ సాయ కార్మికులకు పింఛన్లు ఇవ్వాలని, అదేవిధంగా మొదటి రైతు ఉద్యమ సమయంలో చనిపోయిన రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, లకింపూర్ ఖేరి ఘటనలో రైతులపై వాహనంతో దాడి చేసి వారి మరణానికి కార ణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో ప్రవేశపెట్టిన అశాస్త్రీయమైన నూతన జాతీ య విద్యా విధానం-2020 రద్దు చేయాలని,కేంద్ర బడ్జె ట్‌లో విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయిం చాలని, సెంట్రల్ యూనివర్సిటీలలో స్వయంప్రతిపత్తిని కాపాడాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన రైతు ఉద్యమంలో కూడా ఓయు ఏఐఎస్ఎఫ్ బృందం పాల్గొ ని రైతు ఉద్యమానికి మద్దతు తెలిపిందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు అశ్వన్ మధు, లక్ష్మమ్మ, యాదమ్మ, సరిత, మణెమ్మ, పాల్గొన్నారు.

కార్మికుల పొట్టగొట్టే కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి

- నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు సంఘం



నవతెలంగాణ-బంజారా హిల్స్

నిమ్స్,కాంట్రాక్ట్ కార్మికులు,దేశవ్యాప్త సమ్మెకూ మద్దతుగా కార్మికులంతా భారీ ర్యాలీ నిర్వహించారు. నిమ్స్ కాంటాక్ట్ కార్మికులు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కార్మిక కర్షక వ్యతిరేక, విధానాల వల్ల,కార్మికులకు నష్టం జరుగుతుందని, నాలుగు లేబర్‌కోడ్లు రద్దు చేయాలని, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఉప అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మి కులకు సమన పనికి సమాన వేతనం కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీని యార్టి ప్రకారంగా ఎన్నో ఏళ్లుగా తత్కాలికా ఉద్యో గులుగా పని చేస్తున్న వారినీ పర్మనెంట్ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలనూ నిమ్స్ డైరెక్టర్ని, యాజమా న్యాన్ని కోరు తూ నినాదాలు చేశారు. ఈ సమ్మెకు మద్ద తుగా ప్రధాన కార్యదర్శి ఈ, నరసింహ, డేవిడ్,మాధవి రాధిక ఎలిజిబెతి లక్ష్మీ భాగ్య, ట్రెజర్, రాజయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో వంటల కళాఖండం ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రముఖ అయిదు (ఏఐడీయూ) రెస్టారెంట్‌ను గురువారం జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 లో ప్రార ంభించి భోజన ప్రియు ల కు అందుబాటు లోనికి తీసుకొచ్చినట్లు నిర్వాహ కులు మేనేజింగ్ డైరెక్టర్ అమన్ చైనాని, డైరెక్టర్ శ్రేయ చైనాని, మేనేజర్ సతీష్‌పోల్కం తెలిపారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వా హకులు మాట్లాడుతూ తెలుగు,కన్నడ భాషలలో "ఐదు"కి అనువదించారని, అం దుకు ఇది అ స్ఫూర్తిని పునర్నిర్వచించింన్నారు.ఇది తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ ఐదు రాష్ట్రాలలో వైవిధ్యమైన రుచులు , వంటకాలను ఒకే చోట చేర్చడాన్ని సూచి స్తుందన్నారు. ఇది ఎపిక్యూరియన్ ఆనందం కోసం అసాధా రణమైన స్వర్గధామాన్ని అందిస్తుందని, ముత్యాల నగరంగా కీర్తించబడుతున్న హైద రాబాద్‌లో, అతిథులను జూబ్లీహిల్స్‌కు స్వాగతిస్తూ, ఒకే పైకప్పు క్రింద ఈ రుచుల అస్వాదన చేయిస్తుందన్నారు. గ్యాస్ట్రోనమిక్ ఎక్సలెన్స్ , ప్రమాణాలను సమున్నతం చేస్తూ, ఈ రెస్టారెంట్ దక్షిణ భారతదేశం యొక్క శక్తివంతమైన రుచులను పరిచ యం చేస్తుందని, ఈ ప్రాంతంలో అధునాతన, రిఫ్రెష్ లగ్జరీ భోజన అనుభవాన్ని అందిస్తుందన్నారు. అయిదు, దక్షిణ భారత వంటకాలను గ్లోబల్ మ్యాప్‌లోకి తీసుకె ళ్లాలని లక్ష్యంగా పెట్టుకుందని, అతిథులకు ఐదు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న విభిన్న కలినరీ సంప్రదాయాల సంపూర్ణ అనుభవాన్ని అందిస్తుం దన్నారు. స్టఫ్డ్ పనియా రం,మీన్ పొల్లిచట్టు,చింతకాయ కోడికబాబ్, కుట్టు పరోటా మొట్టా కూర, మంగ్లో రియన్ ఫిష్ కర్రీ, పనీర్ చెట్టినాడ్, తెంగైపాల్ కోని బిర్యానీ, ఐదు మైసూర్‌పాక్, డబుల్ కా మీఠా ఇలా ప్రతి డిష్ అయిదు శ్రేష్ఠతకు, నిబద్ధతకు నిదర్శనమని, అభి మానులు భోజనం చేయడం మాత్రమే కాదని, వారు భారతదేశంలోని సదరన్ బెల్ట్ ను ప్రతిబింబించే డైనమిక్ రుచులలో ప్రతిష్టాత్మకమైన జ్ఞాపకాలను రూపొందిస్తూ, చురుకుగా నిమగ్నమై అయిదు,దాగి ఉన్న నిధులను వెలికితీసేందుకు భోజనప్రి యు లకు హృదయపూర్వక ఆహ్వానాన్ని అందజేస్తుందన్నారు.

బీజేపీ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, టి.మహేందర్



నవతెలంగాణ-ఓయూ

బీజేపీ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ నుండి ఎన్‌సీసీ గేట్ వరకు ఉస్మానియా యూని వర్సిటీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీ యూ) రాష్ట్ర కార్యదర్శి టి.మహేందర్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం యూనివ ర్సిటీలలో గ్రాండ్స్ విడుదల చేయకుండా యూనివర్సిటీల ను నిర్వీర్యం చేస్తున్నారు అని,పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఉస్మాని యా యూనివర్సిటీ ఉద్యోగులు దాదాపు 30 సంవత్సరాల నుండి అతి తక్కువ వేతనా లతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు, సంవత్సారాలు గడుస్తున్న వీరిని ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించటం లేదని,అవేదన వ్యక్తం చేశారు,వెంటనే అందరిని ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ప్రజా,కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తుందని విమర్శించారు. జాతీయ సహజ వనరులు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతుందని, విధంగా తన విధా నాలను అమలు చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు,ఉపాధ్యక్షులు. అనసూయ, నాగరాజు, లక్ష్మణగౌడ్ ,సహాయ కార్యదర్శులు నరేష్, శివకుమార్,లక్ష్మణ్ , బాలకృష్ణ, మహేందర్, నాగమణి, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న కో-ఆప్షన్ సభ్యురాలు



నవతెలంగాణ-జవహర్ నగర్

ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలినై కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు జవహర్ నగర్ కో-ఆప్షన్ సభ్యురాలు కూతాడి శ్వేతా ముఖేష్ అన్నారు. శుక్రవారం ఏఐసీసీ ఇన్చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమం తరావు ఆధ్వర్యంలో ఆమె కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కో ఆప్షన్ దంపతులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలబడుతుందని, ప్రజా ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జవహర్ నగర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు.

రసవత్తరంగా జవహర్‌నగర్ రాజకీయాలు

- **హస్తం గూటికి మేయర్ మేకల కావ్య వెళ్ళనున్నారా ??**



నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్ నగర్ రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. కార్పొరేషన్ లో 28 మంది కార్పొరేటర్లు ఉండగా 17వ డివిజన్ కార్పొరేటర్ విశ్రాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మేయర్ మేకల కావ్య పై 19 మంది అసమ్మతి కార్పొరేటర్లు అవిశ్వాసం పెట్టారు. అసమ్మతి కార్పొరేటర్లతో డిప్యూటీ మేయర్ వర్గం క్యాంపు రాజకీయాలు నడిపిస్తున్నారు. ఈ నెల 19న బలపరీక్షకు జిల్లా కలెక్టర్ సమయం కేటాయించడంతో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగు తున్నాయి. దీంతో మేయర్ మేకల కావ్య కాంగ్రెస్ గూటికి చేరడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇరువర్గాలు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సంసిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ తరుణంలో మేయర్ పీఠం ఎవరు కైవసం చేసుకుంటారో సోమవారం వరకు వేచి చూడాల్సిందే.

గ్రేటర్‌పై సమ్మె ఎఫెక్ట్..



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశవ్యాప్త రవాణా రంగ కార్మిక సమ్మె, బంద్ ప్రభావం గ్రేటర్ హైదరాబాద్‌పై పడింది. శుక్రవారం సమ్మె నేపథ్యం లో రవాణా రంగం స్తంభించిపోయింది. ఆటోలు, ట్రాలీలు, క్యాబ్‌లు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. డీసీఎంలు, లారీలు, గూడ్స్ క్యారియర్, ఇతర భారీ వాహనాలు ఇండ్లకే పరిమిత మయ్యాయి. భారత న్యాయ సంహిత-2023లో ప్రమాద కరమైన సెక్షన్స్106(1),(2)లను రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ.. అల్ ట్రేడ్ యూనియన్స్, రవాణా కార్మికుల అఖిల భారత సమన్వయ కమిటీల ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో సమ్మెను ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులు విజయవంతం చేశారు. ఈ సమ్మెకు ప్రజలు కూడా స్వచ్ఛందంగా సహకరించారు.

రాకపోకలపై ప్రభావం..

గ్రేటర్ హైదరాబాద్‌లో దేశవ్యాప్త రవాణా రంగ సమ్మెను ట్రాన్స్‌పోర్ట్ రంగ, కార్మిక సంఘాలు విజయవ ంతం చేశాయి. సీఐటీయూ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, టీఎస్‌ఆర్టీసీ, ఆటో, క్యాబ్ డ్రైవర్స్ జేఏసీ, లారీ యూనియన్, తదితర కార్మిక సంఘాలు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేశాయి. గ్రేటర్ పరిధిలో లక్ష 50వేల ఆటోరిక్షాలు, లక్ష క్యాబ్‌లు, ట్యాక్సీలు ఉన్నాయి. ఈ సమ్మెలో క్యాబ్స్, ఆటో, ట్రాలీ, డీసీఎంలు రాష్ట్రవ్యాప్తంగా 70శాతం మేర నిలిచిపోగా.. గ్రేటర్ పరిధిలో 50శాతంపైనే నిలిచాయి. అదేవిధంగా లారీల డ్రైవర్లు కూడా సమ్మెలో పాల్గొన్నాయి. ఫలితంగా నగర వ్యాప్తంగా ప్రజారవాణా వ్యవస్థపై ప్రభావం చూపిం ది. కొత్త చట్టంతో ఆర్టీసీ కార్మికులకు ఇబ్బందిగా మారడంతో వారు సైతం పెద్దఎత్తున సమ్మెలో పాల్గొ న్నారు. కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో ఆర్టీసీ ఆదాయంపై కొంతమేర ప్రభావం చూపగా.. ప్రయాణికుల రాకపోకలు సైతం ఎఫెక్ట్ అయ్యాయి.



- **బంద్‌లో క్యాబ్స్, ఆటోలు, ట్రాలీలు**
- **కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీలు..**

నగరంలో ట్రాన్స్‌పోర్టు సమ్మె విజయవంతం



నగరంలో ట్రాన్స్‌పోర్టు సమ్మె జయప్రదం అయ్యిం ది. ఆటో, క్యాబ్, గూడ్స్ ట్రాన్స్‌పోర్టు రంగాలూ ఎఫెక్ట్ అయ్యాయి. ఇప్పటికైనా కేంద్రం ప్రభుత్వం రవాణా రంగంలోని కార్మికుల వ్యతిరేక తని గమనించి పార్లమెం టులో బడ్జెట్ సమావేశాల్లో హిట్ అండ్ రన్ సెక్షన్స్‌ని రద్దు చేయాలి. రవాణారంగ కార్మికులకు సంక్షేమం బోర్డు ఏర్పాటు చేయా లి. నగరంలో హెవీ వెహికల్స్ నో ఎంట్రీ సమయాన్ని ఉదయం 9గంటల నుంచి 11గంటలకు.. సాయంత్రం 5గంటల నుంచి 8:30 వరకు కుదించాలి. వారిపై రూ. 200 కే చలాన్లు పరిమితం చేయాలని నగర ట్రాఫిక్ పోలీసు, ఆర్టీఏ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం. జేఏసీ లోని బీఆర్‌టీయూ అనుబంధ సంఘం దేశవ్యాప్త రవాణా కార్మిక సంఘాలిచ్చిన ప్రధాన డిమాండ్లను పక్కనపెట్టి.. ఈ సమ్మెని ఫ్రీ బస్సు స్కీమ్‌కి వ్యతిరేకంగా ఆటో కార్మికు ల చేస్తున్న సమ్మెగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడం సమ్మెని పక్కదారి పట్టించడమే. దీనిని ఖండిస్తున్నాం.

\- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ నగర కార్యదర్శి కె.అజయ్ బాబు

ప్రధాన డిమాండ్లు ఇవే..

-హిట్ అండ్ రన్(బీఎన్ఎస్)106(1),(2) సెక్షన్స్ రద్దు చేయాలి

\- రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

-ఎంవీ యాక్ట్-2019 సవరణ చట్టం రాష్ట్రంలో అమలు చేయొద్దు

\- ప్రభుత్వమే ఆన్‌లైన్ యాప్ ఏర్పాటు చేసి తక్కువ కమిషన్‌తో కార్మికులకు ఉపయోగపడే విధంగా తీసుకురావాలి

\- నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు-2022 రద్దు చేయాలి

-మహిళలకు ఉచిత బస్ స్కీం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు గీతా, నేత, బీడీ కార్మికులకు ఇస్తున్నట్టుగా జీవనభృతికి నెలకు రూ.4,500 ఇవ్వాలి

\- ఆటో డ్రైవర్లకు ఏడాదికి ఇస్తామన్న రూ.12వేల హామీ వెంటనే అమలు చేయాలి

\- మూడు నెలల పాటు ఆటోల ఈఎంఐపై మారిటోయం ప్రకటించాలి

\- ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ప్రభుత్వం భరించాలి

\- ప్రమాద బీమా రూ.ఐదు లక్షలు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షలు ఉచిత వైద్యం మొత్తం రవాణా రంగా కార్మికులకు వర్తింపజేయాలి

\- నేషనల్ మోనిటైజేషన్ పైపులైన్ పాలసీ ఉపసంహరించాలి.

సీఎం హెూదాలో అలా మాట్లాడటం దురదృష్టకరం

- **ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



నవతెలంగాణ-సిటీబ్యూరో

ముఖ్యమంత్రి హెూదాలో ఉండి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై నోటికి వచ్చినట్టు మాట్లాడటం దురదృష్టకరమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం అసెంబ్లీ ప్రారంభానికి ముందు మీడియా పాయింట్ వద్ద ఆయ న మాట్లాడారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను వారే ఇచ్చినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్నదని, నోటిఫికేషన్ ఎప్పుడు ఇచ్చారు? భర్తీ ఎప్పుడు జరిగిందో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయిదేండ్లు పనిచేయాలని బీఆర్ఎస్ కోరుకుం టుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోనే మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్‌కు రివర్స్ అయ్యే అవకాశముందని చెప్పారు. కాంగ్రెస్‌లో ఏక్ నాథ్ షిండే అయ్యేదే రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసు ట్రయల్స్ పూర్తి అయ్యాయని, మరో ఆరు నెలల్లో రేవంత్ రెడ్డికి శిక్ష పడటం ఖాయమని చెప్పారు. రేవంత్ రెడ్డి పాతలాజికల్ లయర్, నిత్యం అబద్ధాలు ఆడడమే పనిగా పెట్టుకునే వాడిని పాతాలాజికల్ లయర్ అంటారని అంటే రోగలక్షణ అబద్దాల కోరు అని అర్ధమని చెప్పారు. రేవంత్ రెడ్డి అధికారం శాశ్వతం కాదని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు.

సైబర్ క్రైమ్ పోలీసుల ఘనత

- **బాధితులకు రూ.1,61,24,226 అందజేత**



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్ నేరగాళ్ల వలలోచిక్కి నగదు కోల్పోయిన బాధితులకు భారీ ఊరట లభించింది. సాధారణంగా ఆన్ లైన్ మోసానికి గురైన వారికి నగదు రికవరీ చేసి ఇవ్వడం అత్యంత అరుదు. అయితే, హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు చాకచక్యంతో వ్యవహరించి టెక్నాలజీ సహా యంతో సైబర్ దొంగల నుంచి రూ.1,61,24,226 రికవరీ చేశారు. న్యాయవ్యవస్థ సహకారంతో శుక్రవారం ఇద్దరు బాధితులకు బషీర్‌బాగ్ సీపీ కార్యాయంలో జాయింగ్ సీపీ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా సైబర్‌నేరాన్ని ఛేదించిన పోలీసులను జాయింట్ సీపీ ఏవీ ప్రత్యేకంగా అభినందించారు.

ముంబాయ్ సైబర్‌క్రైమ్ పోలీసులమంటూ...

నగరానికి చెందిన ఓ బాధితురాలికి ఫోన్ చేసిన నేరస్తులు ముంబాయ్ సైబర్‌క్రైమ్ విభాగం నుంచి ఫోన్ చేస్తున్నామని బెదిరించారు. ఆమెకు తైవాన్ నుంచి ఫెడెక్స్ కొరియర్ వచ్చిందని, అందులో అక్రమ వస్తువులున్నాయని చెప్పారు. ఆమె మీద కేసు నమోదు చేస్తామని బెదిరించారు. దాంతో ఆందోళనకు గురైన బాధితురాలు వారు చెప్పిన విధంగా వివిధ బ్యాంక్ అకౌంట్లలో రూ.98,79,000 వరకు ట్రాన్స్‌ఫర్ చేసింది. అయినా కూడా తిరిగి డబ్బులు డిమాండ్ చేస్తుండడంతో అనుమానం వచ్చిన బాధితురాలు ఆరా తీసింది. మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ట్రేడింగ్ పేరుతో బోల్తా....

నగరానికి చెందిన మరో బాధితున్ని ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరస్తులు బోల్తాకొట్టించారు. బాధితునికి ఫోన్ చేసిన సైబర్ నేరస్తులు తాము స్టాక్ బ్రోకర్లమని పరిచయం చేసుకున్నారు. తాము చెప్పిన విధంగా షేర్లలో పెట్టుబ డులు పెడితే తక్కువ సమయంలోనే అధికలాభాలొస్తాయని నమ్మించారు. నకిలీ అప్లికేషన్స్ ద్వారా రూ.1,04,8000 లను పెట్టుబడిగా పెట్టించారు. అయితే వారు చెప్పిన విధంగా డబ్బులు విత్‌డ్రాకాకపోవడంతో అనుమానించిన బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నేరస్తులు జమ్ముకాశ్మీర్, గుజరాత్ నుంచి మోసాలకు పాల్పడినట్టు గుర్తించారు. వారి బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. అనంతరం కోర్టులో అన్ని సాక్ష్యాలను సమర్పించిన పోలీసులు రూ.1,61,24,226లు హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు బాధితులవే అని నిరూపించారు. కోర్టు సహాయంతో ఇద్దరు బాధితులకు ఆ డబ్బులను ఇప్పించగలిగారు.

గుర్తు తెలియని వ్యక్తులు పంపించే ఎలాంటి లింక్‌లను క్లిక్ చేయవద్దని జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆర్థిక వివరాల గురించి ప్రస్తావిస్తే ముందుగా అనుమానించాలని తెలిపారు. సైబర్ నేరస్తులు టార్గెట్ చేసిన వారిని చాకచక్యంగా మోసం చేస్తారని, రుణాలిస్తామని, ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఇలా రకరకాలుగా ఆకర్షిస్తారన్నారు. ఎవరైనా సైబర్ నేరస్తుల బారిన పడితే వెంటనే సైబర్‌క్రైమ్ ఆన్‌లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ '1930'కు కాల్ చేయాలి, లేదా 'సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కే.కవిత, ఏసీపీ శివమారుతీ, ఇన్‌స్పెక్టర్లు కే.మధుసుధన్, మట్టం రాజు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట

- **రాచకొండ సీపీ డాక్టర్ తరుణ్ జోషి**

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని రాచకొండ సీపీ డాక్టర్ తరుణ్ జోషి తెలిపారు. శుక్రవారం రాచకొండ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషిని పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు, ఇతర సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిబ్బందికి రావాల్సిన, సరెండర్లు, పీఆర్‌సీ బకాయిలు, డీఏ ఏరియర్స్ నిధుల బకాయిలతోపాటు వివిధ సమస్యలను సీపీ దష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సీపీ సంబంధిత అధికారులతో మాట్లాడి, బకాయిలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని రాచకొండ సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీపీని కలిసిన వారిలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రా రెడ్డి, కృష్ణా రెడ్డి, ప్రసాద్ బాబు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక మోడిని గద్దెదించాలి : కోమటి రవి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక మోడిని గద్దె దించాలని కామ్రేడ్ కోమటి రవి పిలుపు నిచ్చారు. దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల ఐక్య వేదిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన గ్రామీణ భారత బంద్ పిలుపులో భాగంగా సీఐటీయూ మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి చౌరస్తాలో, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన కోమటి రవి ప్రసంగిస్తూ, కేంద్రంలోఉన్న బీజేపీ సర్కారు కేవలం మతో న్మాద ఎజెండా తో పాలన చేస్తుందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ కులాలను ఏ మాత్రం పట్టించు కోవడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో మోడీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. అనం తరం పార్టీ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి , మండల కార్యదర్శి కృపాసాగర్, సీఐటీయూ మండల కార్యదర్శి నర్సిం గ్ రావ్ లు మాట్లాడారు. నాయకులు విజయ్ కుమార్, సూర్యకుమార్, శివ కుమార్, దాస్ గుప్తా, శ్రీనివాస్, సుమిత్ర, సరోజ, నాగరాజు, మురళి మోహ న్ తదితరులు పాల్గొన్నారు.

బింగ్ హోల్ సరస్వతి ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభం



నవతెలంగాణ -నాగోల్

హైదరాబాద్‌లోని నాగోల్, అలకాపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బింగ్ హోల్ సరస్వతి ఎంటర్ప్రైజెస్‌ను శుక్రవారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్త ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గుప్తను నిర్వాహకులు శాలువాతో సన్మానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం సాయి నిఖిల్, అనిల్, శ్రీనివాస్, రాజు, దయానంద్, ఐవీఎఫ్ నాయకులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా పీఠాన్ని సందర్శించిన తమిళిసై



నవతెలంగాణ - మీర్ పేట్

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్ శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధి ప్రశాంతి హిల్స్‌లోని ద్వారాకమైయి సాయిబాబా మందిర పీఠాన్ని సందర్శించారు. అనంతరం పీఠాధిపతి గోపాలకృష్ణ నంద స్వామిజీ రచించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ పార్థసారథి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత స్త్రీ వ్యాధుల వైద్యశిబిరం

- ఈ నెల 18 నుంచి 24వరకు నిర్వహణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

రుతుస్రావం క్రమం తప్పడం, తెల్ల బట్ట, కలయికలో నొప్పి, యోని వద్ద ఇన్ఫెక్షన్స్, హార్మోన్ సమస్యలు, సంతానలేమి, యుక్త వయసులో వచ్చే సమస్యలు, కడుపునొప్పితో కూడిన జ్వరంతో బాధపడుతున్న వారి కోసం మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్, ఆహా క్లీనిక్స్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం గచ్చిబౌలి మెయిన్ రోడ్డు, టెలికాం నగర్, ఆహా క్లినిక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మిగతా రోజుల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగనుంది. మారుతున్న జీవనశైలి, వాతావరణం మార్పులతో, ఆహారపు అలవాట్లతో మనం అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాం. 30 ఏండ్ల దాటిన తర్వాత మహిళలు కొన్ని వ్యాధుల బారిన పడుతున్నారు. దీని కారణంగా మహిళలు 30 ఏండ్ల తర్వాత కొన్ని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. నేటి హడావిడి జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాం.

ఇది మనకు వివిధ సమస్యలను కలిగిస్తుంది. స్త్రీలు పురుషుల కంటే ఎక్కువ సున్నితత్వం కలిగి ఉంటారు. కెరీర్, ఇల్లు, పిల్లలు, మహిళలు తమను తాము చూసుకోవడానికి కూడా సమయం దొరకడం లేదు. ఒత్తిడి వల్ల హార్మోన్ల మార్పులు, గర్భం వంటి పరిస్థితుల్లో తక్కువ లేదా అధిక రక్తపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. చాలా మంది తమలో ఏదైనా అనారోగ్య సమస్య బయటపడుతుందేమోనన్న భయంతో లేదా బిజీ షెడ్యూల్‌ల కారణంగా ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేస్తుంటారు. సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేసుకుంటే వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ముందుగానే పరీక్షలు చేయించుకుంటే ఏవైనా అనారోగ్య సమస్యలను ప్రారంభంలోనే గుర్తించవచ్చు, దాన్ని నివారించడానికి జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఈ శిబిరం ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు మాత్రమే ఉంటుంది.

మార్పిడి చేసిన కిడ్నీలో కణితి!



నవతెలంగాణ-సిటీబ్యూరో

దాదాపు పన్నేండేండ్ల కిందట కిడ్నీ మార్పిడి చేయించుకున్న ఓ వ్యక్తికి.. ఇప్పుడు మార్చిన కిడ్నీలో ఓ కణితి ఏర్పడింది. హైదరాబాద్‌లోని నల్లగండ్ల ప్రాంతానికి చెందిన 43 ఏండ్ల వ్యక్తికి 2007లో రెండు కిడ్నీలు విఫలం కావడంతో అప్పట్లోనే శస్త్రచికిత్స చేసి, ఒక కిడ్నీని అమర్చారు. అలా అమర్చిన కిడ్నీలో తాజాగా కణితి ఏర్పడింది. దాంతో అతడు నగరంలో యూరాలజీ, నెఫ్రాలజీ సేవలకు ప్రసిద్ధి చెందిన ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆస్పత్రికి వచ్చాడు. అతడికి విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.మల్లికార్జున, డాక్టర్ ఎస్ఎం గౌస్ వివరాలను వెల్లడించారు. 'రోగికి తగిన వైద్య పరీక్షలు చేయగా, కణితి ఉన్న విషయం నిర్ధారణ అయ్యింది. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో కిడ్నీకి వెళ్లే రక్తనాళాలను క్లాంపింగ్ చేసి, అంటే రక్తసరఫరా ఆపేసి అప్పుడు కిడ్నీకి కోత పెట్టి కణితి తొలగించాలి. తర్వాత మళ్లీ మొత్తం కుట్లు వేయాలి. దానివల్ల దీర్ఘకాలం పాటు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం ఉంటుంది. కొన్నిసార్లు రక్తప్రసారం ఎక్కువసేపు ఆగిపోవడం వల్ల కిడ్నీ వైఫల్యానికి దారి తీయొచ్చు. ఇలా అనేక సమస్యలు ఉంటాయి. అందువల్ల ఏఐఎన్‌యూలో ఉన్న అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించాం. రోబోటిక్ శస్త్రచికిత్సను అత్యంత సున్నితత్వంతో చేయడం వల్ల రక్తప్రసారాన్ని ఆపాల్సిన అవసరం రాలేదు. అతి చిన్న కోత పెట్టి కణితిని విజయవంతంగా తొలగించి మళ్లీ కుట్లు వేసేశాం. దీనివల్ల రోగి ఆస్పత్రిలో ఉండాల్సిన సమయం చాలా తగ్గిపోయింది. రోగి త్వరగా కోలుకున్నారు. ఆయన క్రియాటినైన్ స్థాయి మళ్లీ సాధారణ స్థితికి వచ్చింది. ఇప్పుడు తన పనులన్నీ సాధారణంగా చేసుకుంటున్నారు" అని వివరించారు.

నాలుగు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లు సాధించిన క్రాంతి కుమార్



నవతెలంగాణ - సిటీబ్యూరో

నాలుగు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌ను సాధించిన క్రాంతి కుమార్‌ను సుప్రజ హాస్పిటల్ ఎండీ సిగ విజయ కుమార్ అభినందించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించడం అంత సులువు కాదన్నారు. దానికి చాలా కఠోరమైన సాధన చేయాలన్నారు. ఇలాంటి ప్రతిభ కలిగిన వారు చాలా అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. ఇలాంటి వారిని గుర్తించి సహాయ సహకారాలు అందిస్తే రాష్ట్రా నికి, దేశానికి పేరు తీసుకొస్తారని కొనియాడారు. అనం తరం క్రాంతి కుమార్ మాట్లాడుతూ తనది సూర్యాపేట జిల్లా, చిన్నప్ప టినుండి నాకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలని అనుకునేవాడినని అన్నారు. దాని కోసం ఎన్నో ఏండ్లుగా సాధన చేస్తూ మొత్తం నాలుగు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ సాధించానని తెలిపారు. ఫిబ్రవరి 2 నుండి 8 వరకు ఇటలీలోని మిలాన్ నగరంలో జరిగిన వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డ్స్ అందులో ఒకటి 60 సెకండ్లలో 57 ఫ్యాన్లు నాలుకతో ఆపానని, ఇంతకుముందు 60 సెకండ్లలో 35 ఫ్యాన్లు ఆపిన రికార్డు ఉందని చెప్పారు. రెండోది రెండు ఫీట్ల కత్తి గొంతులో దించుకొని 16 సెకన్లలో ఐదు మీటర్లు 1944 కిలోలు లాగానని, ఇంతకుముందు 16 సెకండ్లలో 1660 కిలోల రికార్డు ఉందన్నారు. మూడోది బాగా వేడిగా ఉన్న ఆయిల్ 360 డిగ్రీల సెల్సియస్‌లో ఉన్న ఆయిల్ నుండి 60 సెకండ్లలో 17 చికెన్ ముక్కల్ని తీశానని, అంతకు ముందు 60 సెకండ్లలో 12 చికెన్ ముక్కలు తీసినట్టు పేర్కొన్నారు. నాల్గొవది 60 సెకండ్లలో నాలుగు ఇంచుల 22 మొలలను ముక్కులో కొట్టుకొని తీసి రికార్డ్ సాధించానని అన్నారు. మాకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాలాంటి వారికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తే.. ఒలంపిక్స్‌లో గెలిచి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథమల్ల యాదగిరి రావు, బహుజన శ్రామిక సమితి అధ్యక్షులు బండి ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కనపెల్లి రమేష్, యాదగిరి మాజీ జడ్పీటీసీ, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంతూర్ మహిళా స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ-హయత్‌నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ బీకాం ఫస్ట్ ఇయర్ విద్యార్థినులు సిహెచ్. మానస, ఈ. మౌనిక సంతూర్ మహిళా స్కాలర్‌షిప్-2024కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.బి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు 24000 రూపాయల స్కాలర్‌షిప్‌ను సాధించినట్టు తెలిపారు. అనంతరం మానస, మౌనికను ప్రోత్సహించిన లైబ్రేరియన్ అమరేందర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఇంతియాజుద్దీన్ ఫరూఖీ, అధ్యాపకులు డాక్టర్ మల్లేశం, డాక్టర్ జాహెదా బేగం, డాక్టర్ సునీత, డాక్టర్ ధనరాజ్, ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా వాణిరెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ గా వాణిరెడ్డి శుక్రవారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వసంత అమనగల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. వాణిరెడ్డి మీర్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం కమిషనర్ వసంతను డీఈఈ వెంకన్న ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి, వీడ్కోల్ పలికారు. తర్వాత నూతన కమిషనర్ వాణిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.

భారత్ బంద్ విజయవంతం



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో, పెద్ద అంబర్‌పేట చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి. జగదీష్, మండల కన్వీనర్ ఏర్పుల నరసింహ, ఎస్ఎఫ్ఐ నాయకులు గుండె శివకుమార్, సీఐటీయూ నాయకులు, ప్రభాకర్, నరసింహ, జంగయ్య, కృష్ణ, రవి, పోచమ్మ, లక్ష్మమ్మ, శారద, పోచయ్య, దర్శన్, లక్ష్మయ్య, ఊర్మిళ, గోపాల్, రైతు సంఘం మండల కార్యదర్శి ఇరుగు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ -నాగోల్

దేశవ్యాప్తంగా చేపట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా నాగోల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని..నాగోల్ డివిజన్ నుండి చైతన్యపురి, కొత్తపేటల మీదుగా ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. తర్వాత భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి .చైతన్య జెండా ఆవిష్కరించారు.



నవతెలంగాణ - ఎల్బీనగర్

దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఐటీయూ భవనిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంమోహన్, సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షులు పుట్టపాక రామస్వామి, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పార్నంది శ్రీనివాస్, ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి బిత్ర దుర్గారావు, నగేష్ ఉపాధ్యక్షులు జంగయ్య, గోపి భాగ్యమ్మ, సంతోష, కృష్ణమ్మ, జయమ్మ, యాదమ్మ, పద్మ మంజుల, అంజయ్య, సుక్కమ్మ, యాదగిరి, సత్తయ్య, శ్రీరాములు, లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో కుంట్లూర్, రావినారాయణరెడ్డి కాలనీ నుండి 150 బైకులు, 15 ఆటోలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కుంట్లూర్, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ నుండి అబ్దు ల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో వరకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఏఐటీ యూసీ మండల కార్యదర్శి అజ్మీర్ హరీ సింగ్ నాయక్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్య దర్శి ఆమనగంటి వెంకన్న, రంగారెడ్డి జిల్లా బిటిసి వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి ప్రసాద్, మం డల వర్కింగ్ ప్రెసిడెంట్ కేతరాజు నరసింహ, నాయకులు పొన్నాల యాదగిరి, సైదులు, శ్రీనివాస్, సాగర్, నిరంజన్, నారాయణరెడ్డి, రాములు సుధాకర్, ఈశ్వరయ్య, కేకే మూర్తి, ఆర్టీసీ బిక్ష నాయక్, వినోద్ నాయక్, భాను ప్రేమ్, వెంకటేష్, పాల్గొన్నారు.



నవతెలంగాణ - సంతోష్ నగర్

దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో భాగంగా ఎల్ఐసీ సిటీ బ్రాంచ్ - 15 ఉద్యోగులు శుక్రవారం డివిజన్ నాయకుడు మద్ది లేటి, ఆరుపతయ్య, గిరిధర్, మైథిలి, సూచనల మేరకు భోజన విరామ సమయంలో సంఘీభావం ప్రకటించారు. ఈ నిరసనలో బ్రాంచ్ నాయకులు చంద్రశేఖర్, రవీందర్ రఘురామన్, పద్మావతి, పరలక్ష్మి పాల్గొన్నారు.





నవతెలంగాణ-హయత్ నగర్

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్ నగర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం, విజయవాడ జాతీయ హైవే పైన శుక్రవారం మానవహారం నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ, నాయకులు బర్ల ప్రభాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుండె శివకుమార్, రైతు సంఘం నాయకులు భిక్షపతి, మధ్యాహ్న భోజన కార్మికులు రమాదేవి, లక్ష్మమ్మ నవనీత స్వరూప, రంగమ్మ, నిర్మలమ్మ, మంజుల పాల్గొన్నారు.



నవతెలంగాణ-హయత్ నగర్

ఆటోనగర్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసరీ నర్సిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సభకు క్రీడా, గాలి పంపు, టిసిఐ, ఐలా కాంట్రాక్ట్ కార్మికులు ర్యాలీగా వెళ్లారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఆల్ పెన్షనర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పి కృష్ణమూర్తి, ఆల్ పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి బ్రహ్మాచారి, ఎన్ అంజనేయులు, ఎన్ సుదర్శన్ రెడ్డి, సోమయ్య, సిహెచ్ కృష్ణయ్య, బి.కనకయ్య, ఐఎఫ్‌టియు నాయకులు లింగం, యూనియన్ల నాయకులు సుధీర్, దయానంద్, రావుల రాజు, రమేష్, దర్శన్, రమాదేవి, మంజుల, పి యాదయ్య, టి.లావణ్య ఐల వెంకటమ్మ, శ్రీదేవి, దేవి సింగ్, లింగం యాదవ్ స్వామి, లక్ష్మణ్, వెంకట్ పాల్గొన్నారు.



నవతెలంగాణ - సంతోష్‌నగర్

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కేంద్ర కార్మిక సంఘాలు, ఇండిపెండెంట్ ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా ఉమ్మడిగా హైదరాబాద్ కంచన్‌బాగ్‌లో బీడీఎల్, బీడీఈయూ (సీఐటీయూ) అధ్యక్షులు బాబురావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగస్తులు నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జనరల్ సెక్రెటరీ టి. సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. మురళి, ట్రెజరర్ ఎం. రవీందర్, తెలంగాణ యూనియన్ అధ్యక్షులు దానకర్ణ చారి, సిబ్బంది పాల్గొన్నారు.





నవతెలంగాణ-తుర్కయంజాల్

దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీసీ, రైతు సంఘాల ఆధ్వర్యంలో నాగార్జున సాగర్ రహదారిపై శుక్రవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తర్వాత స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి. కిషన్, రైతు సంఘం జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి, కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం జె ప్రకాష్ కారత్, సీఐటీయూ నాయకులు ఏం సత్యనారాయణ, ఏఐటీయూసీ నాయకులు గువ్వల రాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - మీర్ పేట్

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి బాలాపూర్ మండల్ చౌరస్తాలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అయోధ్య వెంకట్రామిరెడ్డి, కాల్వ శంకర్, యాదగిరి, ఎ నరేందర్, పిచ్చి రాజు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మారబోతున్న ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేష్ గుప్త నగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారబోతున్నాయని కాలనీ అధ్యక్షుడు, మీకోసం మేమున్నాం ఫౌండేషన్ చైర్మన్, కర్మన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ నారగోని శ్రీనివాస్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యయుడు డేవిడ్‌ను కలిసి పాఠశాల స్థితి గతులను తెలుసుకున్నారు. ఆధునీకరణ పద్ధతుల్లో తరగతి గదులను తీర్చి దిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కాలనీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో పాఠశాల పరిసర ప్రాంతాలను ఉన్నతంగా మలిచి, విద్యార్థులకు తాగునీటి సౌకర్యంతో పాటు, క్రీడా ప్రాంగాణాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కాలనీవాసుల కోసం మంచి వాతావరణంలో మార్నింగ్ వాక్ చేసుకునే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. వారివెంట వాంబే కాలనీ అధ్యక్షుడు నారాయణ చారి, ఎం.వి ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.



మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

- చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ పనులకు కేటాయించిన రూ.35.17 బడ్జెట్‌ను మొదటగా మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయనున్నట్లు చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి అన్నారు. రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మొత్తం పుర ఆదాయం రూ.28.87 కోట్లు కాగా, వివిధ గ్రాంటుల ద్వారా ఆదాయం రూ.4 కోట్ల 80 లక్షలు, హరిత బడ్జెట్ రూ.2 కోట్ల 88 లక్షలుగా వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. 1/3 వంతు నిధులను పురపాలక సంఘంలో విలీనమైన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన, మైనార్టీ ప్రజల అభివృద్ధికి, మురికి వాడల అభివృద్ధికి కేటాయింపులు చేశామన్నారు. తొర్రూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం, హెచ్ ఎం డి ఏ ఫండ్ ఖర్చు వివరాలు, సీ ఎస్ ఆర్ ఫండ్ ద్వారా రోడ్ల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో అభివృద్ధికి ప్రత్యేక నిధి, పెద్ద వార్డులలో మౌలిక వసతుల కల్పనకు కృషి, హరిత హారం, ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమాలు వంటి అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ హరిత ధన్ రాజ్ గౌడ్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికే ఐలయ్య, కౌన్సిలర్లు సంగీత, జ్యోతి, రెవల్లి హరిత, అనురాధ, ఉదయశ్రీ, భాగ్యమ్మ ధనరాజ్, కో ఆప్షన్స్, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, అకౌంటెంట్ ఉషా కుమారి, సానిటరీ ఇనిస్పెక్టర్ ప్రవీణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు చాలా అవసరం. అలా అని వేలకు వేలు పెట్టి ఖరీదైన డైట్‌లు చేయనక్కర్లేదు. మన ఇంట్లో ఉండే ఎన్నో పదార్థాలతో చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అందులో మెంతులు కూడా ఉన్నాయి. మెంతులని కూరలు, పచ్చళ్ళలో వాడతారని తెలిసిందే. మెంతులు చేదుగా ఉన్నప్పటికీ ఇందులోని పోషకాలు, మినరల్స్ శరీరానికి ఎంతో అవసరం. మెంతుల్లో ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో మెంతుల నీరు తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం.



కొలెస్ట్రాల్ తగ్గించుకోవాలంటే...

జీర్ణక్రియ..

మెంతుల నీటిని రోజూ పరగడుపున తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. దీనిలోని పీచు పదార్థం అజీర్ణం, మలబద్ధకం, వాతాన్ని నయం చేస్తుంది. ఇది ఆహారం నుండి పోషకాలను శరీరం గ్రహించేలా చేస్తుంది

ఇన్‌ఫ్లమేషన్..

మెంతులు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించడంలో సాయపడతాయి. కాబట్టి, గౌట్, ఆస్తమా వంటి సమస్యలతో బాధపడేవారు వీటిని తీసుకోవచ్చు. మెంతుల్లో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ సి, నియాసిన్, పొటాషియం, ఐరన్, ఆల్కలాయిడ్స్ ఉన్నాయి. అసిడిటీ ఉన్నవారు ప్రతిరోజూ ఉదయాన్నే నానబెట్టిన మెంతులు ఓ టీస్పూన్ తీసుకోవడం మంచిది.

షుగర్..

షుగర్ ఉన్నవారికి మెంతులు ఓ గొప్ప ఔషధమని చెప్పొచ్చు. మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి కంట్రోల్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో మెంతుల నీరు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. కనుక మధుమేహం ఉన్నవారు ఈ నీటిని తాగడం మంచిది. మరీ ముఖ్యంగా నానబెట్టి ఆ నీటిని తాగితే మరీ మంచిది.

కొవ్వు కరిగించేందుకు..

అదే విధంగా, మెంతులను ఆహారంలో చేర్చడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. ముఖ్యంగా రక్తనాళాలల్లో పేరుకుపోయిన కొవ్వుని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని వల్ల కార్డియో వాస్కులర్ వంటి వ్యాధులను దూరం చేయడానికి దోహదం చేస్తుంది.

ఇమ్యూనిటీ..

మెంతుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. మెంతులు వాడడం వల్ల చర్మంతో పాటు జుట్టుకి కూడా మేలు చేకూరుతుంది.

చిట్కా

స్వచ్ఛమైన ఇంగువ, నిమ్మ రసంతో నూరి దానిని పండ్లకి వేసి రుద్దితే పండ్లవెంట కారే రక్తం ఆగిపోతుంది.

తాగుడు మానకుంటే...

తాగుడు మనిషి జీవితాలను ఎంతగా చిన్నాభిన్నం చేస్తుందో అందరికీ తెలుసు. అయినా చాలా మంది తాగకుండా ఉండలేరు. కొంతమందైతే దానికే బానిసలుగా మారిపోతుంటారు. కొంత మంది సరదా కోసం తాగుతుంటారు. కొంత మందికైతే తాగడానికి ఏదో ఒక సాకు కావాలి. ఈ రోజు పండుగ, పుట్టిన రోజు, మనసు బాగోలేదు, చాలా సంతోషంగా ఉంది' ఇలా తాగడానికి ఏదోక కారణం చెబుతుంటారు. మానేయమంటే 'చాలా ప్రయత్నిస్తున్నాం, కానీ మా వల్ల కావడం లేదు' అంటారు. ఆ తాగుడు వల్ల కుటుంబం ఎంత ఇబ్బంది పడుతుందో అర్థం చేసుకోరు. అలాంటి సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...

రాధికకు దాదాపుగా 48 ఏండ్లు ఉంటాయి. భర్త లేదు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. అమ్మాయికి పెండ్లి అయిపోయింది. చిన్న అబ్బాయి అజయ్ బాగా తాగుతాడు. ఎవరు చెప్పినా విని పించుకోడు. అంతకు ముందు రాత్రి మాత్రమే తాగేవాడు. రానురాను పగలూ రాత్రి తేడా లేకుండా తాగడం మొదలుపెట్టాడు. చేతిలో డబ్బుంటే చాలు తాగడానికి వెళతాడు. బంధువులు, స్నేహితులు ఎంత చెప్పినా, చివరకు కొట్టినా అతనిలో ఎలాంటి మార్పు లేదు. తాగి సైలెంట్‌గా పడుకుంటాడా అంటే అదీ లేదు. అరిచి గొడవ చేస్తాడు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ తిడుతూ గొడవలు పడుతుంటాడు.

ఫంక్షన్లకు వెళ్ళాలంటే రాధికకు చాలా ఇబ్బందిగా ఉండేది. 'మీ అబ్బాయి ఏంటి ఇలా తాగుతున్నాడు. ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నాడు. ఎవరికీ భయపడడం లేదు. తండ్రి లేడు. ఇక ఎవరి మాట వింటాడు. నువ్వు ఉన్నప్పుడు గొడవలు చేసినా, ఎవరైనా తిట్టినా నీ ముఖం చూసి ఊరుకుంటున్నారు. రేపు నీకేమైనా అయి తే అతని పరిస్థితి ఏంటి? ఎవ్వరూ దగ్గరకు రానియ్యరు. బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకో. మన బంధువుల్లో కాకుండా వేరే వాళ్ళతో చెప్పిస్తే ఫలితం ఉంటుందేమో చూడు' అంటూ సలహాలిస్తుండేవారు.

అలాంటి పరిస్థితుల్లోనే ఐద్వా అదాలత్ గురించి తెలుసుకొని వచ్చింది. ఆమె బాధ చూసి అజయ్‌ని పిలిపించి మాట్లాడాము. అతనికి 20 ఏండ్లు ఉంటాయి. 'ఎందుకు నువ్వు ఇలా తాగుతున్నావు. నీకేమైనా సమస్య ఉందా? ఎవరికీ చెప్పుకోలేక నీలో నువ్వే బాధపడుతున్నావా, ఇంత చిన్న వయసులో ఏంటి ఈ అలవాటు. తాగడం వల్ల నువ్వేమైనా సంతోషంగా ఉండగలుగుతున్నావా, పగలూ రాత్రీ తేడా లేకుండా తాగుతూనే ఉన్నాం. అందరితో ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నావు. ముందు అసలు నీ సమస్య ఏంటో చెప్పు. మేమే మైనా సాయం చేయ గలిగితే చేస్తాం. నువ్వు ఇలా తాగుతుంటే మీ అమ్మ చాలా బాధపడు తుంది. నలుగురిలోకి వెళ్ళడానికి ఇబ్బంది పడుతుంది. ఆమెకు ఎంత కష్టం కలిగితే మా దగ్గరకు వచ్చిందో ఒక్కసారి ఆలోచించు. ఒక పక్క మీకు తండ్రి లేడు. అయినా మీ అమ్మ మిమ్మల్ని కష్టపడి పెంచుతుంది. అలాంటి ఆమెను బాధపెట్టడం కరెక్టేనా...' అన్నాము.

దాంతో అజయ్ 'మా నాన్న చనిపోయినప్పటి నుండి నేను తాగడం మొదలు పెట్టాను. ఆయన హఠాత్తుగా చనిపోయారు. అప్పుడు నాకు 14 ఏండ్లు ఉంటాయి. నేను చాలా బాధపడి రోజూ ఏడుస్తుండేవాడిని. అది చూసి నా బంధువులు కొంచెం మద్యం తాగించారు. అప్పుడు అన్నీ మర్చిపోయి పడుకున్నాను. ఇలా కొన్ని రోజులు కొంచెం తాగి పడుకునేవాడిని. ఆ తర్వాత పండగలు, ఫంక్షన్‌లప్పుడు తాగడం మొదలుపెట్టాను. తర్వాత అది నాకే తెలియకుండా వ్యసనంగా మారిపోయింది. ఇప్పుడు తాగకుండా ఉండలేకపోతున్నాను. మానెయ్యడానికి ఎంత ప్రయత్నించినా నా వల్ల కావడం లేదు.

మా బంధువుల్లో ఒకామె నా గురించి మంచిగా ఆలోచించి నేను ఎలాగైనా తాగడం మానేయాలని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది. ఆమె డబ్బుతోనే మందులు కూడా కొనిచ్చింది. వాటిని రోజూ వేసుకున్నాను. మూడు నెలల వరకు అసలు తాగలేదు. దాని వాసన వచ్చినా వాంతులు వచ్చేవి. అలాంటి సమయంలో మా ఇంట్లో ఒక సంఘటన జరిగింది. దాంతో మళ్ళీ తాగడం మొదలుపెట్టాను. నన్ను ఆస్పత్రికి తీసుకెళ్ళిన అక్క కూడా నన్ను తిట్టింది. ఇప్పుడు తను కూడా నాతో మాట్లాడడం లేదు. పైగా అసహ్యించుకుంటుంది. మా అమ్మ, అన్న, అక్క తర్వాత నేను మా బంధువుల్లో ఇష్టపడేది ఆ అక్కనే. ఇప్పుడు ఆమె కూడా నన్ను దూరం పెట్టింది. మా బంధువులందరూ నన్ను తిడుతు న్నారు. అందుకే ఇంకా ఎక్కువగా తాగుతున్నాను' అని చెప్పాడు.

నీ కుటుంబ సభ్యులైనా, బంధువులైనా నువ్వు బాగుండాలనే కోరుకుంటున్నారు. అందుకే నిన్ను తిడుతున్నారు. అంతే తప్ప నీపై వాళ్ళకు ప్రేమ లేక కాదు. నువ్వు మారాలనే కదా నువ్వు ఇష్టపడే మీ అక్క నిన్ను ఆస్పత్రికి తీసుకెళ్ళింది. కానీ నువ్వేం చేశావు, ఇంట్లో ఏదో జరిగిందని మళ్ళీ తాగడం మొదలుపెట్టావు. దాంతో ఆమె నమ్మకాన్ని కూడా పోగొట్టుకున్నావు. మూడు నెలలు తాగడం మానేసినపుడు అందరూ నీతో ఎంత మంచిగా ఉన్నారో ఒక్కసారి గుర్తు చేసుకో. ఇంత చిన్న వయసులో అనవసరంగా నీ జీవితాన్ని పాడు చేసుకుంటున్నావు. నువ్వు ఇలాగే ఉంటే ఎవరూ నిన్ను దగ్గరకు రానియ్యరు. అందరూ అసహ్యించుకుం టారు. నీ గురించి బంధువులకే కాదు మీ చుట్టు పక్కల అందరికీ తెలుసు. ఇలాగే వుంటే రేపు నీలాంటి వాడిని పెండ్లి చేసుకోడానికి ఏ అమ్మాయీ ముందుకు రాదు. ఇప్పటికైనా కొత్త జీవితం ప్రారంభించు. తాగడం మానుకో. నిజంగా నీకు మానెయ్యాలని ఉంటే ఇంట్లో ఏదో జరిగింది, నా మనసు బాగోలేదు అనే కారణాలతో తాగవు. ఏదైనా సమస్య వస్తే మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి. అంతే కాని తాగడం సరైనది కాదు. తాగుడు మానుకొని నువ్వు మంచిగా ఉంటే రేపు నువ్వే ఎంతో మందికి ఆదర్శంగా కనిపిస్తావు. ఈ రోజు తిడుతున్న వారే రేపు నీ గురించి గొప్పగా చెప్పు కుంటారు. ఇలాగే తాగి తందనాలు ఆడితే కచ్చి తంగా అసహ్యించుకుంటారు. నీకు ఎలాంటి జీవితం కావాలో నువ్వే నిర్ణయించుకో' అని చెప్పాము.

> నీ కుటుంబ సభ్యులైనా, బంధువులైనా నువ్వు బాగుండాలనే కోరుకుంటున్నారు. అందుకే నిన్ను తిడుతున్నారు. అంతే తప్ప నీపై వాళ్ళకు ప్రేమ లేక కాదు. నువ్వు మారాలనే కదా నువ్వు ఇష్టపడే మీ అక్క నిన్ను ఆస్పత్రికి తీసుకెళ్ళింది. కానీ నువ్వేం చేశావు, ఇంట్లో ఏదో జరిగిందని మళ్ళీ తాగడం మొదలుపెట్టావు. దాంతో ఆమె నమ్మకాన్ని కూడా పోగొట్టుకున్నావు. మూడు నెలలు తాగడం మానేసినపుడు అందరూ నీతో ఎంత మంచిగా ఉన్నారో ఒక్కసారి గుర్తు చేసుకో.

అతను బాగా ఆలోచించుకొని 'మీరు చెప్పినట్టే తాగడం మానేస్తాను. అంతకు ముందు నేను వెళ్ళిన డాక్టర్ దగ్గరకే మళ్ళీ వెళతాను. టాబ్లెట్లు వాడతాను' అన్నాడు.

కేవలం డాక్టర్ దగ్గరకు వెళ్ళి మందులు వాడితే సరిపోదు. కౌన్సెలింగ్ కూడా తీసుకోవాలి. మళ్ళీ నువ్వు దాని జోలికి వెళ్ళకూడదు' అన్నాము. దానికి అజయ్ అంగీకరించాడు.

వాళ్ళ అమ్మతో 'అజయ్ తాగడం మానేసి మళ్ళీ మామూలు మనిషి కావడానికి కొంత సమయం పడుతుంది. అప్పటి వరకు మీరు కాస్త ఓపిగ్గా ఉండండి. అతనికి అన్ని రకాలుగా సహకరించండి. ఏదైనా అవసరం అయితే మా దగ్గరకు తీసుకురండి' అని చెప్పాము. అందరితో మొండిగా మాట్లాడే కొడుకు మా దగ్గరకు వచ్చి తాగడం మానేస్తాను అని చెప్పేసరికి చాలా ఆనందించింది. అవసరమైనప్పుడు వస్తానని చెప్పి కొడుకుని తీసుకొని ఇంటికి వెళ్ళిపోయింది.

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

స్వాగతిస్తున్నాం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కులగణనపై అసెంబ్లీలో ప్రభుత్వం పెట్టిన బిల్లును స్వాగతిస్తూ, మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కే తారకరామారావు (కేటీఆర్) అన్నారు. 2004లో కేంద్ర మంత్రి హెూదాలో తమపార్టీ అధినేత కేసీఆర్ ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కోరారని గుర్తుచేశారు. దీనిపై రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామన్నారు. అయితే బీహార్ తరహాలో న్యాయసమస్యలు తలెత్తకుండా, బిల్లు రూపొందించి, చట్టబద్ధత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికోసం జ్యుడీషియరీ కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2011లో చట్టం చేయకుండానే కులగణన జరిగిందనీ, చేసే పనిలో చిత్తశుద్ధి ఉండాలని అన్నారు. 2014లో సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను ఇప్పటి వరకు బయటపెట్టలేదని గుర్తుచేశారు. 2014 నుంచి 2023 వరకు తొమ్మిదిన్నరేండ్లలో బీసీల కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు కేవలం రూ.23వేల కోట్లు అని చెప్పారు. ఎమ్‌బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నామని చెప్పి, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. బీహార్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో కులగణనపై చట్టం చేయలేదనీ, ఎక్కడా న్యాయస్థానాలు స్టే విధించలేదని చెప్పారు. ఇదే అంశంపై సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కులగణనపై విస్తృత చర్చ కోసం అఖిలపక్షాన్ని పిలవాలనీ, దానిలో బీసీ సంఘాలకూ ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. దేశంలో కార్పొరేట్ రంగం విస్తరించి, ప్రభుత్వ రంగం కుదించుకుపోతున్నదనీ, ఈ దశలో కులగణన ద్వారా జనాభా ప్రాతిపదికన ఎవరి వాటాలు ఎంతో తేల్చాల్సి ఉంటుందన్నారు. అదే సందర్భంలో క్రీమీలేయర్‌పై కూడా చర్చ జరగాలన్నారు. తీర్మానాన్ని బిల్లు రూపంలో తేవాలనీ, ఆర్థిక స్థితిగతుల ప్రాతిపదికగా నిర్ణయాలు జరగాలని చెప్పారు. అదే సమయంలో ఓసీల ఆర్థిక స్థితిగతుల్నీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ బీసీ జనగణనకోసం కమిషన్ ఏర్పాటు చేయాలనీ, చర్చించేందుకు అసెంబ్లీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో తీర్మానాలు చేయలేదనీ, పార్లమెంటు ఎన్నికల్లో లబ్ది పొందేందుకే కులగణన తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్టు భావించాల్సి వస్తుందన్నారు. 2014 ఆగస్టులో బీఆర్ఎస్ ప్రభుత్వ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఏమైందని ప్రశ్నించారు. ముస్లింల ఆర్థిక స్థితిగతులపై గతంలో సచార్ కమిషన్, రంగనాథ్ కమిషన్లు అనేక నివేదికలు ఇచ్చాయనీ, వాటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. చిత్తశుద్ధితో కులగణన చేపడితే తొలుత న్యాయసలహా తీసుకోవాలని సూచించారు. కులగణన జరిగాక ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తారా అని ప్రశ్నించారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాంగ్రెస్ సభ్యులు కే శంకర్, వాకాటి శ్రీహరి తదితరులు మాట్లాడారు. అనంతరం సభ్యుల సందేహాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానాలు ఇచ్చారు. సభ్యుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. తీర్మానానికి ఆమోదం తెలపాలని కోరారు. అనంతరం స్పీకర్ ప్రసాదరావు తీర్మానం ఆమోదం పొందినట్టు ప్రకటించారు.

లింగ వేతన వ్యత్యాసం తగ్గింది

(మొదటిపేజీ తరువాయి)

గ్రామీణ ప్రాంత ప్రజలే ఉపాధిలో ఎక్కువగా ఉన్నారు. అయితే, ఇందులో తీవ్ర శ్రమ, రక్షణ లేకపోవటం, తక్కువ చెల్లింపులు వంటివి ఉంటాయి. "గంటల ఆధారంగా చూస్తే పట్టణాలతో పోల్చి చూస్తే గ్రామీణ ప్రాంత ప్రజలు సగటున 24 శాతం తక్కువ చెల్లింపులు కలిగి ఉంటున్నారు. విద్య, ఉద్యోగ అనుభవం, వృత్తి పరమైన విభాగం వంటి అంశాల్లో పట్టణ-గ్రామీణ వ్యత్యాసాల ద్వారా ఈ అంతరంలో సగం మాత్రమే వివరించబడుతుంది. కనీస వేతనాలు, సమానావకాశాలను ప్రమోట్ చేసే సంస్థాగత, నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌లు గ్రామీణ-పట్టణ విభజనలో లేబర్ మార్కెట్ సంబంధిత అసమానతలను తగ్గించటానికి సహాయం చేయగలుగుతుంది" అని ఐఎల్ఓ వివరించింది.

బీజేపీయేతర రాష్ట్రాల మెడపై కత్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ద్రవ్యనియంత్రణ చట్టాన్ని అడ్డుపెట్టుకుని కేంద్ర ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్రాలపై ఆర్థిక ఆంక్షలు విధిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని అనుసరిస్తోందని కేరళ ఆర్థిక శాఖ మాజీ మంత్రి ప్రొఫెసర్ థామస్ ఐజాక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కేంద్ర ప్రభుత్వ వివక్ష" అనే అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. ద్రవ్య నియంత్రణ చట్టం ప్రకారం బడ్జెట్లో రెవెన్యూ లోటు జీరో శాతం, ద్రవ్యలోటు మూడు శాతానికి మించకూడదని నిబంధనలు చెబుతున్నా కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో రెవెన్యూలోటు రెండు శాతం, ద్రవ్యలోటు ఐదు శాతంగా ఉందని తెలిపారు. కేంద్రం స్వయంగా నిబంధనలు ఉల్లంఘిస్తూ రాష్ట్రాలపై ఆర్థిక ఆంక్షలు విధిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థూల జాతీయోత్పత్తిలో మూడు శాతానికి మించి అప్పులు చేయరాదనే నిబంధనలను సాకుగా చూపెట్టి కేంద్రం అభివృద్ధిని అడ్డుకుంటోందని చెప్పారు. ఒకవైపు రుణాలు, ఇతర సంక్షేమ పథకాలపై ఆంక్షలు విధిస్తూనే మరోవైపు రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటాను దొడ్డిదారిన తరలించుకు పోతోందని ఐజాక్ తెలిపారు.

14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 32 శాతం నుంచి 41 శాతం పెరిగిన పన్నుల వాటాను మరింత తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆయన తప్పుపట్టారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇదే మోడీ రాష్ట్రాల పన్నుల వాటాను 50 శాతానికి పెంచాలని ఆందోళన చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ సూచనలను ఆర్థిక సంఘం పట్టించుకోక పోవడంతో సెస్, సర్ చార్జీల పేరుతో కేంద్రం నేరుగా పన్నులను వసూలు చేస్తున్నదని విమర్శించారు. 2014లో స్థూల జాతీయోత్పత్తిలో 8 శాతం ఉన్న ఈ తరహ పన్నుల వాటా 2023లో 20 శాతానికి పెరిగిందని చెప్పారు.

అయితే బీజేపీ పాలిత రాష్ట్రాల విషయంలో మాత్రం కేంద్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. బడ్జెట్‌లో ప్రతీయేటా కేంద్ర ప్రభుత్వ ఖర్చులను తగ్గిస్తోందనీ, ఆ ప్రభావం సంక్షేమ రంగాలపై పడుతోందని చెప్పారు.

ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీయేతర రాష్ట్రాల పట్ల కేంద్రం చూపిస్తున్న వివక్ష వల్ల దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్ట పోతున్నాయని చెప్పారు. కేరళ ప్రభుత్వం విషయంలో మోడీ సర్కార్ ఆర్థిక ఆంక్షలతో పాటు పన్నుల వాటాను కూడా తగ్గింస్తోందని వాపోయారు. మోడీ సర్కార్ అనుసరిస్తున్న తీరుకు నిరసనగా తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తడితే... చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని న్యాయస్థానం సూచించిందన్నారు. ఇటీవల కేంద్రంతో చర్చలు జరిపినా దాని వైఖరిలో మార్పు రాకపోవడంతో తిరిగి కోర్టును ఆశ్రయించామని చెప్పారు. సుప్రీం కోర్టు నిర్ణయం కోసం తాము ఎదురు చూస్తున్నామని తెలిపారు. ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన వెబినార్‌లో కొండూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

ఇంఫాల్ : మణిపూర్‌లో గత తొమ్మిది నెలలుగా కొనసాగుతున్న హింసాకాం ఇంకా చల్లారడం లేదు. ఈ హింసాకాండ ఇప్పట్లో అంతమయ్యే సూచనలు కూడా కనుచూపుమేర కనిపించడం లేదు. తాజాగా చురుచాంద్‌పూర్ జిల్లా హింసాకాండకు సాక్షిగా మారింది. చురుచాంద్‌పూర్ పట్టణంలో జిల్లా కలెక్టర్, ఎస్‌పి, డిప్యూటీ కమిషనర్‌తో సహా ఇతర ఉన్నతాధికారుల కార్యాలయాలు, నివాసాలపై గురువారం రాత్రి దాదాపు 300 నుంచి 400 మంది ఉన్న గుంపు దాడికి తెగబడింది. ఉన్నతాధికారుల నివాసాలు ఉండే ఈ ప్రాంతాన్ని మిని సెక్రటేరియట్‌గా పిలుస్తుంటారు.

ఈ ప్రాంతంపై దాడికి పాల్పడ్డ గుంపు కలెక్టర్ నివాసాన్ని దగ్ధం చేశారు. అక్కడ నిలిపి ఉంచిన భద్రతా దళాల వాహనాలనూ అగ్నికి ఆహుతి చేశారు. గురువారం రాత్రి ముందుగా ఈ ప్రాంగణంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన గుంపును గేట్ల వద్ద భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో భద్రతా సిబ్బందిపై రాళ్లదాడికి గుంపు పాల్పడింది.

తరువాత ఈ గుంపు ఉన్నతాధికారుల నివాసాలు, కార్యాలయాల్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న సామాగ్రిని దగ్ధం చేసింది. దీంతో గుంపును అక్కడ నుంచి చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది కాల్పులు ప్రారంభించారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందారు. 12 మంది గాయపడినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ మృతులు, గాయపడిన సంఖ్యపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. శుక్రవారం తెల్లవారుజాము వరకూ కూడా ఈ హింసాకాండ, కాల్పులు కొనసాగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల సాయుధులతో కలిసి ఒక వీడియోలో కనిపించినందుకు చురచాంద్‌పూర్ జిల్లాలో కుకీ వర్గానికి చెందిన ఒక హెడ్ కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. దీనికి నిరసనగా ఈ కుకీ వర్గానికి చెందినవారే గురువారం రాత్రి దాడికి పాల్పడినట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు.

ఈ సస్పెండ్ ఘటనపై ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ (ఐటిఎల్ఎఫ్) విడుదల చేసిన ఒక ప్రకటనలో 'సాయుధులతో వీడియోలో కనిపించినందుకు కుకీ హెడ్‌కానిస్టేబుల్‌ను అధికారులు వేగంగా సస్పెండ్ చేశారు. అయితే ఇలాంటి వీడియోల్లో కనిపించే మైతేయి పోలీసులు, అధికారులపై ఎలాంటి చర్యలూ తీసుకోరు' అని విమర్శించింది. మరోవైపు ఈ దాడి నేపథ్యంలో జిల్లాలో ఐదు రోజల పాటు మొబైల్ ఇంటర్నెట్, డేటా సేవలు, ఇంటర్నెట్ డేటా సేవలను నిలిపివేస్తూ మణిపూర్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం...

- ఇంగ్లీష్ ప్రాక్టికల్‌లో తప్పులు
- ఆర్థిక మంత్రి పేరు హరీశ్‌రావు అంటూ ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం మొదటిసారిగా నిర్వహించిన ఇంగ్లీష్ ప్రాక్టికల్ నిర్వహణలో ఇంటర్ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రశ్నాపత్రంలో తప్పులు దొర్లాయి. స్వచ్ఛ బడి క్లీన్ తెలంగాణ అనే ప్రశ్నలో ఆర్థిక మంత్రి పేరు టి హరీశ్‌రావును ముద్రించారు. ఆ ప్రశ్నను సవరించకుండా యథాతథంగా విద్యార్థులకు ఇచ్చి పరీక్షను నిర్వహించారు. ఇంటర్ బోర్డు అధికారుల తీరుపై పలువురు అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతేడాది డిసెంబర్ మూడో తేదీన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఏడో తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత మంత్రులకు శాఖలను కేటాయించారు. ప్రస్తుతం ఆర్థిక మంత్రిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నారు. కానీ ఇంటర్ బోర్డు అధికారులు మాత్రం ఆర్థిక మంత్రి పేరు ఇంకా టి హరీశ్‌రావు పేరును ముద్రించడం చర్చకు దారితీసింది.

4.78 లక్షల మంది విద్యార్థుల హాజరు : ఇంటర్ బోర్డు

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో మొదటిసారిగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టుకు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రాక్టికల్‌ను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. రెండు విడతల్లో ఈ ప్రాక్టికల్ పరీక్షలు జరగాయని పేర్కొన్నారు. 3,200 కాలేజీల్లో 4,78,600 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారుల వివరాల ప్రకారం ఈ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. ఈనెల 28 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి. ప్రథమ సంవత్సరం నుంచి 4,78,527 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 4,43,993 మంది కలిపి 9,22,520 మంది విద్యార్థులు హాజరవుతారు.

జర్నలిస్టుకు భద్రత కరువు

- గతేడాది 99 మంది చనిపోయారు
- ఇందులో 77 మంది గాజాపై ఇజ్రాయెల్ యుద్ధంలోనే
- 2023 జర్నలిస్టులకు ఘోరమైన ఏడాది
- గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్ వార్షిక నివేదిక

న్యూఢిల్లీ : ప్రపంచలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా కచ్చితమైన, వాస్తవ సమాచారాన్ని అందించే కలం యోధులకు రక్షణ కరువైంది. అలాంటి జర్నలిస్టుల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నాయి. జర్నలిస్టుల మరణాలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. గతేడాది 99 మంది జర్నలిస్టులు చనిపోయారు. వీరిలో 77 మంది గాజాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని రిపోర్ట్ చేస్తున్న సమయంలోనే ప్రాణాలు కోల్పోయారు. గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్ 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్(సీపీజే) ఈ సమాచారాన్ని తన వార్షిక నివేదికలో వెల్లడించింది.

ఈ సమాచారం ప్రకారం.. దశాబ్ద కాలంలో 2023 అనేది జర్నలిస్టులకు ఘోరమైన సంవత్సరం. ఈ ఏడాదిలో 99 మంది జర్నలిస్టులు చనిపోయారు. ఇందులో 77 మంది గాజాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని రిపోర్టింగ్ చేస్తున్న సమయంలోనే ప్రాణాలు కోల్పోవటం గమనార్హం. ఇజ్రాయెల్-గాజా యుద్ధం మొదటి మూడు నెలల్లోనే అనేక మంది జర్నలిస్టులు చనిపోయారు. ఇది ఒక దేశంలో ఒక ఏడాదిలో నమోదయ్యే సంఖ్య కంటే అధికం కావటం గమనార్హం. కాగా, ఈ 77 మందిలో 72 మంది వారు పాలస్తీనాకు చెందినవారు కాగా, ముగ్గురు లెబనాన్‌కు చెందినవారు, ఇద్దరు మాత్రమే ఇజ్రాయెల్ దేశానికి చెందినవారు. అయితే, గురువారం నాటికి ఇజ్రాయెల్-గాజా యుద్ధంలో మరణించిన జర్నలిస్టుల సంఖ్య 88కు పెరిగిందని సీపీఏ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే, ఈ మరణాలపై దర్యాప్తు పూర్తయిన తర్వాత మాత్రమే డేటా బేస్‌లోకి వాటిని చేర్చుతామని సంస్థ స్పష్టం చేసింది.

ఇజ్రాయెల్ దళాలు జర్నలిస్టులపై చేస్తున్న దాడులను న్యూయార్క్ కేంద్రంగా పని చేసే ఈ సంస్థ ఇప్పటికే ఖండించింది. ఇజ్రాయెల్ సైన్యం డజన్ల కొద్ది జర్నలిస్టులను ఉద్దేశపూర్వకంగానే చంపిందా అన్న అంశంపై సంస్థ దర్యాప్తును జరుపుతున్నట్టు సమాచారం. ఒకవేళ అదే నిజమైతే అది 'యుద్ధ నేరం'గా పరిగణించబడుతుంది.

మోడీ సర్కార్‌పై రైతు, కార్మిక గర్జన



(మొదటిపేజీ తరువాయి)

హన్నన్ మొల్లా, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక మోడీ సర్కార్ ను గద్దెదించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరిస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. రైతులను, కార్మికులను మోడీ మోసం చేస్తున్నారని, ఉత్పత్తి వర్గాలపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్మిక కోడ్ లతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. రైతుల పండించిన పంటలకు ఎంఎస్పీ ఇవ్వటం లేదని, రుణమాఫీ చేయలేదని అన్నారు. రైతుల ఆత్మహత్యలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 పెంచాలని, పట్టణాలకు కూడా ఉపాధి హామీని విస్తరించాలని డిమాండ్ చేశారు. హర్యానాలోని పల్వాల్ లో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్, ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, మహారాష్ట్రలోని ముంబయిలో ఎఐకెఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే, సీనియర్ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ పాల్గొన్నారు.


మహబూబాబాద్‌లో...


వరంగల్‌లో...


ఆదిలాబాద్‌లో...


భూపాలపల్లిలో...

ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు గ్రామీణ భారత్ బంద్‌తో పాటు పారిశ్రామిక, సెక్టోరల్ సమ్మె విజయవంతంగా జరిగింది. నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు తమ నిరసన గళం వినిపించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో జరిగిన నిరసన కార్యక్రమాల చిత్రమాలిక.....


నిజామాబాద్‌లో...


నల్లగొండలో...


ఖమ్మంలో...


వికారాబాద్‌లో...


జనగామలో...


ములుగులో...


మహబూబ్‌నగర్‌లో...


హన్మకొండలో...


మెదక్‌లో...


ఎన్టీఆర్

దసరా కానుకగా దేవర రిలీజ్

ఎన్టీఆర్ నటిస్తున్న తాజా చిత్రం 'దేవర'. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మరో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో అలరించబోతున్నారు. డైరెక్టర్ కొరటాల శివ ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. అందులో తొలి భాగం 'దేవర పార్ట్ 1' ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 10న విడుదల కాబోతోంది.
దసరా సందర్భంగా దేవర పార్ట్ 1 తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కాబోతోన్నట్టుగా మేకర్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రిలీజ్ చేసిన పోస్టర్ ఒకటి నెట్టింట్లో అభిమానులను తెగ ఆకట్టుకుంటోంది. ఎన్టీఆర్ పోస్టర్‌ను చూసి ఫ్యాన్స్ సంబరపడుతున్నారు. ఈ పోస్టర్ చూస్తుంటే యాక్షన్ సీక్వెన్స్ హై లెవెల్లో ఉండబోతున్నాయని, ఎన్టీఆర్‌ను మరింత మాస్ కారెక్టర్‌లో చూపించబోతున్నారని అర్థమైంది. ఇది వరకే రిలీజ్ చేసిన దేవర గ్లింప్స్ ఏ రేంజ్‌లో ట్రెండ్ అయిందో.. సోషల్ మీడియాలో ఎలాంటి రికార్డులను క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే.
ఈ చిత్రంలో ఇంకా ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాకో, నరైన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుద్ సంగీత సారథ్యం వహిస్తుండగా శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రత్నవేలు సినిమాటోగ్రాఫర్‌గా, సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

నవచిత్రం

గెలిచిన క్షణం నుంచే..



ఈనెల 11న జరిగిన తెలుగు చలనచిత్ర దర్శకుల ఎన్నికలలో దర్శకుడు వీరశంకర్ ప్యానెల్ సభ్యులు అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికైన నూతన కార్యవర్గం శుక్రవారం రథసప్తమి పర్వదినాన దర్శకుల సంఘం కార్యాలయంలో పదవీ బాధ్యతలను చేపట్టింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ,'మా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలుపరిచే దిశగా, గెలిచిన క్షణం నుండే కార్యాచరణను ప్రారంభించాం. మా సభ్యులు మాకిచ్చిన అతికొద్ది కాలంలోనే మా సంఘాన్ని టిఎఫ్‌డిఎ 2.0గా తీర్చిదిద్దుతాం' అని తెలిపారు.

మైరాలాంటి సినిమాలు అవసరం

పద్మశ్రీ ఫీచర్స్ పతాకంపై కన్నడలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్మైల్ శ్రీను దర్శకత్వంలో తెలుగులో డైరెక్ట్‌గా వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మైరా'. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారిని ఈ చిత్ర దర్శకుడు స్మైల్ శ్రీను కలిసి మైరా చిత్ర స్క్రిప్ట్ పూజ చేయించి, ఆయన ఆశీస్సులు తీసుకున్నారు ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ, 'ఇలాంటి చిత్రాలు ఇప్పటి సమాజానికి చాలా అవసరం ప్రకృతికి విరుద్ధంగా జీవిస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్రస్తుత సమాజానికి ఈ చిత్రం ఎంతగానో ఉపయోగపడే సినిమా అవుతుంది. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో మాత్రమే కాకుండా అన్ని భాషల్లో పాన్ ఇండియా సినిమాగా తియ్యండి. ఇటువంటి మంచి చిత్రానికి నా శిష్యుల సపోర్ట్ ఉంటుంది' అని తెలిపారు. 'రామానుజ జీయర్ స్వామి వారి ఆశీర్వాదానికి అవకాశం కల్పించిన అనంత లక్ష్మి అక్కకి కృతజ్ఞతలు. ఆయనకు ఈ కథ ఎలా ఉంటుందో చెప్పగానే కథకు కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. అంతేకాదు ఈ సినిమాని అన్ని భారతీయ భాషల్లో తెరకెక్కించమని చెప్పారు. అలాగే ఈ చిత్రానికి తమ శిష్యులందరూ సపోర్ట్ చేస్తారని కూడా ఆయన చెప్పడం ఎంతో ఆనందంగా ఉంది. మేము చేస్తున్న ఈ చిత్రానికి తెలుగులో ఒక స్టార్ హీరోయిన్‌తో చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. మరిన్ని వివరాలు అతి త్వరలో ప్రెస్‌మీట్‌లో తెలియజేస్తాం' అని దర్శకుడు స్మైల్ శ్రీను అన్నారు.


చిన్న జీయర్‌స్వామి, స్మైల్ శ్రీను

డకెట్ ధనాధన్

ఆటలు

- బెన్ అజేయ శతకం
- ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 207/2

భారత్ తొలి ఇన్నింగ్స్ 445/10



రాజ్‌కోట్ : ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్ (133 నాటౌట్, 118 బంతుల్లో 21 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ దంచికొట్టాడు. 88 బంతుల్లోనే శతకం సాధించిన బెన్ డకెట్ రాజ్‌కోట్‌లో ఇంగ్లాండ్‌కు అదిరే ఆరంభాన్ని అందించాడు. బెన్ డకెట్ వన్‌మ్యాన్ షోతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలోనే 2 వికెట్లకు 207 పరుగులు చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌కు మరో 238 పరుగుల వెనుకంజలో నిలిచింది. అంతక ముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (112, 225 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతక విన్యాసానికి ఆరంభంలోనే తెరపడగా.. అరంగ్రేట ఆటగాడు ధ్రువ్ జురెల్ (46, 104 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రవిచంద్రన్ అశ్విన్ (37, 89 బంతుల్లో 6 ఫోర్లు) లోయర్ ఆర్డర్‌లో రాణించారు. ఇంగ్లాండ్ పేసర్ మార్క్‌వుడ్ నాలుగు వికెట్ల ప్రదర్శనతో మెరిశాడు.

డకెట్ దంచాడు

భారత్ నాలుగున్నర సెషన్లలో చేసిన స్కోరుకు.. కేవలం ఒకే ఒక్క సెషన్లో చేరువ చేశాడు బెన్ డకెట్. 21 ఫోర్లు, 2 సిక్సర్లతో చెలరేగిన డకెట్.. ఇంగ్లాండ్‌కు ధనాధన్ ఆరంభాన్ని అందించాడు. డకెట్ జోరుతో ఇంగ్లాండ్ ఓవర్‌కు 5.91 చొప్పున పరుగులు చేసింది. ఓపెనర్ జాక్ క్రాలీ (15), ఒలీ పోప్ (39)లు వికెట్ కోల్పోయారు. జో రూట్ (9 నాటౌట్)తో కలిసి బెన్ డకెట్ అజేయంగా నిలిచాడు. జాక్ క్రాలీ వికెట్‌తో భారత స్పిన్నర్ అశ్విన్ టెస్టుల్లో 500వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు.

రాణించిన ధ్రువ్

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ రెండో రోజు మరో 119 పరుగులు జోడించింది. ఐదు వికెట్లు చేతిలో ఉన్నప్పటికీ ఆతిథ్య జట్టు ఆశించిన స్కోరు సాధించ లేదు. సెంచరీ హీరో రవీంద్ర జడేజా ఆరంభంలోనే వికెట్ కోల్పోయాడు. దీంతో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్‌లు ఎనిమిదో వికెట్‌కు విలువైన భాగస్వామ్యం నమోదు చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా (26) సైతం మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగాడు. దీంతో 130 ఓవర్లలో 445 పరుగులకు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై భారత్ కనీసం ఓ వంద పరుగులు తక్కువ చేసిందనే అంచనాలు ఉన్నాయి!.

త్వరలోనే వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు

పెటా టిఎస్ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ



హైదరాబాద్ : వ్యాయామ విద్య ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి న్యాయ సమస్యలను పరిష్కరించి, త్వరలోనే పదోన్నతులు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అశ్వారావు పేట ఎమ్మెల్యే ఆదినారాయణతో కలిసి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ సంఘం (తెలంగాణ) నేతలు రాఘవరెడ్డి, పొన్నగాని కష్ణమూర్తి గౌడ్ తదితరులు శుక్రవారం ముఖ్యమంత్రిని అసెంబ్లీ ఆవరణలోని ఆయన కార్యాలయంలో కలిశారు. గత 14 సంవత్సరాలుగా ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పీఈటీలకు పదోన్నతులు లేవు. 2017, 2019లో 1849 పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా అప్‌గ్రేడ్ చేశారు. అప్‌గ్రేడేషన్‌కు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు న్యాయస్థానం పరిధిలో ఉన్నాయి. న్యాయ పరిధిలో ఉన్న అంశాలను పరిష్కరించి పీఈటీలకు అప్‌గ్రేడేషన్ కల్పించాలి. జీవో నం. 79 ప్రకారం జూనియర్ కాలేజ్‌లలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను 70 శాతం పదోన్నతుల ద్వారా, 30 శాతం నేరుగా నియామకం చేపట్టాలి. అందుకు సంబంధించి అడ్డుగా ఉన్న జీవో ఎం.ఎస్ నం.10ని తక్షణమే రద్దు చేయాలి. సుమారు 1500 ఉన్నత పాఠశాలలో పీఈటీ పోస్టులు లేవు. రానున్న మెగా డీఎస్సీలో 1500 పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వ్యాయాయ విద్య ఉపాధ్యాయులను సమస్యలను తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. అన్ని సమస్యలకు పరిష్కరిస్తామని పెటా టిఎస్ నేతలకు హామీ ఇచ్చారు.

ఉమెన్స్ చీఫ్ కోచ్‌పై వేటు

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ ప్రకటన

హైదరాబాద్ : హైదరాబాద్ మహిళల జట్టు చీఫ్ కోచ్ విద్యుత్ జయసింహను తక్షణమే విధులను నుంచి తప్పిస్తున్నట్టు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు ప్రకటించారు. అమ్మాయిలతో పాటు టీమ్ బస్‌లో వెళ్తూ విద్యుత్ జయసింహ మద్యం సేవిస్తూ కనిపించాడు. ఈ దృశ్యాలను మహిళా క్రికెటర్లు వీడియోలు తీసి మీడియాకు పంపించారు. హెచ్‌సీఏకు సైతం గుర్తుతెలియని ఈమెయిల్ నుంచి ఈ అంశంపై ఫిర్యాదు అందగా.. దానిపై దర్యాప్తునకు ఆదేశించారు. తాజాగా వీడియో ఆధారాలు బయటకు రావటంతో చీఫ్ కోచ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. భవిష్యత్‌లో విద్యుత్ జయసింహకు హెచ్‌సీఏలో ఎటువంటి బాధ్యతలు అప్పగించమని జగన్ తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.

బిజినెస్

పేటియం ఫాస్టాగ్ జారీపై నిషేధం

ఐహెచ్‌సీఎల్ నిర్ణయం



న్యూఢిల్లీ : పేటియం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) మరో ఎదురు దెబ్బ తగిలింది. తాజాగా ఫాస్టాగ్‌లు జారీ చేయకుండా నిషేధం విధించారు. ఎన్‌హెచ్ఏఐకి చెందిన ఇండియన్ హైవే మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్) అధీకృత బ్యాంకుల జాబితా నుంచి పేటియం బ్యాంక్‌ను తొలగించింది. పిపిబిఎల్‌పై ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యంలో ఐహెచ్‌సీఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. తాము ప్రకటించిన 32 బ్యాంకుల నుంచే ఫాస్టాగ్‌లు తీసుకోవాలని సూచించింది. భారత్‌లో ఎనిమిది కోట్ల మందికి పైగా ఫాస్టాగ్ వినియోగదారులు ఉన్నారని ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారి తెలిపారు. ఫాస్టాగ్ జారీల్లో పేటియంకు 30 శాతం వాటా ఉందన్నారు. గతేడాది జనవరిలో కూడా ఓ సారి పేటియం ఫాస్టాగ్‌ల జారీపై ఆంక్షలు విధించింది. ఇటీవల ఆర్‌బీఐ దాదాపు అన్ని పేటియం సేవలపై ఆంక్షలు ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 29 తర్వాత కొత్త అకౌంట్స్, డిపాజిట్లు, క్రెడిట్ ట్రాన్సాక్షన్స్ జరుపొద్దని జనవరి 31న ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆ సంస్థ ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపగా.. మరోవైపు స్టాక్ మార్కెట్‌లో పేటియం షేరు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ కేసులో పేటియం అధికారులను ఈడీ విచారిస్తోన్న విషయం తెలిసిందే.

మరో 15 రోజులు గడువు పెంపు..

పిపిబిఎల్‌కు ఆర్‌బిఐ ఇచ్చిన గడువును మరో 15 రోజులు పొడగించింది. ఫిబ్రవరి 29 తర్వాత కస్టమర్ల ఖాతాలు, డిపాజిట్లు, టాప్‌అప్‌లు స్వీకరించొద్దని గత నెల చివరన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీన్ని మార్చి 15 వరకు పొడగిస్తూ.. శుక్రవారం ప్రకటన చేసింది. ఖాతాదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ నగదు ఉపసంహరించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుందని సమాచారం.

నైక్‌లో వేలాది ఉద్యోగులకు ఉద్వాసన



న్యూయార్క్ : ప్రముఖ స్పోర్ట్‌వేర్ ఉత్పత్తుల తయారీదారు నైక్ ప్రపంచ వ్యాప్తంగా తమ కంపెనీలో పని చేస్తున్న వారిలో రెండు శాతం మందికి ఉద్వాసన పలికనుంది. దాదాపు 1600 కంటే ఎక్కువ సిబ్బందిని తొలగిస్తున్నట్టు ఆ సంస్థ చేసింది. వ్యయ నియంత్రణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. 2023 మే 31 నాటికి నైక్ కంపెనీలో దాదాపు 83,700 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో 12వేల మంది కంపెనీ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్నారు. కంపెనీ తొలగించనున్న ఉద్యోగులలో స్టోర్ ఉద్యోగులు, స్టోర్ మేనేజర్‌లు లేదా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సిబ్బంది ఉన్నారని తెలుస్తోంది. మొత్తం రెండు దశల్లో ఉద్యోగుల తొలగింపు ఉంటుందని నైక్ తెలిపింది. తొలి దశ ఫిబ్రవరి 16 నుంచే ప్రారంభమవుతుందని వెల్లడించింది. ఇక రెండో విడత తొలగింపులు నాలుగో త్రైమాసికం చివరి నుంచి ఉంటాయని పేర్కొంది. మూడవ త్రైమాసికంలో ఉద్యోగుల ఖర్చుల 400 మిలియన్ డాలర్ల నుంచి 450 మిలియన్ డాలర్ల వరకు పెరిగిందని తెలిపింది.

కీర్తిలాల్‌లో బంధన్ వివాహ కలెక్షన్ ప్రారంభం



హైదరాబాద్ : దేశంలోని ప్రముఖ ఆభరణాల సంస్థ కీర్తిలాల్స్ బంధన్ పేరుతో సరికొత్త వెడ్డింగ్ కలెక్షను ప్రారంభించినట్లు తెలిపింది. వివాహం సందర్భంగా ధరించే ప్రత్యేక వజ్రాభరణాల కలెక్షన్ తమ వద్ద రూపొందించబడిందని కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 'బంధన్' నిశ్చితార్థం, మెహందీ, సంగీత్ నుండి పెళ్లి రిసెప్షన్ వరకు వధువు యొక్క ప్రత్యేక ప్రయాణంలోని ప్రతి క్షణాన్ని చక్కగా తీర్చిదిద్దడానికి తమ ఆభరణాలు దోహదం చేస్తాయన్నారు. నేటి అధునాతన వినియోగదారుల విభిన్న అభిరుచులు ప్రాధాన్యతలను మిళితం చేయడంలో కీర్తిలాల్స్ అంకిత భావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

గో ఫస్ట్‌పై స్పైస్‌జెట్ దృష్టి

కొనుగోలుకు బిడ్డింగ్



న్యూఢిల్లీ : దివాలా తీసిన గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్‌ను స్వాధీనం చేసుకోవడానికి స్పైస్‌జెట్ ఛైర్మన్ అజయ్ సింగ్ ఆసక్తి చూపుతున్నారు. గో ఫస్ట్‌ను కొనుగోలు చేసేందుకు ఆయన బిడ్ దాఖలు చేశారు. ఇది సాధించుకోగలిగితే స్పైస్ జెట్ ఆపరేషన్స్‌కు సాయం అవుతుందని అజయ్ సింగ్ పేర్కొన్నారు. తన వ్యక్తిగత సామర్థ్యం ఆధారమే బిడ్ వేశామన్నారు. అపార సామర్థ్యం గల 'గో-ఫస్ట్' టేకోవర్ చేసుకోవడంతో రెండు సంస్థలకు లబ్ధి చేకూరనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గో-ఫస్ట్‌కు విలువైన బ్రాండ్ ప్రయాణీకులు ఉన్నారన్నారు. కార్పొరేట్ దివాలా చట్టం ప్రక్రియ పూర్తి చేయడానికి గో-ఫస్ట్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ మరో 60 రోజుల సమయం ఇచ్చింది. తమ సంస్థను టేకోవర్ చేసేందుకు మూడు సంస్థలు బిడ్ దాఖలు చేశాయని ఎన్‌సిఎల్‌టికి గోఫస్ట్ వెల్లడించింది. గోఫస్ట్ బ్యాంకుల నుంచి రూ.6,251 కోట్ల అప్పులు తీసుకొని చెల్లించడంలో విఫలమయ్యింది. దీంతో దివాలా ప్రక్రియకు వెళ్లడంతో గతేడాది మేలో తన విమాన సేవలను రద్దు చేసుకుంది.

రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ మృతి

ప్రకటించిన జైలు అధికారులు

మాస్కో : జైల్లో వున్న రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ మరణించినట్టు యమలో-నెనెట్స్ ప్రాంత ప్రిజన్ సర్వీస్ శుక్రవారం ప్రకటించింది. ఆ జైల్లోనే ఆయన తన శిక్షను అనుభవిస్తున్నారు. నడుస్తుండగా ఆయనకు అస్వస్థతగా అనిపించింది. ఆ వెంటనే స్పృహ కోల్పోయారని ప్రిజన్ సర్వీస్ ఒక ప్రకటనలో తెలిపింది. డాక్టర్లు ఆయన మరణించినట్లు ప్రకటించారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2గంటల తర్వాత ఈ సంఘటన చోటు చేసుకుందని రష్యన్ మీడియా సంస్థలు తెలిపాయి. స్పృహ కోల్పోయిన వెంటనే ఆయనను తెలివిలోకి తెప్పించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని, కానీ ఫలితం లేకోయిందని అధికారులు తెలిపారు. మరణానికి కారణాన్ని ఇంకా నిర్ధారించాల్సి వుంది. అయితే రక్తం గడ్డ కట్టడం వల్లనే ఆయన మృతి చెందినట్లు రష్యా టుడే వర్గాలు తెలిపాయి. సుదీర్ఘకాలంగా సాగిన అవినీతి కేసులో నావల్నీ 2021లో జైలుపాలయ్యారు. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఈ విషయం తెలియచేసినట్లు క్రెమ్లిన్ తెలిపింది. నావల్నీ తరపు న్యాయవాది లియోనిడ్ మాట్లాడుతూ, బుధవారం తాను ఆయనను కలిసి మాట్లాడానని, అప్పుడు ఆయన చాలా సాధారణంగా వున్నారని చెప్పారు. మృతిపై వ్యాఖ్యానించడానికి తిరస్కరించారు. గురువారం వీడియో లింక్ ద్వారా కోర్టు విచారణలో కూడా ఆయన పాల్గొన్నారు.

'ఆపరేషన్ లోటస్' ఎండగట్టేందుకే విశ్వాస తీర్మానం

ఢిల్లీ అసెంబ్లీలో సిఎం కేజ్రీవాల్

నేడు చర్చ

న్యూఢిల్లీ, అహ్మదాబాద్ : ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తప్పుడు కేసులు పెట్టి తమ పార్టీని విచ్ఛిన్నం చేసి, ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ ప్రారంభించిన 'ఆపరేషన్ లోటస్'ను ఎండగట్టేందుకే విశ్వాస పరీక్షను ఎదుర్కొంటున్నామని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోసారి సమన్లు జారీ చేయడం, ఢిల్లీ కోర్టుకు హాజరు కావాల్సి ఉండటంతో ఆయనను అరెస్టు చేయవచ్చని వార్తలు వస్తున్న నేపథ్యంలో కేజ్రీవాల్ శుక్రవారం అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. స్పీకర్ రామ్‌నివాస్ గోయల్ ఈ తీర్మానాన్ని ఆమోదించారు. శనివారం ఉదయం 11 గంటలకు ఈ తీర్మానం అసెంబ్లీలో చర్చకు రానుంది. ఈ సందర్భంగా అసెంబ్లీలో కేజ్రీవాల్ మాట్లాడుతూ ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ సభ్యులు సంప్రదించారనీ, త్వరలో ఢిల్లీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేస్తారని వారు చెప్పారని పేర్కొన్నారు. 21 ఆప్ ఎమ్మెల్యేలు పార్టీని వీడేందుకు అంగీకరించారని, మరికొందరిని సంప్రదిస్తామని బీజేపీ నాయకులు వారికి చెప్పారని సీఎం తెలిపారు. బీజేపీలో చేరితే రూ.25 కోట్లు ఇస్తామని చెప్పారని అన్నారు. బీజేపీ ప్రతిపాదనను తాము అంగీకరించలేదని ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు తనకు చెప్పారని, ఇతర ఎమ్మెల్యేలతో మాట్లాడగా ఈ ప్రతిపాదన వచ్చిందని, అంగీకరించలేదని మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు చెప్పారని అన్నారు. 'ఆపరేషన్ లోటస్'ను ఢిల్లీలో అమలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ పరిణామాలతో మద్యం పాలసీ కుంభకోణంపై వచ్చిన ఆరోపణలు ఆ స్కామ్ గురించి కాదని స్పష్టమవుతోందని అన్నారు. ఆధారాలను బయటపెట్టాలంటూ బీజేపీ నేతలు ప్రతిదాడి చేశారు.

కేజ్రీవాల్ పిటిషన్ కొట్టివేసిన గుజరాత్ హైకోర్టు

ప్రధాని మోడీ విద్యార్హతలకు సంబంధించి గుజరాత్ యూనివర్సిటీ తమపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో సమన్లను రద్దు చేయాలని కోరుతూ కేజ్రీవాల్ పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఆయనతోపాటు మరో ఆప్‌నేత సంజయ్ సింగ్ పిటిషన్‌ను కూడా తిరస్కరించింది.

గొర్రెలు, గేదెలు రోడ్డుపై నిలిపి నిరసన

నవతెలంగాణ-కారేపల్లి



ఖమ్మం జిల్లా కారేపల్లి మండ లంలో గొర్రెలు, గేదెలను జాతీయ రహదారిపై నిలిపి వినూత్నంగా గ్రామీణ బంద్ నిర్వహించారు. శుక్రవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్ పిలుపులో భాగం గా కారేపల్లి ప్రధాన వీధుల్లో అఖిల పక్షం నాయకులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో గొర్రెలు, గేదెలను నిలిపి నిరసన తెలిపారు. రైతు, కూలీలు, కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ విధానాలను వ్యతిరేకిం చాలని నినదించారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కారేపల్లి క్రాస్ రోడ్‌లో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, నాయకులు కొండెబోయిన నాగేశ్వరరావు, కే.నరేంద్ర, వజ్జా రామారావు, తలారి దేవప్రకాశ్, ముండ్ల ఏకాంబరం, పాసిన్ని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన ఎస్‌హెచ్‌ఓ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఓదెల వెంకటేష్ శుక్రవారం హైకోర్టు విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఒక జడ్జి కుమారుడిపై ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 14న ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. ఒకరోజు ఆలస్యంగా ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేశారని హైకోర్టు ప్రశ్నించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై బాధిత మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఎఫ్ఐఆర్ జాప్యంపై ఎస్‌హెచ్‌ఓ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని చెప్పింది. విచారణను మార్చి 4కి వాయిదా వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వాళ్లు చేసే ఫిర్యాదులను ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనీ, దర్యాప్తులో ఆ ఫిర్యాదులోని ఆరోపణలు అవాస్తవమని తేలితే అందుకు అనుగుణంగా తుది నిర్ణయం ఉండాలని చెప్పింది. ఇలాంటి అంశాలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వాళు ఇచ్చే ఫిర్యాదులను స్వీకరించితీరాలని చెప్పింది. డీజీపీకి పలు సూచనలు చేసింది. పోలీసుల ప్రవర్తన శైలి మారాలని చెప్పింది, ప్రజలతో ఎలా వ్యవహరించాలో పోలీసులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించింది. ఇందుకు సంబంధించిన విషయాల గురించి సర్క్యులర్ జారీ చేయాలనీ, ప్రజలకు ఉపయోగపడేలా సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్దేశించింది.

అమెరికా ప్రతినిధుల సభ నిరవధిక వాయిదా

ఉక్రెయిన్‌కు సహాయ బిల్లు ఆమోదించకుండానే...

ప్రపంచం

న్యూయార్క్ : ఉక్రెయిన్‌కు సహాయం కోసం ఉద్దేశింపబడిన బిల్లును ఆమోదించకుండానే అమెరికా ప్రతినిధుల సభ నిరవధికంగా వాయిదాపడింది. ఉక్రెయిన్, ఇజ్రాయిల్, తైవాన్‌లకు 95 బిలియన్ డాలర్ల అదనపు సహాయం కోసం ప్రవేశపెట్టిన బిల్లును అమెరికా ప్రతినిధుల సభ ఆమోదానికి సిద్ధపడటానికి కారణం మెక్సికో సరిహద్దు భద్రతకు నిధులను కేటాయించాలని రిపబ్లికన్లు చేస్తున్న డిమాండ్‌ను డెమోక్రాట్లు అంగీకరించకపోవటమే. అనేక నెలలపాటు చర్చించినా అమెరికాలోని రెండు ప్రధాన పార్టీల మధ్య ఈ విషయంపై ఎటువంటి ఒప్పందం కుదరలేదు. ఈ బిల్లులో 60 బిల్లియన్ డాలర్లు ఉక్రెయిన్‌కు, 14 బిల్లియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఇజ్రాయిల్‌కు, ఇండో-పసిఫిక్‌లోని అమెరికా మిత్రులకు ఎనిమిది బిల్లియన్ డాలర్లను కేటాయించాలని నిర్ణయించారు. ఇవేకాకుండా ప్రపంచవ్యాప్తంగా అమెరికా సైనిక కార్యకలాపాలకు మద్దతుగా చేసిన కేటాయింపులతో కలుపుకుని ఈ బిల్లు 95బిల్లియన్ డాలర్లగా ప్రతినిధుల సభ ముందుకొచ్చింది.

అమెరికా దక్షిణ సరిహద్దు భద్రత కోసం నూతనంగా నిధులను కేటాయించకుండా ఉక్రెయిన్‌కు అదనపు సహాయాన్ని అంగీకరించే ప్రసక్తేలేదని రిపబ్లికన్లు పదేపదే చెప్పారు. అమెరికాలో ఎన్నడూలేనంత స్థాయిలో చట్టవిరుద్ధంగా ప్రవేశించేవారి వెల్లువను నిలువరించవలసిన అవసరం ఉందని రిపబ్లికన్లు గట్టిగా వాదిస్తున్నారు. సరిహద్దు భద్రత విషయం తేలకుండా మరే బిల్లునూ ఆమోదించటానికి రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులు సిద్ధపడటం జరగదని ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ స్పష్టం చేశారు. అయితే ఇదే బిల్లును సెనెట్ ఆమోదించింది. అమెరికా ప్రతినిధుల సభలో ఈ బిల్లుపైగల ప్రతిఘటన సెనెట్‌లో లేదు. ఉక్రెయిన్ పట్ల అమెరికా విధానంలో ఏమాత్రం దూరదృష్టి లేకపోగా ఆత్మ వినాశకరంగా కూడా ఉందని ఈ బిలును విమర్శిస్తూ ప్రముఖ జర్నలిస్టు టకర్ కార్లసన్ అన్నారు. 'ఉక్రెయిన్‌కు గానీ, నాటో, అమెరికాలకు సైతంగానీ పారిశ్రామిక సామర్థ్యం లేదు. ఉక్రెయిన్ కంటే రష్యాకు 100మిలియన్ల జనాభా అధికంగా ఉంది. ఉక్రెయిన్‌కు అదనంగా పశ్చిమ దేశాలు సైనిక సహాయం చేయటం జరిగితే మరింత మంది ఉక్రేనియన్లు చనిపోతారని, పశ్చిమ దేశాల ఆర్థిక పరిస్థితి మరింతగా క్షీణిస్తుందని అర్థం' అని ఆయన రాశాడు. ఉక్రెయిన్‌కు అదనపు నిధులు అందజేయటం అత్యంత క్రూర చర్య అని టకర్ కార్లసన్ చేసిన వ్యాఖ్యను రిపబ్లికన్ సెనేటర్ జెడి. వ్యాన్స్ అంగీకరిస్తూ దాని వెనుక పెద్ద కుట్ర ఉందని అన్నారు. ఈ బిల్లు గనుక ఆమోదింపబడితే అది 2024 అనంతరం కూడా వ్యయం చేయటానికి వీలుంటుంది. నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి ఉక్రెయిన్ సైన్యానికి సహాయం అందించటం అనివార్యమవుతుంది.

మూడవ స్థానాన్ని కోల్పోయిన జపాన్ ఆర్థిక వ్యవస్థ



బెర్లిన్ : గత సంవత్సరం చివరలో ఏర్పడిన మాంద్యంవల్ల జపాన్ తన మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానాన్ని కోల్పోయిందని గురువారంనాడు విడుదలైన అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. నామినల్ స్థూల జాతీయోత్పత్తి ఆధారంగా చూస్తే ఆ స్థానాన్ని జర్మనీ ఆక్రమించింది. గత సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో జపాన్ స్థూల జాతీయోత్పత్తి 0.4శాతం కుదింపుకు గురైంది.

అంతకు ముందు త్రైమాసికంలో 3.3శాతం పతనమైంది. అంతిమ త్రైమాసికం కంటే 1.4శాతం ఎక్కువగా పతనమవుతుందనే అంచనాల నడుమ జపాన్‌లో మాంద్యం నెలకొంది. సాంకేతికంగా రెండు త్రైమాసికాలలో వరుసగా ఒక ఆర్థిక వ్యవస్థ కుదింపుకు గురైతే మాంద్యం ప్రవేశించిందని చెబుతారు. నాలుగవ త్రైమాసికంలో ప్రయివేటు వినిమయం 0.9శాతం పతనం అయింది. కార్పొరేట్ పెట్టుబడి కూడా 0.3శాతం తగ్గింది. ఎగుమతులు 11శాతం పెరిగాయి. దిగుమతులు 7శాతం పెరిగాయి.

డాలర్లలో లెక్కించినప్పుడు 2023 చివరలో జపాన్ స్థూల జాతీయోత్పత్తి 4.2ట్రిల్లియన్లు ఉండగా, జర్మనీ స్థూల జాతీయోత్పత్తి 4.5 ట్రిల్లియన్లుగా ఉంది. అయితే పర్చేస్ పవర్ ప్యారిటీ (పీపీపీ) ఆధారంగా చేసే లెక్క మరోలా ఉంటుంది. దేశాల మధ్య వస్తువుల, సేవల విలువలలో తేడాలను సర్దుబాటు చేసి ఆర్థిక ఉత్పాదన, జీవన ప్రమాణాలను పోల్చే పద్ధతిని పర్చేస్ పవర్ ప్యారిటీ(పీపీపీ) అంటారు. ప్రపంచ బ్యాంకు పర్చేస్ పవర్ ప్యారిటీ(పీపీపీ) ఆధారంగా చేసిన అంచనా ప్రకారం 2022లో చైనా ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో అత్యున్నత స్థానంలో ఉంది. రెండవ స్థానంలో అమెరికా, ఆ తరువాత స్థానాలలో ఇండియా, జపాన్‌లు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో ఐదవ స్థానంలో వున్న జర్మనీని రష్యా అధిగమించిందని చెబుతున్నారు.

జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 కౌంట్‌డౌన్

నేడు అంతరిక్షంలోకి ఇన్‌శాట్ 3-డీఎస్ ఉపగ్రహం

సూళ్లూరుపేట (తిరుపతి) : జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 కౌంట్‌డౌన్ శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు ప్రారంభమైంది. 27.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 రాకెట్‌ను ప్రయోగిస్తారు. మొత్తం 2272 కిలోల బరువు కలిగిన ఇన్‌శాట్ 3-డీఎస్ శాటిలైట్‌ను భూ స్థిర కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు రాకెట్‌ను ప్రయోగించనున్నట్టు ఛైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జిఎస్-ఎల్‌వి) సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం. పూర్తి స్వదేశీ క్రయోజనిక్ ఇంజన్‌తో ఈ రాకెట్‌ను రూపొందించారు. మూడు దశలతో నిర్మించిన ఈ రాకెట్ 19 నిమిషాల్లోనే అంతరిక్ష కక్ష్యకు చేరేలా శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించారు. 167 కిలోమీటర్లు 173 మీటర్ల పెరిజి, 33,540 కిలోమీటర్లు, 40,781 కిలోమీటర్ల అపోజీల మధ్య వత్తాకార కక్ష్యలో ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు. షార్‌కు ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ చేరుకొని ప్రయోగ సన్నాహాలు చేపట్టారు.

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

ద్రౌపది ముర్ముకు జాతీయ ఎస్‌సీ కమిషన్ నివేదిక

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలిలో మహిళలపై టీఎంసీ గూండాలు వేధింపులకు పాల్పడుతున్న ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జాతీయ ఎస్‌సీ కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) బృందం నివేదికను సమర్పించింది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని నివేదిక సిఫార్సు చేసినట్టు ఎన్‌సీఎస్‌సీ అధ్యక్షులు అరుణ్ హల్దర్ శుక్రవారం మీడియాకు తెలిపారు. టీఎంసీ నాయకుడు షాజహాన్ షేక్, అతని మద్దతుదారులు తమ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని, తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని భారీ సంఖ్యలో మహిళలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో సందేశ్‌ఖలిని గురువారం ఎన్‌సీఎస్‌సీ బృందం సందర్శించింది. శుక్రవారం నివేదికను సమర్పించిన తరవాత మీడియాతో మాట్లాడుతూ అరుణ్ హల్దర్ ఆ ప్రాంతంలో జరుగుతున్న దారుణాలను క్లుప్తంగా వివరించారు. ఎస్‌సీ హక్కులను కాపాడేందుకు ఉద్దేశించిన ఆర్టికల్ 338 ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సిఫార్సు చేసినట్టు తెలిపారు. ఈ అంశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కమిషన్‌కు రాష్ట్రపతి హామీ ఇచ్చినట్టు అరుణ్ హల్దర్ చెప్పారు. అలాగే, సందేశ్‌ఖలిలో సందర్శించకుండా అడ్డుకునేందుకు టీఎంసీ ప్రభుత్వం ప్రయత్నించిందని, తమ పర్యటన కోసం ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని ఆరోపించారు. నేరస్థులతో టిఎంసి ప్రభుత్వం కుమ్మక్కయిందని విమర్శించారు. సందేశ్‌ఖలిలో జరిగిన హింస ఇతర ఎస్‌సి ప్రజలపై కూడా ప్రభావం చూపుతుందని హల్దర్ తెలిపారు. దేశంలో ఎస్‌సి జనాభా విషయంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం రెండోస్థానంలో ఉన్న విషయాన్ని హల్దర్ గుర్తు చేశారు. ఈ హింసాకాండపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కమిషన్ నోటీసు కూడా పంపిందని తెలిపారు.

కాగా, రేషన్ కుంభకోణం కేసు విచారణలో భాగంగా జనవరి 5న ఈడీ అధికారులు షాజహాన్ షేక్ నివాసంపై సోదాలు జరిపినప్పటి నుంచి అతను పరారీలో ఉన్న విషయం తెలిసిందే. షేక్ అనుచరుడు సిబ్బు హజ్రా కూడా పరారీలో ఉన్నాడు. పరారీలో ఉన్న షేక్‌ను వెంటనే అరెస్టు చేయాలని సందేశ్‌ఖలి మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్, బీజేపీ నాయకుల అడ్డగింత

సందేశ్‌ఖలిలో పర్యటించకుండా కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరిని మార్గమధ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు అడ్డుకున్నారు. రాంపూర్ గ్రామంలో శుక్రవారం అధిర్ రంజన్‌ను అడ్డుకోవడంతో ఆయన అక్కడే రోడ్డుపై ఆందోళనకు దిగారు. అలాగే మరోవైపు బీజేపీ నాయకులను కూడా అదే గ్రామంలో పోలీసులు అడ్డుకున్నారు. సందేశ్‌ఖలి ఘటనపై నిజనిర్ధారణ కమిటిని బీజేపీ అధ్యక్షులు జెపి నడ్డా ఏర్పాటు చేశారు. ఇందులో కేంద్ర మంత్రులు అన్నపూర్ణ దేవి, ప్రతిమా భౌమిక్, ఎంపీలు సునీతా దుగ్గల్, కవితా పటిదార్, సంగీతా యాదవ్, బ్రిజ్‌లాల్ ఉన్నారు. ఈ బృందం సందేశ్‌ఖలి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో రాంపూర్ గ్రామంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకుంది. బీజేపీ నాయకులు కొన్ని గంటలపాటు రోడ్డుపై ఆందోళనకు దిగారు. కొంతమంది బాధిత మహిళలతో బీజేపీ నాయకులు వీడియో కాల్‌లో మాట్లాడారు. తరువాత ఈ విషయంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం కోసం రాజ్‌భవన్‌కు వెళ్లారు.

మా పిటీషన్‌ను అత్యవసరంగా విచారించండి

సుప్రీంకోర్టును కోరిన శరద్‌పవార్

న్యూఢిల్లీ : ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా తాము దాఖలు చేసిన పిటీషన్‌ను అత్యవసరంగా విచారించాలని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) వ్యవస్థాపకులు శరద్‌పవార్ శుక్రవారం సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఎన్‌సీపీ పేరు, గుర్తును అజిత్‌పవార్ గ్రూపునకు కేటాయిస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 12న సుప్రీంకోర్టులో పిటీషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటీషన్‌ను అత్యవసరంగా విచారించాలని, వీలైయితే సోమవారం నుంచి విచారణ ప్రారంభించాలని శుక్రవారం మరోసారి అభ్యర్థించారు. శరద్‌పవార్ అభ్యర్థనను పరిశీలిస్తామని సీజేఐ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం హామీ ఇచ్చింది.

హాస్టల్ గదిలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ-హాజీపూర్



మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురభీం-ఆసిఫాబాద్ జిల్లా గోండుగూడకు చెందిన టేకం శ్రీవర్ధన్(17) మంచిర్యాలలోని మిమ్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. స్థానికంగా ప్రయివేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఏమైందో ఏమోగానీ గతంలోనూ ఆత్మహత్యకు యత్నించాడు. గురువారం రాత్రి హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్నేహితులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. శ్రీవర్ధన్ తండ్రి గతంలోనే మృతిచెందగా, తల్లి అంజుబాయి అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తోంది. ఒక సోదరి ఉంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ వచ్చింది.. నాలెడ్జ్ తగ్గింది

- పరిశోధనల్లో తగ్గిన ప్రామాణికత
- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ ఎన్.గోపీ

- సాహిత్యం మానవీయతను బోధిస్తుంది: ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.ఆర్.లింబాద్రి
- భాషా సాహిత్యాలలో సృజనాత్మకత పెరగాలి : ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీనివాస్
- ఓయూలో ఘనంగా తెలుగు తొలి సాహిత్య మహాసభ

నవతెలంగాణ-ఓయూ

సమాజంలో సెల్‌ఫోన్ రాకతో చాలా మందిలో అధ్యయనాలోపంతో నాలెడ్జ్ తగ్గిపోతోందని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ.ఎన్.గోపీ అన్నారు. హిస్టరీ కాంగ్రెస్, సైన్స్ కాంగ్రెస్ వలె, తెలుగు లిటరరీ కాంగ్రెస్ నేటి చారిత్రక అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నిర్వహించిన సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024 కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన ఈ సదస్సులో తెలుగు భాషా సాహిత్యాల మీద విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రొ.ఎన్ గోపి మాట్లాడుతూ.. సాహిత్య పరిశోధనల మీద విలువైన అభిప్రాయాలు తెలియజేశారు. గతంలో మూల గ్రంథాలను అధ్యయనం చేసి పరిశోధన చేసేవారని, కానీ నేడు పరిశోధనలో ప్రామాణికత తగ్గిపోయిందన్నారు. వేమన మీద పరిశోధన చేయాలంటే తాళపత్రాలను చదివి పద్యాలను ఎత్తి రాసుకునేవాళ్లం.. ఫలితంగా జ్ఞాన ప్రసారం జరిగిందన్నారు. పుస్తకాన్ని ముట్టుకుంటేనే దాని తత్వం అర్థమవుతుందని చెప్పారు. తెలుగు భాషను సాహిత్యాన్ని విస్తరించాలంటే అధ్యయన సంస్కృతిని పెంచాలన్నారు. విశ్వవిద్యాలయాలు జ్ఞానానికి నిలయాలుగా ఉన్నప్పుడే సమాజ నిర్మాణం ప్రగతిదాయకంగా ఉంటుందని చెప్పారు.

ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.ఆర్.లింబాద్రి మాట్లాడుతూ.. ఏ శాస్త్రాలను బోధించని మానవీయతను సాహిత్యం బోధిస్తుందని, సాహిత్యం చదివితే సమాజం సున్నితంగా మారుతుందని అన్నారు. సామాజిక శాస్త్రం విద్యార్థిగా సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ఆసక్తిగా ఉంటుందన్నారు. తెలుగు టీచర్స్ ఎంతో ప్రేరణ కల్గిస్తారని, సమాజాన్ని ప్రభావితం చేస్తారని చెప్పారు. గద్దర్ పాట తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిందన్నారు. వేమన పద్యాలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తాయని, టీఎల్ఎస్ ఏర్పాటు హర్షణీయం అన్నారు.

ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. భాషా సాహిత్యాలను అధ్యయనం చేయడం వల్ల ఉపాధి కూడా పొందే అవకాశం ఉండాలని, అప్పుడే సాహిత్యం చదివే వారి సంఖ్య పెరుగుతుందని అన్నారు. భాషా సాహిత్యాలలో సృజనాత్మకత పెరగాలంటే విశ్వవిద్యాలయాల కృషి ఎక్కువగా ఉండాలని చెప్పారు. ఆంగ్ల భాషకు సమానార్థాలు కలిగిన పదాలను సృష్టించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. తెలుగు భాష సాహిత్య విస్తృతి పెరగాలంటే విడివిడి వ్యక్తులందరూ ఒక సమూహంగా ఏర్పడాలని కోరారు. తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.కిషన్‌రావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ మాట్లాడారు.

తెలుగు లిటరరీ కాంగ్రెస్ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరించిన ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొ.చింతకింది కాశీం ఈ ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, వివిధ సాహిత్య సంస్థలు కలిసి ఒకే వేదికగా ఏర్పడాలని కాశీం ఆకాంక్షించారు. అందుకోసమే హిస్టరీ కాంగ్రెస్ సైన్స్ కాంగ్రెస్ వలె తెలుగు లిటరరీ కాంగ్రెస్ ఏర్పడాలన్న లక్ష్యం ఈ సదస్సుకు ఉందని చెప్పారు. 100 ఏండ్ల విభాగం ప్రగతిని వివరించారు. సాహిత్యం సమాజ ప్రతిబింబం అని, డిగ్రీ 3వ, సంవత్సరం కవిత్వం, నవలలు, సాహిత్యం రాయడంపై సిలబస్ రూపొందించామన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూచన ప్రోత్సాహంతోనే టీఎల్ఎస్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు శాఖల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, పాఠశాల తెలుగు టీచర్లు, తెలుగు విభాగం ప్రొఫెసర్స్ ప్రొ.ఎస్.కమలాకర శర్మ, ప్రొ.సూర్యధనుంజయ్, డా.విజయలక్ష్మి, డా.ఎస్.రఘు, తెలుగు శాఖ ఎం.ఎ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.